## రోజూ 2 వేల మందికి అన్నదానం
యాదగిరిగుట్ట పాలక మండలి నిర్ణయం



2

మనం
జనం కోసం అక్షర యజ్ఞం..
హైదరాబాద్ - శనివారం 15 ఆగస్టు 2026 | సంపుటి: 10 | సంచిక: 221 | పేజీలు:12 | వెల రూ.5

## భార్యకు ప్రేమతో.. ఇట్లు, ఓ 'పూల'దాసు



2



దేశానికి రాజ్యాంగమే దిక్సూచి..

# క్లిష్ట పరిస్థితుల్లోనూ బలమైన ఆర్థిక వ్యవస్థగా భారత్



స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా జాతినుద్దేశించి ప్రసంగించిన రాష్ట్రపతి ముర్ము

**ఢిల్లీ, ఆగష్టు 14:** వికసిత్ భారత్-2047 లక్ష్యంగా అందరూ పనిచేయాలని రాష్ట్రపతి ద్రౌపదీముర్ము పిలుపునిచ్చారు. క్లిష్ట పరిస్థితుల్లోనూ భారత్ బలమైన ఆర్థిక వ్యవస్థగా నిలిచిందని చెప్పారు. స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని జాతినుద్దేశించి రాష్ట్రపతి ప్రసంగించారు. దేశానికి రాజ్యాంగమే దిక్సూచి అని.. దాన్ని గౌరవించాలని కోరారు. 'జన్‌ధన్ ద్వారా దేశవ్యాప్తంగా

...మిగతా 2లో






## డిసెంబర్ 7,8,9 తేదీల్లో

# ఇన్వెస్ట్ తెలంగాణ థీమ్‌తో గ్లోబల్ సమ్మిట్

- క్యూర్ పరిధిలోని ఆటోలను ఈవీలుగా మార్చేందుకు సబ్సిడీ
- ఐటీఐ, ఏటీసీ, పాలిటెక్నిక్‌లు తిరిగి యంగ్ ఇండియా స్కిల్ వర్సిటీ పరిధిలోకి
- హిల్ట్ పాలసీ దరఖాస్తుల గడువు అక్టోబర్ 31 వరకు పెంపు
- కేంద్రం కొనుగోలు చేయగా మిగిలిన ధాన్యం ఈ వేలం ద్వారా విక్రయం
- రాష్ట్ర మంత్రివర్గ సమావేశంలో కీలక నిర్ణయాలు

**హైదరాబాద్, ఆగస్టు 14, (మనం బ్యూరో):** ఈ ఏడాది డిసెంబర్ 7,8,9 తేదీల్లో ఇన్వెస్ట్ తెలంగాణ థీమ్‌తో గ్లోబల్ సమ్మిట్ 2ను నిర్వహించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. పంద్రాగస్టు సందర్భంగా శుక్రవారం రాష్ట్రవ్యాప్తంగా స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించాలని తీర్మానించింది. క్యూర్ పరిధిలో ప్రస్తుతం ఉన్న 18766 ఆటోలను ఈవీలుగా మార్చేందుకు పూర్తి సబ్సిడీ ఇవ్వాలని నిర్ణయించింది. శుక్రవారం రాష్ట్ర సచివాలయంలో సీఎం రేవంత్ రెడ్డి అధ్యక్షతన మంత్రివర్గ సమావేశం జరిగింది. అనంతరం ఏర్పాటు చేసిన మీడియా ప్రతినిధుల సమావేశంలో మంత్రులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి, అడ్లూరి లక్ష్మణ్, ఎంపి రఘురామిరెడ్డి వివరాలను వెల్లడించారు. మూడు గంటల పాటు జరిగిన ఈ భేటీలో పలు కీలక నిర్ణయాలు తీసుకున్నారు. గత ఏడాది తరహాలోనే ఈ ఏడాది కూడా డిసెంబర్ 7,8,9 తేదీల్లో తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్ 2.0 నిర్వహించాలని మంత్రివర్గం నిర్ణయించామనీ, ఇందుకోసం డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క నేతృత్వంలో మంత్రులు శ్రీధర్ బాబు, ఉత్తమ్ కుమార్ రెడ్డి, వివేక్‌తో క్యాబినెట్ సబ్

...మిగతా 2లో

## జీవితాలు చితికిపోయినయ్.. కుటుంబాలు చెదిరిపోయినయ్

'పార్టిషన్ హరర్స్ రిమెంబరెన్స్ డే'లో ప్రధాని మోడీ



**ఢిల్లీ, ఆగష్టు 14:** దేశ విభజన ఎన్నో జీవితాలను చిన్నాభిన్నం చేసిందని ప్రధాని మోడీ అన్నారు. ఆ విభజన కారణంగా నష్టపోయిన బాధితుల ధైర్యాన్ని ప్రధాని కొనియాడారు. ప్రతి ఏటా స్వాతంత్ర్య దినోత్సవానికి ముందు రోజు కేంద్రం నిర్వహించే 'పార్టిషన్ హరర్స్ రిమెంబరెన్స్ డే'లో ప్రధాని ప్రసంగిస్తూ.. ''ఈ విభజన ఎన్నో జీవితాలను చిన్నాభిన్నం చేసింది. మరెన్నో కుటుంబాలు చెల్లాచెదురయ్యాయి. నాటి విభజన గాయాల బాధితులు ప్రియమైన వారిని కోల్పోయారు. అంతులేని బాధను అనుభవించారు. ప్రతికూలతలను విజయంగా మార్చుకున్నారు. దేశ ప్రగతికి దోహదపడ్డారు. సామరస్యం, సౌభ్రాతృత్వాన్ని పరిరక్షించడానికి, వికసిత్ భారత్ నిర్మాణానికి సమష్టిగా కృషిచేసేలా వారి జీవితాలు మనందరికి స్ఫూర్తినిస్తాయి'' అని ఆయన అన్నారు.

## నేటి నుంచి స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ

సంగారెడ్డిలో ప్రారంభించనున్న సీఎం

**హైదరాబాద్, ఆగష్టు 14:** పంద్రాగస్టు సందర్భంగా స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీకి ప్రభుత్వం శనివారం శ్రీకారం చుట్టనుంది. ముందుగా సీఎం రేవంత్, మంత్రి ఉత్తమ్ సంగారెడ్డిలో ఈ కార్యక్రమాన్ని ప్రారంభించిన అనంతరం జిల్లాల్లో ఇంచార్జి మంత్రులు కార్డులను పంపిణీ చేస్తారు. జిల్లాల కలెక్టరు, ఆర్డీఓలు పర్యవేక్షిస్తారు.



## భార్యకు ప్రేమతో.. ఇట్లు, ఓ 'పూల'దాసు

బీజింగ్, ఆగష్టు 14: తన భార్య ఇష్టపడిందని దాదాపు 200 ఎకరాల్లో ఒక పూలతోటను పెంచి ఆమెకు కానుకగా ఇచ్చాడు ఒక భర్త శిఖామణి. ఆ తోట ఇప్పుడు ప్రపంచంలోనే అతిపెద్ద హోలీహాక్ గార్డెన్ గా పేరుపొందింది. చైనాలో డ్రీమ్ కపల్ గా పేరొందిన జో జియోలిన్, యిన్ జీ.. జువాన్లాంగ్ ప్రాంతంలో దాదాపు 197 ఎకరాల్లో హోలీహాక్ గార్డెన్ ను వృద్ధి చేశాడు. హోలీహిక్స్‌తో తనకున్న అనుబంధం, అవంటే తనకున్న ఇష్టం గురించి ఓసారి యిన్ తన భర్తకు చెప్పారు. దీంతో, ఆమె కోసం ఒక తోటను నిర్మించాలని నిర్ణయించుకున్నాడుజియోలిన్. వెంటనే తన ఇంటిని అమ్మేసి జువాన్ లాంగ్ లో భూమి కొన్నారు. పదేళ్ల పాటు ఆ పూల మొక్కల పెంపకం కొనసాగించాడు. ఒక లోయ ప్రాంతాన్ని క్రమంగా విస్తరిస్తూ ప్రపంచంలోనే అతిపెద్ద హోలీహాక్ గార్డెన్ను ఆయన ఏర్పాటు చేశారని చైనా మీడియా కథనాలు వెల్లడిస్తున్నాయి.

## యాదగిరిగుట్టలో రోజూ 2 వేల మందికి అన్నదానం

భువనగిరి, ఆగష్టు 14: ప్రముఖ పుణ్యక్షేత్రం యాదగిరిగుట్ట ఆలయ అభివృద్ధి కోసం, భక్తుల సౌకర్యాల కోసం పాలక మండలి కీలక నిర్ణయాలు తీసుకుంది. మొత్తం 26 అంశాలకు ఆమోదం తెలిపింది. కొండపై దీక్షాపరుల, నిత్యకల్యాణ మండపాల ఏర్పాటు, మెట్ల మార్గంలో షెడ్లు, వేద పాఠశాల, గోశాల, రాయగిరి వద్ద భారీ కమాన్ నిర్మాణాలు చేపట్టాలని నిర్ణయించింది. రోజూ 2వేల మంది భక్తులకు అన్నదానం అందించేందుకు నిర్ణయం తీసుకుంది.

ఆర్జిత సేవలు, నిత్య కైంకర్యాలకు టీసీఎస్ ఆధ్వర్యంలో ఆన్ లైన్ సౌకర్యం కల్పించేందుకు పాలకమండలి ఆమోదం తెలిపింది. భక్తుల కోసం ప్రత్యేక సబ్ కమిటీల ఏర్పాటుకు నిర్ణయం తీసుకుంది. కొండ చుట్టూ ప్రధాన కూడళ్ల వద్ద రాతి విగ్రహాల ఏర్పాటు, తులసి కాటేజీలో రెండు కల్యాణ కట్టల నిర్మాణానికి ట్రస్ట్ బోర్డు ఆమోదం ముద్ర వేసింది. దాతల కోసం కొండపై ప్రత్యేక కార్యాలయం, గిరిప్రదక్షిణ మార్గంలో సోలార్ వ్యవస్థ ఏర్పాటు చేయాలని నిర్ణయించింది.

## క్లిష్ట పరిస్థితుల్లోనూ బలమైన ఆర్థిక వ్యవస్థగా భారత్

(మొదటి పేజీ తరువాయి)

59 కోట్ల మందికి బ్యాంకు ఖాతాలు అందించాం. 80 కోట్ల మందికి రేషన్ సరకులు అందజేస్తున్నాం. ఆయుష్మాన్ భారత్ ద్వారా 60 కోట్ల మందికి వైద్యసేవలు అందుతున్నాయి. కిసాన్ సమ్మాన్ నిధి ద్వారా వ్యవసాయం, అనుబంధ రంగాలు బలోపేతమయ్యాయి. సంక్షేమం, అభివృద్ధిని సమన్వయం చేస్తూ ముందుకు సాగాలి. ప్రపంచంలోనే అతిపెద్ద డిజిటల్ మౌలిక సదుపాయాలు ఏర్పాటు చేసుకున్నాం. కుగ్రామాల్లోనూ డిజిటల్ చెల్లింపులు చేస్తున్నారు. ప్రపంచంలోనే అత్యధిక డిజిటల్ లావాదేవీలు మనదేశంలోనే జరుగుతున్నాయి' అని రాష్ట్రపతి వివరించారు.

## మరో రెండేండ్ల పెంపు

### యూనిఫాం సర్వీసెస్ ఉద్యోగాలకు గరిష్ఠ వయోపరిమితిని పెంచిన సర్కార్

హైదరాబాద్, ఆగష్టు 14: యూనిఫాం సర్వీసెస్ ఉద్యోగార్థులకు రాష్ట్ర ప్రభుత్వం గుడ్‌న్యూస్ తెలిపింది. పోలీసు, ఫైర్, జైళ్లు, ఎస్పీఎఫ్, ఎక్సయిజ్, ట్రాన్స్‌పోర్ట్, ఫారెస్ట్ శాఖల్లో డైరెక్ట్ రిక్రూట్మెంట్ పోస్టులకు గరిష్ఠ వయోపరిమితిని మరో 2 రెండేళ్లు పెంచుతూ నిర్ణయం తీసుకుంది. ఇప్పటికే ఐదేళ్ల వయోపరిమితి పెంపు మే 18, 2026 నుంచి అమల్లో ఉండగా.. తాజాగా మరో రెండేళ్లు అదనంగా పెంచుతూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. దీంతో ఆయా శాఖల్లో పోస్టులకు వయోపరిమితి పెంపు ఏడేళ్లకు చేరింది. ఈ నిర్ణయం ప్రస్తుతం పోలీసు రిక్రూట్మెంట్లకూ వర్తిస్తుందని ప్రభుత్వం వెల్లడించింది. నిరుద్యోగ యువత నుంచి వచ్చిన పలు విజ్ఞప్తులను పరిశీలించిన అనంతరం ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపింది.

## అటు బుజ్జగింపులు.. ఇటు బుకాయింపులు

- హిందూ కుటుంబాలపై వేధింపులు కొత్తేమికాదు?
- మైనారిటీలకు ఉచిత విద్యుత్ ఇస్తారా?: రాంచందర్ రావు ఫైర్
- బిల్లులు కట్టని మైనార్టీలపై సానుభూతి ఎందుకు?
- ఓటు బ్యాంకు రాజకీయాలు చేస్తుండ్రని అగ్రహం

హైదరాబాద్, మనం ప్రతినిధి: పాతబస్తీలో విద్యుత్ బిల్లుల చెల్లింపులు, ఉచిత విద్యుత్ పథకం అమలుపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేసిన వ్యాఖ్యలపై తెలంగాణ బీజేపీ అధ్యక్షుడు రాంచందర్ రావు తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. సోషల్ మీడియా వేదికగా స్పందించిన ఆయన... కాంగ్రెస్ ప్రభుత్వం ఓటు బ్యాంకు రాజకీయాలు చేస్తోందని మండిపడ్డారు. పాతబస్తీలోని మైనారిటీలు విద్యుత్ బిల్లులు చెల్లించడం లేదని, అందుకే వారికి 200 యూనిట్ల ఉచిత విద్యుత్ అందించామనే రీతిలో సీఎం మాట్లాడటాన్ని రాంచందర్ రావు తప్పుబట్టారు.

నిబంధనలు పాటించడం లేదని, నిబంధనల ఉల్లంఘన జరిగిందనే సాకుతో హైడ్రా ద్వారా పేద హిందూ కుటుంబాల ఇళ్లను కూల్చివేస్తున్నప్పుడు చూపించని సానుభూతిని, విద్యుత్ బిల్లులు చెల్లించని మైనారిటీల విషయంలో ఎందుకు చూపిస్తున్నారని నిలదీశారు.

ఒకవైపు సామాన్య పేద హిందూ కుటుంబాలపై హైడ్రాను ప్రయోగిస్తూ వేధింపులకు గురిచేస్తూ... మరోవైపు మైనారిటీల సంక్షేమం పేరుతో వారు బిల్లులు కట్టకపోవడాన్ని సమర్థిస్తూ ప్రోత్సహించేలా మాట్లాడటం కాంగ్రెస్ నైజానికి నిదర్శనమని మండిపడ్డారు.

హిందువుల ప్రయోజనాలను పణంగా పెట్టి మైనారిటీలను ప్రసన్నం చేసుకునే బుజ్జగింపు రాజకీయం కాంగ్రెస్‌కు కొత్తేమీ కాదని, ఖిలాఫత్ ఉద్యమం నాటి నుంచి నేటి వరకు వారి విధానంలో ఎలాంటి మార్పు రాలేదని విమర్శించారు.

## రేషన్ కార్డుపై ప్రధాని ఫోటో ఏది?

- కేంద్రం బియ్యం ఇస్తున్నప్పుడు ప్రధాని ఫోటో ఎందుకు లేదని బీజేపీ ప్రశ్న




హైదరాబాద్, మనం ప్రతినిధి: గత కొన్నేళ్లుగా ఎప్పుడెప్పుడా అని ఎదురుచూస్తున్న కళ్లకు ఓ భారీ శుభవార్త విననున్నారు. చాలకాలంగా ఎంతో ఆశలువెట్టుకున్న వారి స్వప్నం మరి కొన్ని గంటల్లో నెరవేరనుంది. గంపెడు ఆశలతో కలలుగంటున్న వారంతా.. ప్రభుత్వం నుంచి నేడు మరో భారీ తీపికబురు విననున్నారు,చూడబొతున్నరు. తెలంగాణలో వ్యాప్తంగా కొత్త స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీకి రంగం సిద్ధమైంది. ఈ నేపథ్యంలో స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా నేడు(ఆగస్టు 15న0 సంగారెడ్డి వేదికగా సీఎం రేవంత్‌రెడ్డి ఈ కార్యక్రమాన్ని ప్రారంభించనున్నారు. రాష్ట్రంలోని 33 జిల్లాల్లో మంత్రులు, ప్రజాప్రతినిధులు కార్డులు పంపిణీ చేయనున్నారు. అయితే పంపిణీకి ముందే కార్డులపై రాజకీయ వివాదం మొదలైంది.

సంగారెడ్డి సభపై ఉత్కంఠ

కార్డుపై ఇద్దరి ఫోటోలేనా?.. ప్రధాని ఫోటో ఎది?.. బీజేపీ నేతల ఆగ్రహం..

యితే, తెలంగాణ ప్రభుత్వం విడుదల చేసిన ఈ స్మార్ట్ రేషన్ కార్డు నమూనాలో సీఎం రేవంత్, పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ ఫోటోలే మాత్రమే ఉండటం గమనార్హం.. ఈ స్మార్ట్ కార్డ్‌పై స్వయంగా భారత ప్రధాని నరేంద్ర మోడీ ఫోటో లేకపోవడంపై బీజేపీ నేతలు అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. రేషన్ బియ్యంలో కేంద్రం కీలకంగా నిధులు సమకూరుస్తున్నప్పుడు ప్రధాని ఫోటో ఎందుకు పెట్టలేదని ప్రశ్నిస్తున్నారు. ఎంపీ ధర్మపురి అర్వింద్ తీవ్ర విమర్శలు చేశారు. కేంద్రం అందిస్తున్న రేషన్ బియ్యంపై రాష్ట్ర ప్రభుత్వం తమ ప్రచారం కోసం సీఎం, మంత్రి ఫోటోలు పెట్టుకోవడం ఏంటని ప్రశ్నించారు. పేదలకు ఉచిత బియ్యం అందించడంలో కేంద్రం పాత్రను గుర్తించాలని డిమాండ్ చేశారు.

## ఏడాది ముందే..

# విద్యార్థుల ఫీజు రీయింబర్స్ చేస్తాం



### ఇప్పటికే రూ.250 కోట్లు బ్యాంకుల్లో డిపాజిట్ చేసినం

- గత ప్రభుత్వం యువతను గొర్రెలు, బర్రెలు పెంచుకోవాలని చెప్పింది
- మేం డాక్టర్లు, లాయర్లు, ఐఏఎస్, ఐపీఎస్‌లు కావాలంటున్నం
- ట్యాంక్‌బండ్‌పై ఉన్న విగ్రహాలు భావి తరాలకు స్ఫూర్తి
- పూలే దంపతుల విగ్రహావిష్కణ సభలో సీఎం రేవంత్ రెడ్డి

పూలే దంపతులను ఆదర్శంగా తీసుకోవాలి: మంత్రి పొన్నం

హైదరాబాద్, ఆగస్టు 14, (మనం బ్యూరో): వచ్చే విద్యా సంవత్సరం నుండి ఏడాది ముందే విద్యార్థుల ఖాతాలో ఫీజు రీయింబర్స్‌మెంట్ డబ్బులు జమ చేయబోతున్నామని రాష్ట్ర ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి వెల్లడించారు. ఈ ఏడాదికి సంబంధించి ఫీజు రీయింబర్స్‌మెంట్ కోసం ఇప్పటికే రూ.250 కోట్లు బ్యాంకుల్లో జమ చేసినట్లు తెలిపారు. శుక్రవారం ఇక్కడి నక్లెస్ రోడ్‌లోని హెచ్ఎండిఏ గ్రౌండ్స్‌లో జ్యోతిబా పూలే, సావిత్రిబాయి పూలే దంపతుల విగ్రహాలను సీఎం ఆవిష్కరించారు. అనంతరం ఏర్పాటు చేసిన బహిరంగ సభలో ఆయన మాట్లాడుతూ పారదర్శకంగా ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకం అమలు చేయాలని ప్రభుత్వం నిర్ణయించిందనీ, ఫీజు కట్టలేదని సర్టిఫికెట్ ఇవ్వమని కాలేజీ యాజమాన్యాలు చెప్పే పరిస్థితి ఇకపై రాబోదన్నారు. కళాశాలల్లో ప్రవేశాలు పొందాక ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్న నెల రోజుల లోపు రీయింబర్స్‌మెంట్ డబ్బులు విద్యార్థుల ఖాతాలో జమ చేస్తామని స్పష్టం చేశారు. ఈ దేశంలో పశువులకు లెక్క ఉంది కానీ, బీసీల లెక్కలు లేవనీ అందుకే ఎన్ని అడ్డంకులు వచ్చినా బీసీ జనగణన చేపట్టామని పేర్కొన్నారు. కుటుంబ సమగ్ర సర్వేలో పాల్గొనని వారు బీసీ లెక్కలను అడ్డుకునేందుకు అనేక ప్రయత్నాలు చేశారనీ, గత ప్రభుత్వంలో గొర్రెలు, బర్రెలు పెంచుకోవాలని చెబితే తాము డాక్టర్లు, లాయర్లు, ఐఏఎస్, ఐపీఎస్, ప్రజాప్రతినిధులు కావాలని అంటున్నామన్నారు. నాకు వయసుతో పాటు మంచి సలహాదారులు సహచరులు ఉన్నారు...ఇంత మంచి అవకాశం, మీరు కోరుకున్న ఇలాంటి ప్రభుత్వం మళ్లీ రాదన్నారు. ట్యాంక్‌బండ్‌కు వస్తే గొప్ప వ్యక్తుల విగ్రహాలు కనిపిస్తాయనీ, ఇవి కేవలం విగ్రహాలే కాదు, వారు చేసిన త్యాగాలు. వాళ్ల గొప్పతనాలు భావితరాలకు తెలియాలనే విగ్రహాలు ఏర్పాటు చేశామన్నారు. 150 ఏండ్ల క్రితం పూలే దంపతులు చదువుకు ఉన్న ప్రాధాన్యతను చాటి చెప్పారనీ, సమాజంలో కుల నిర్మూలన తీసుకువచ్చేందుకే యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్స్ నిర్మాణానికి శ్రీకారం చుట్టామన్నారు. భాషా నైపుణ్యం ఉన్న నర్సులకు జర్మనీ, జపాన్, దక్షిణ కొరియాలో ఉద్యోగాలు ఉన్నాయనీ, అందువల్ల చదువులో నాణ్యత ఉండాలనీ, స్కిల్స్ పెంచుకోవాలని పిలుపునిచ్చారు. ఐటీ నిపుణులు కూడా ఉద్యోగాలు పోయి వెనక్కి వచ్చే పరిస్తితి ఏర్పడిందనీ, ఏఐ వల్ల ఐటీ నిపుణుల ఉద్యోగాలు పోయే పరిస్థితి సంక్షోభాన్ని ఎలా ఎదుర్కోవాలో అందరూ ఆలోచించాలన్నారు. బహిరంగ సభలో రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ పూలే దంపతుల విగ్రహాలను హైదరాబాద్ నడిబొడ్డున ప్రతిష్టించడం గర్వకారణమన్నారు. అంబేద్కర్, పూలే దంపతుల విగ్రహాలు నేటి యువతకు స్ఫూర్తిదాయకంగా ఉన్నాయనీ, వారి ఆశయాలను కొనసాగిస్తామని తెలిపారు. బీజేపీ నేతలు కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ఖర్గే పాల్గొన్న ఓ కార్యక్రమం అనంతరం దానిని శుద్ధి చేసి అవమానించారనీ, ఇది వారి నియంతృత్వ ధోరణికి నిదర్శనమని ఈ సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్ పేర్కొన్నారు.

## ఇన్వెస్ట్ తెలంగాణ థీమ్‌తో గ్లోబల్ సమ్మిట్

(మొదటి పేజీ తరువాయి)

కమిటీని ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. ఇన్వెస్ట్ తెలంగాణ థీమ్‌తో జరిగే ఈ సదస్సులో ఫ్యూచర్ సిటీ ప్లాన్‌ను ప్రభుత్వం ఆవిష్కరించనున్నామనీ, డిఫెన్స్, ఏరోస్పేస్, ఫార్మా రంగాల్లో పెట్టుబడుల ఆకర్షణే లక్ష్యంగా స్టార్టప్స్, కొత్త ఆవిష్కరణలతో భారీ ఎగ్జిబిషన్ ఏర్పాటు చేయనున్నట్లు వెల్లడించారు. అలాగే, వానాకాలం పంటకు సంబంధించి ఏడు రకాల సన్నాలను ప్రోత్సహించేందుకు రైతులకు రైతు వేదికలు, గ్రామ పంచాయతీల ద్వారా విస్తృత అవగాహన కలిగించాలని మంత్రివర్గ సమావేశంలో నిర్ణయించినట్లు తెలిపారు.

ఈ ఏడాది నుంచి 7 రకాల సన్నాలకు క్వింటాలుకు రూ.500 బోనస్ చెల్లించనున్నామనీ, యాసంగి ధాన్యం సేకరణలో రాష్ట్రంలోనే దేశంలోనే అత్యధికంగా రికార్డు స్థాయిలో 81.16 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని సేకరించగా,కేంద్రం కేవలం 63.62 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని మాత్రమే తీసుకుందని చెప్పారు. మిగిలిన 17.54 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని ఈ వేలం ద్వారా విక్రయించేందుకు మంత్రివర్గం ఆమోదం తెలిపిందన్నారు. రాష్ట్రంలోని ఐటీఐలు, ఏటీసీలు, పాలిటెక్నిక్ కాలేజీలను తిరిగి యంగ్ ఇండియా స్కిల్స్ పరిధిలోకి తీసుకు రావడానికి మంత్రివర్గం ఆమోదం తెలిపింది. ప్రస్తుతం పరిశ్రమల శాఖలో ఉన్న వీటన్నింటినీ ఇకపై శక్తి శాఖ పరిధిలో విలీనం చేయడంతో పాటు ఆదిలాబాద్, నిర్మల్, ముధోల్, బోథ్, సిర్పూర్‌కాగజ్‌నగర్, గజ్వేల్, దుబ్బాక నియోజకవర్గాల్లో కొత్తగా యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూళ్ల నిర్మాణానికి ఆమోదం తెలిపారు.వచ్చే విద్యా సంవత్సరం నుంచి తరగతులు ప్రారంభించాలని సీఎం ఆదేశించారు. మక్తల్-నారాయణపేట- కొడంగల్ ఎత్తిపోతల ప్రాజెక్టు ఫేజ్ 2 పనుల కోసం రూ.2100 కోట్ల అంచనా వ్యయానికి కేబినెట్ ఆమోదం తెలిపిందనీ, అలాగే, గూడెందొడ్డి ఎత్తిపోతల ప్రాజెక్టు సామర్థ్యాన్ని 15 టీఎంసీలకు పెంచడానికి ఆమోదం తెలిపింది. హైదరాబాద్ నగరంలోని కాలుష్య కారక పరిశ్రమలను శివార్లకు తరలించే హిల్ట్ పాలసీ దరఖాస్తులను దరఖాస్తుదారుల గడువు మేరకు అక్టోబర్ 31 వరకు పొడిగించాలని రాష్ట్ర మంత్రివర్గం నిర్ణయించినట్లు మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి వెల్లడించారు.

## నా వ్యాఖ్యల్ని దురుద్దేశంతోనే వక్రీకరించారు

- తన కాక్రోచ్ కామెంట్ల ప్రచారంపై సీజేఐ సూర్యకాంత్



ఢిల్లీ, ఆగష్టు 14: న్యాయస్థానంలో చేసిన మౌఖిక వ్యాఖ్యలను సందర్భం లేకుండా సామాజిక మాధ్యమాల్లో ప్రచారం చేయడంపై సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి సూర్యకాంత్ ఆందోళన వ్యక్తం చేశారు. తన వ్యాఖ్యలను వక్రీకరించి, చెప్పని మాటలను కూడా చెప్పినట్లుగా ప్రచారం చేశారని ఆయన పేర్కొన్నారు. ముఖ్యంగా దేశ యువతను తప్పుదోవ పట్టించేందుకు ఇది ఉద్దేశపూర్వకంగా జరుగుతున్న దుష్ప్రచారమని వ్యాఖ్యానించారు.

కోర్టు విచారణలకు సంబంధించిన చిన్న వీడియో క్లిప్పులను అసందర్భానుసారంగా సోషల్ మీడియాలో విస్తృతంగా ప్రచారం చేస్తున్నారు. నా వ్యాఖ్యలను వక్రీకరించారు. నేను చెప్పని విషయాలను కూడా చెప్పినట్లుగా చూపించారు. ఇది చాలా దురదృష్టకరం. ముఖ్యంగా దేశ యువతను తప్పుదోవ పట్టించేందుకు జరుగుతున్న తీవ్రమైన దుష్ప్రచారం' అని సీజేఐ పేర్కొన్నట్లు తెలుస్తోంది. న్యాయస్థాన విచారణలను ప్రసారం చేసేటప్పుడు మీడియా బాధ్యతగా వ్యవహరించాలని ఈ సందర్భంగా సీజేఐ సూచించారు. ప్రతి పౌరుడికీ హక్కులతో పాటు బాధ్యతలు, రాజ్యాంగపరమైన విధులూ ఉన్నాయని గుర్తుచేశారు.

సుప్రీంకోర్టు కార్యకలాపాల్లో పారదర్శకత అవసరమని, అందులో భాగంగానే విచారణలను ప్రత్యక్ష ప్రసారం చేస్తున్నామని సీజేఐ తెలిపారు. అయితే.. వీటిని దుర్వినియోగం చేయకూడదని ఆయన స్పష్టం చేశారు. కోర్టు విచారణల ఆడియో, వీడియో రికార్డింగ్లను అనధికారికంగా కట్ చేసి.. మళ్లీ ప్రచారం చేయడం, అప్లోడ్ చేయడం, వాటి ద్వారా వాణిజ్య ప్రయోజనాలు పొందడాన్ని అడ్డుకునేలా ఇటీవల ఆదేశాలు జారీ చేసిన విషయాన్ని ఆయన ప్రస్తావించారు. 'న్యాయవ్యవస్థలో పారదర్శకతకు మేము కట్టుబడి ఉన్నాం. అయితే చిన్న చిన్న క్లిప్పులను వ్యక్తిగత, వాణిజ్య ప్రయోజనాల కోసం దుర్వినియోగం చేయడం ఆగాలి' అని సీజేఐ సూర్యకాంత్ స్పష్టం చేశారు.

గా.. మే 15న సుప్రీంకోర్టులో ఓ కేసు విచారణ సందర్భంగా సీజేఐ చేసిన 'కాక్రోచ్' వ్యాఖ్యలు అప్పట్లో తీవ్ర దుమారం రేపాయి. నకిలీ విద్యార్హతలతో వ్యవస్థపై దాడి చేసేందుకు సోషల్ మీడియా, ఆర్టీఐ కార్యకర్తలుగా మారే కొందరిని ఉద్దేశించి ఆయన ఆ పదాన్ని ఉపయోగించినట్లు వార్తలు వెలువడ్డాయి. దీనిపై యువత నుంచి తీవ్ర వ్యతిరేకత వ్యక్తమైంది. ఆ తర్వాత 'కాక్రోచ్ జంతా పార్టీ(సీజేపీ)' పేరుతో వ్యంగ్యాత్మకంగా ఓ ఆన్లైన్ ఉద్యమం ప్రారంభమైంది.

## టెస్సరాక్ట్ భారీ కుంభకోణం

- నిబంధనలకు విరుద్ధంగా సీఎం సోదరుడికి భూకేటాయింపులు
- మార్కెట్ విలువ రూ.200 కోట్ల భూమిని
- అప్పనంగా రూ.7 కోట్లకే కేటాయింపులు..
- సీఎం రేవంత్ కుటుంబంపై లోకాయుక్తకు బీఆర్ఎస్ ఫిర్యాదు

హైదరాబాద్, మనం ప్రతినిధి: తెలంగాణలో టెస్సరాక్ట్ భూ కేటాయింపుల వ్యవహారం రాజకీయంగా వేడెక్కింది. సీఎం రేవంత్‌రెడ్డి కుటుంబ సభ్యులతో సంబంధం ఉందని బీఆర్ఎస్ ఆరోపిస్తున్న సంస్థకు రావిర్యాలలో భూమి కేటాయింపుపై ఆ పార్టీ ప్రజాప్రతినిధులు లోకాయుక్తకు ఫిర్యాదు చేశారు. భూమి విలువ, కేటాయింపు ధర, సంస్థ నిర్వహణ, ప్రభుత్వ నిబంధనల అమలు వంటి అంశాలపై దర్యాప్తు కోరారు. ఇదే సమయంలో కొడంగల్ ఎత్తిపోతల పథకానికి సంబంధించిన భూసేకరణ, పరిహారం పంపిణీపై బీఆర్ఎస్ నేతలు కూడా ఫిర్యాదు చేశారు.

**రేవంత్ రెడ్డి కుటుంబంపై లోకాయుక్తకు బీఆర్ఎస్ ఫిర్యాదు..**

తెలంగాణ ముఖ్యమంత్రి స్వయంగా తన బందువులకే నీకింత, మాకింత అన్నట్లుగా అప్పన్నంగా అప్పగించిన టెస్సరాక్ట్ కే భూ కేటాయింపుల వ్యవహారం మరోసారి తీవ్ర చర్చనీయాంశంగా మారింది. అయితే, ఈ వ్యవహారంలో రేవంత్ కుటుంబానికి సంబంధం ఉందని బీఆర్ఎస్ ఆరోపిస్తోంది. ఈ క్రమంలోనే టెస్సరాక్ట్ సంస్థకు రంగారెడ్డి జిల్లా రావిర్యాలలో భూమి కేటాయింపుపై బీఆర్ఎస్ నేతలు ఎమ్మెల్సీ దాసోజు శ్రవణ్, ఎమ్మెల్యేలు కాలేరు వెంకటేష్, డాక్టర్ సంజయ్, మాజీ ఎమ్మెల్యే ముఠా గోపాల్, కార్పొరేషన్ మాజీ చైర్మన్ మన్నె క్రిశాంక్‌తో పాటు పలువురు ప్రజా ప్రతినిధులు శుక్రవారం తెలంగాణ లోకాయుక్తను ఆశ్రయించారు. ఈ వ్యవహారంపై సమగ్ర దర్యాప్తు చేపట్టి.. నిబంధనలకు విరుద్ధంగా భూమి కేటాయింపు జరిగిందని తేలితే చర్యలు తీసుకోవాలని వారు కోరారు. బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులు లోకాయుక్తకు సమర్పించిన ఫిర్యాదులో పలు అంశాలను ప్రస్తావించారు. సుమారు 5 ఎకరాల భూమి మార్కెట్ విలువ రూ.135 కోట్ల నుంచి రూ.200 కోట్ల వరకు ఉంటుందని వారు పేర్కొన్నారు. అయితే ఆ భూమిని సుమారు రూ.7 కోట్లకే కేటాయించారంటూ ఆరోపించారు. టెస్సరాక్ట్ సంస్థకు ముఖ్యమంత్రి కుటుంబ సభ్యులతో సంబంధాలు ఉన్నాయని చెబుతూ.. సంస్థ నిర్వహణ, యాజమాన్యానికి సంబంధించిన వివరాలను కూడా ఫిర్యాదులో పొందుపరిచినట్లు బీఆర్ఎస్ నేతలు తెలిపారు. టెస్సరాక్ట్ సంస్థ మూలధనం, ఉద్యోగుల సంఖ్య, రిజిస్టర్డ్ చిరునామా వంటి అంశాలపై కూడా అనుమానాలు ఉన్నాయని బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులు ఆరోపించారు. ప్రభుత్వ భూమిని ప్రైవేటు సంస్థకు కేటాయించే ప్రక్రియలో ప్రభుత్వ నిబంధనలు పాటించారా? అనే అంశంపై విచారణ అవసరమని డిమాండ్ చేశారు. భూమి కేటాయింపును నిలిపివేయడంతో పాటు.. ఈ వ్యవహారంలో ముఖ్యమంత్రి, సంబంధిత మంత్రి, టీజీఐఐసీ అధికారుల పాత్రపై దర్యాప్తు చేయాలని కోరారు. ఇదే సమయంలో కొడంగల్ ఎత్తిపోతల పథకానికి సంబంధించిన భూసేకరణ, పరిహారం అంశాన్ని కూడా బీఆర్ఎస్ నేతలు లోకాయుక్త దృష్టికి తీసుకెళ్లారు. నిర్వాసితుల జాబితా మార్పులు, పరిహారం పంపిణీలో అవకతవకలు జరిగాయని మాజీ ఎమ్మెల్యేలు ఆరోపించారు. ప్రాజెక్టు సాధ్యసాధ్యాలు, అవసరమైన అనుమతులు, భూసేకరణ ప్రక్రియపై స్వతంత్ర విచారణ జరపాలని వారు కోరారు.

అయితే.. టెస్సరాక్ట్ భూ కేటాయింపులపై బీఆర్ఎస్ చేసిన ఆరోపణలు, కొడంగల్ ప్రాజెక్టుపై మాజీ ఎమ్మెల్యేలు వ్యక్తం చేసిన అభ్యంతరాలు ప్రస్తుతం రాజకీయ ఆరోపణల స్థాయిలోనే ఉన్నాయి. సంబంధిత సంస్థలు గానీ, రాష్ట్ర ప్రభుత్వం నుంచి ఈ ఆరోపణలపై ఇంకా ఎటువంటి అధికారిక ప్రకటన రాలేదు?.. వారి నుంచి ఓ వివరణ వెలువడితేనే పూర్తి వాస్తవాలు స్పష్టమయ్యే అవకాశం ఉంది. బీఆర్ఎస్ ఫిర్యాదుతో లోకాయుక్త విచారణ జరిగితే భూ కేటాయింపుల ప్రక్రియ, సంబంధిత పత్రాలు, అధికారుల నిర్ణయాలపై మరింత స్పష్టత వచ్చే అవకాశం ఉందని మేధావులు, రాజకీయ విశ్లేశకులు చెబుతున్నారు.

## అది నాకు, విద్యార్థులకు మధ్య సమస్య

### మీ జోక్యం ఎందుకు?: సీజేఐ

ఢిల్లీ, ఆగష్టు 14: నిరసన తెలిపే హక్కు విద్యార్థులకు ఉందని సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ అన్నారు. నల్సార్ నుంచి 2026లో గ్రాడ్యుయేషన్ పూర్తి చేసిన విద్యార్థులపై ఎలాంటి చర్యలు తీసుకోవద్దని బార్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా(బీసీఐ)ను ఆదేశించారు. అది తనకు, విద్యార్థులకు మధ్య సమస్య అని, బీసీఐ జోక్యం ఎందుకు చేసుకుందని అసహనం వ్యక్తం చేశారు.

సీజేఐను పిలవొద్దంటూ అక్కడి విద్యార్థులు లేఖ రాసినట్లు వార్తలు వచ్చిన సంగతి తెలిసిందే. వారిపై బీసీఐ ఆగ్రహం వ్యక్తంచేసింది.

తాము తదుపరి ఉత్తర్వులు జారీ చేసేంతవరకూ నల్సార్ యూనివర్సిటీ 2026 బ్యాచ్ న్యాయశాస్త్ర విద్యార్థులెవరినీ న్యాయవాదులుగా నమోదు చేసుకోవద్దంటూ బార్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా (బీసీఐ) ఛైర్మన్ మనన్ కుమార్ మిశ్ర దేశవ్యాప్తంగా ఉన్న బార్ కౌన్సిళ్లకు గురువారం లేఖ రాశారు. ఆ ఉత్తర్వులపై విమర్శలు వ్యక్తమయ్యాయి.

సుప్రీంకోర్టు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు, సీనియర్ న్యాయవాది వికాస్ సింగ్ స్పందిస్తూ.. 'రాజ్యాంగబద్ధమైన సంస్థతో విభేదించిన ఒక్కకారణంతో.. న్యాయవాద వృత్తిలో ప్రవేశించే హక్కును నిరాకరిస్తామని విద్యార్థులను బెదిరించకూడదు' అని వ్యాఖ్యానించారు. బీసీఐ స్పందించిన తీరును సీజేఐ సీరియస్గా తీసుకున్నారు.

## గోదావరి పుష్కరాల పనులు..

# సెప్టెంబర్ మొదటి వారంలో ప్రారంభించాలె

### నాణ్యతలో రాజీ పడొద్దు...శాఖల మధ్య సమన్వయం తప్పనిసరి

### గోదావరి పుష్కరాలపై క్యాబినెట్ సబ్ కమిటీ సమావేశంలో మంత్రి శ్రీధర్ బాబు



హైదరాబాద్, ఆగస్టు 14, (మనం బ్యూరో) : గోదావరి పుష్కరాలకు సంబంధించిన టెండర్ల ప్రక్రియ ఆగస్టు చివరి నాటికి పూర్తి చేయాల్సిందేనని రాష్ట్ర పరిశ్రమలు, ఐటి శాఖ మంత్రి శ్రీధర్ బాబు అధికారులను ఆదేశించారు. సెప్టెంబర్ మొదటి వారంలో పనులు ప్రారంభించాలనీ, నాణ్యతలో ఎట్టి పరిస్థితుల్లోనూ రాజీ పడొద్దని స్పష్టం చేశారు. శుక్రవారం రాష్ట్ర సచివాలయంలో గోదావరి పుష్కరాలు-2027 మంత్రి శ్రీధర్ బాబు అధ్యక్షతన క్యాబినెట్ సబ్ కమిటీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా మంత్రి శ్రీధర్ బాబు మాట్లాడుతూ గోదావరి పుష్కరాలకు ప్రభుత్వం రూ.1000 కోట్లు కేటాయించిందని తెలిపారు. భక్తుల రద్దీ అధికంగా ఉండే టైర్ 1 ప్రాంతాలకు స్పెషల్ ఆఫీసర్లను నియమించాలనీ, అలాగే, ముఖ్యమైన ప్రాంతాల్లో ప్రత్యేకంగా కంట్రోల్ కమాండ్ సెంటర్లను ఏర్పాటు చేయాలని సూచించారు. నిర్దేశిత గడువులోగా పనులు పూర్తయ్యేలా సంబంధిత శాఖ ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. పనుల పురోగతిని పర్యవేక్షించేందుకు అధికారులు నిరంతరం క్షేత్రస్థాయిలో పర్యటించాలని స్పష్టం చేశారు. వర్క్ ప్రోగ్రెస్‌ను రోజు వారీగా తెలుసుకునేందుకు ప్రత్యేక డ్యాష్ బోర్డును అందుబాటులోకి తేవాలనీ, అన్ని శాఖలు సమష్టిగా పని చేస్తేనే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా పుష్కరాలు విజయవంతమవుతాయన్నారు. రోడ్ల కనెక్టివిటీ మిస్ అయిన వెంటనే గుర్తించి లోకల్ ఫండ్స్ నుంచి పనులు చేపట్టాలన్నారు. స్థానిక ప్రజా ప్రతినిధులు, కలెక్టర్లు, ఎస్పీలు, ఇతర జిల్లా ఉన్నతాధికారులు, పండితులను పుష్కర ఏర్పాట్లలో తప్పనిసరిగా భాగస్వాములను చేయాలన్నారు. భక్తులకు సేవలు అందించేందుకు ముందుకొచ్చే స్వచ్ఛంద, ప్రైవేట్ సంస్థలను ముందుగానే గుర్తించాలనీ, కేబినెట్ సబ్ కమిటీ సభ్యుల సలహాలు, సూచనలను తప్పనిసరిగా పరిగణనలోనికి తీసుకుని అందుకనుగుణంగా చర్యలు తీసుకోవాలని అధికారులకు స్పష్టం చేశారు. పుష్కర ఏర్పాట్లలో అలసత్వం వహించే అధికారులపై చర్యలు తప్పవని ఈ సందర్భంగా మంత్రి శ్రీధర్ బాబు హెచ్చరించారు.

## మార్పు కోసం మంచి సినిమా

ముందడుగు (కోల్‌కతా),మంచి సినిమా ఆధ్వర్యంలో...

స్థలం: ఐలమ్మ ఆర్ట్ గ్యాలరీ, దాశరథి థియేటర్, సుందరయ్య విజ్ఞాన కేంద్రం, బాగ్ లింగంపల్లి, హైదరాబాద్, తేదీ: ఆగస్టు 15, 2026 శనివారం.. సమయం: ఉ. 10 గం.ల నుండి రాత్రి 8:30 గం.ల వరకు వివరాలకు: 9490753026, 7036470438, 9441883949

## ఆవిష్కరణ

బోధనం నర్సిరెడ్డి రచించిన తేనె మరక... కత్తిని గాయపరుద్దాం (కవిత్వ సంపుటాలు)

ఆవిష్కరణ సభ శనివారం (15-08-2026) సాయంత్రం 6 గం.కు.. యుటీఎఫ్ భవన్, బస్టాండ్ దగ్గర, నల్లగొండ.. సభాధ్యక్షులు.. తేనె మరక ఆవిష్కర్త: ఎలికట్టె శంకర్ రావు, డా. సుంకిరెడ్డి నారాయణరెడ్డి, కత్తిని గాయపరుద్దాం ఆవిష్కర్త: డా. సంగిశెట్టి శ్రీనివాస్

వక్తలు: కాసుల ప్రతాపరెడ్డి,డా. వెల్లండి శ్రీధర్, డా. పగడాల నాగేందర్,కుకుడాల గోవర్ధన్, బైరెడ్డి కృష్ణారెడ్డి, పెరుమాళ్ల ఆనంద్, డా. తండు కృష్ణ కౌండిన్య, గౌస్ మొహియుద్దీన్

సమన్వయకర్త: డా. సాగర్ల సత్తయ్య - సృజన సాహితి, నల్లగొండ

## భూం రాంగ్.. లీలలు

# సీఎం డైరెక్షన్‌తోనే భూముల నిషేధం

- భారీగా భూముల విలువ ఉన్నచోట ఈ తరహా దందా నడుస్తోంది
- కాళ్ల అరిగేలా కలెక్టర్, సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల చుట్టూ తిరుగుతున్న బాధితులు
- సీఎం రేవంత్‌రెడ్డిపై బీజేపీ ఎంపీ ఈటల రాజేందర్ సంచలన ఆరోపణలు



హైదరాబాద్, మనం ప్రతినిధి : తెలంగాణలో పలువురు ఐఏఎస్ అధికారులపై బీజేపీ ఎంపీ ఈటల రాజేందర్ సంచలన వ్యాఖ్యలు చేశారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి డైరెక్షన్‌లో భాగంగానే కొంతమంది ఐఏఎస్ ఆఫీసర్లు ఉద్దేశపూర్వకంగా భూములను నిషేధిత జాబితాలో పెడుతున్నారని ఆయన ఆరోపించారు. ముఖ్యమంత్రి నుంచి లేదా అయనకు సంబంధించిన వారి నుంచి క్లారిఫికేషన్ వచ్చిన తరువాత వాటిని క్లియర్ చేస్తున్నారని ఈటల చేసిన ఈ కామెంట్స్ తెలంగాణ రాజకీయాల్లో పెద్ద ఎత్తున చర్చకు దారితీశాయి. అయితే, నిషేధిత జాబితాలోకి భూములు మార్పు అనేది, ఇది నేరుగా ఆయన కనుసన్నల్లోనే జరుగుతోందని సీనియర్ నేత ఈటల రాజేందర్, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిపై ఆయన మరోసారి తనదైన శైలీలో తీవ్ర ఆరోపణలు గుప్పించారు. భూముల విలువ ఎక్కువగా ఉన్నచోట ఈ తరహా దందా నడుస్తోందని ఎంపీ వ్యాఖ్యానించారు. ఇది కేవలం బాధితుల నుంచి డబ్బులు వసూలు చేయడంలో భాగమే అని అన్నారు. బాధితులు కాళ్లు అరిగేలా కలెక్టర్ కార్యాలయాలు, సబ్ రిజిస్ట్రార్ ఆఫీస్‌ల చుట్టూ తిరుగుతున్నారని ఎంపీ ఈటల రాజేందర్ చేసిన ఈ సంచలన కామెంట్స్ తెలంగాణలో రాజకీయ రచ్చకు దారితీస్తాయని పొలిటికల్ విశ్లేషకులు చెప్తున్నారు.

## కాంగ్రెస్ పార్టీలో

# అందరు సమానమే

### సీఎం సహా ఎవరికైనా ఒకటే గౌరవం

### పార్టీపై రాజగోపాల్ రెడ్డి బహిరంగంగా విమర్శలు సరికాదు

### పీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్



హైదరాబాద్, ఆగస్టు 14(మనం బ్యూరో): కాంగ్రెస్ పార్టీలో అంతా సమానమేననీ, సీఎం సహా ఎవరికైనా ఒకటే గౌరవం ఉంటుందని పీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ స్పష్టం చేశారు. పార్టీ వేదికలపై కాకుండా ఎవరైనా బహిరంగంగా అసంతృప్తి వ్యక్తం చేయడం సరికాదని పేర్కొన్నారు. శుక్రవారం ఆయనిక్కడ ఏర్పాటు చేసిన మీడియా ప్రతినిధుల సమావేశంలో కాంగ్రెస్‌తో సంబంధం లేని వాళ్లకే కీలక పదవులు ఇస్తున్నారంటూ మునుగోడు ఎమ్మెల్యే రాజగోపాల్ రెడ్డి చేసిన వ్యాఖ్యలపై స్పందిస్తూ పార్టీకి సంబంధించి నాలుగు గోడల మధ్య చర్చించాల్సిన అంశాలను బహిరంగంగా మాట్లాడకూడదని వ్యాఖ్యానించారు. రాజగోపాల్ రెడ్డి ఆవేదన ఆందోళన అర్థం చేసుకుంటాం, ఆయన ప్రజా నాయకుడు మంచి మిత్రుడని పేర్కొన్నారు. ఆయన అలా మాట్లాడటం సరికాదనీ, సమయం వచ్చినప్పుడు అవకాశాలు ఉంటాయన్నారు. ఏం మాట్లాడినా అధిష్టానం దృష్టికి వెళుతుంది. బిల్లుల విషయంలో ఒక క్రమపద్ధతిలో ముందుకు వెళుతున్నామని చెప్పారు. ఇందిరమ్మ ఇళ్ల విషయంలో గత ప్రభుత్వం మాదిరిగా మేం చేయడం లేదన్న పీసీసీ చీఫ్ తెలంగాణ ఉద్యమానికి కాంగ్రెస్ పార్టీకి సంబంధం లేని వాళ్లు పదవులు అనుభవిస్తున్నామనడంలో అర్థం లేదన్నారు. రాజగోపాల్ రెడ్డి కాంగ్రెస్ పార్టీపై చేసిన బహిరంగ విమర్శలను సీరియస్‌గా తీసుకుంటామనీ, క్రమశిక్షణ కమిటీ ఈ వ్యవహారాన్ని చూసుకుంటుందని ఈ సందర్భంగా పీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ స్పష్టం చేశారు.

## డబుల్ బెడ్ రూం ఇండ్లపై సీఎం వ్యాఖ్యలు సరికాదు?

- రేవంత్ వ్యాఖ్యలను ఖండించిన మాజీ మంత్రి తలసాని శ్రీనివాస్

హైదరాబాద్, మనం ప్రతినిధి : గత కేసీఆర్ హయాంలో నిర్మించిన డబుల్ బెడ్ రూం ఇండ్లపై సీఎం రేవంత్ చేసిన వ్యాఖ్యలను బీఆర్ఎస్ నేత, మాజీ మంత్రి, ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ తిప్పికొట్టారు. దమ్ముంటే తమతో వస్తే తాము కట్టిన ఇండ్లను, ఉంటున్న ప్రజలను చూపిస్తామని అన్నారు. ఈ మే రకు శుక్రవారం తెలంగాణ భవన్‌లో ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో తలసాని మాట్లాడుతూ... హైదరాబాద్ నగరంలో 69 వేల డబుల్ బెడ్ రూమ్ ఇళ్లను బీఆర్ఎస్ హయాంలోనే పూర్తి చేశామని గుర్తు చేశారు. ఢిల్లీలో ఐఏఎస్, ఐపీఎస్ ఆఫీసర్‌ల క్వార్టర్స్ ఈ విధంగా లేవని, నాటి గవర్నర్ డబుల్ బెడ్ రూమ్ ఇళ్లను మెచ్చుకున్నారని తెలిపారు. కొల్లూరులో ఒక్క చోటే 16 వేల ఇండ్లను కట్టామని వెల్లడించారు. నాటి డిప్యూటీ ఫ్లోర్ లీడర్, ప్రస్తుత డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కకు డబుల్ బెడ్ రూమ్ ఇళ్లను చూపించిన విషయాన్ని చూపించామని వెల్లడించారు. పేదవారి భూములను, ఇండ్లను 22 ఏ ద్వారా నిషేదిత జాబితాలో పొందుపరిచిన ఘనత సీఎం రేవంత్ రెడ్డికే దక్కుతుందని ఆరోపించారు. ఏమి తెలియనట్లు 22 ఏపై మీ భూమి మీకే ఇప్పిస్తా అని సీఎం ప్రకటించడం ఆయన ద్వంద్వవైఖరికి నిదర్శనమని పేర్కొన్నారు. ప్రజల భూమి ప్రజలకు ఇవ్వడానికి రేవంత్ రెడ్డి ఎవరని ప్రశ్నించారు. 22 ఏలో ఉన్న భూములను ఎత్తివేసేందుకు 30 నుంచి 40 శాతం కమీషన్లు వసూలు చేస్తున్నారని విమర్శించారు. బాధ్యత గల సీఎం పదవిలో ఉన్న రేవంత్ రెడ్డి క్షుద్ర పూజల గురించి మాట్లాడడం శోచనీయమని అన్నారు.

# 24 నుంచి ఆటోలు, క్యాబులు బంద్

### హామీలపై ప్రభుత్వం వెంటనే స్పందించాలి

### లేకపోతే సీఎం నివాసం, అసెంబ్లీ, ప్రజాభవన్‌లను ముట్టడిస్తం

### లక్షల ఆటోలతో హైదరాబాద్‌ను దిగ్బంధం చేస్తం

### రేవంత్ ప్రభుత్వానికి కార్మిక సంఘాల నేతలు ఆల్టిమేటం

హైదరాబాద్, మనం ప్రతినిధి : ఈ నెల 23వ తేదీ అర్ధరాత్రి నుంచి తెలంగాణలో ఆటోల నిరవధిక బంద్ నిర్వహిస్తామని ఆటో, క్యాబ్ యూనియన్ల జేఏసీ నేతలు ప్రకటించారు. తమ సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు తెలంగాణ ఆటో, యాప్ ఆధారిత డ్రైవర్ల సంఘాల జేఏసీ ఆధ్వర్యంలో ఆటో, క్యాబ్, వ్యాన్, డ్రైవర్ల న్యాయమైన సమస్యల పరిష్కారంకై బాగ్ లింగంపల్లి సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో శుక్రవారం నిర్వహించిన సదస్సులో ఈ కీలక నిర్ణయం తీసుకున్నారు.

తెలంగాణలో ఆటో, క్యాబ్, స్కూల్ వ్యాన్ డ్రైవర్లు బంద్‌కు పిలుపునిచ్చారు. ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలు, పాలక ప్రభుత్వం తమకు ఇచ్చిన వాగ్దాన హామీలపై మొత్తం 17 కార్మిక సంఘాల నేతలు పాల్గొని వివిధ అంశాలపై చర్చించారు.. తక్షణమే వాటిని అమలు చేయాలని కోరుతూ ఈ నెల 23 అర్ధరాత్రి (24) నుంచి బంద్ చేస్తున్నట్లు కార్మిక సంఘాల నేతలు పిలుపునిచ్చారు. తమకు ఇచ్చిన హామీలపై ప్రభుత్వం వెంటనే స్పందించకపోతే ముఖ్యమంత్రి నివాసంతోపాటుగా అసెంబ్లీ, ప్రజాభవన్ ముట్టడిస్తామన్నారు కార్మిక సంఘాల నేతలు. హైదరాబాద్‌ను లక్షల ఆటోలతో దిగ్బంధం చేస్తామన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన హామీ ప్రకారం ఆటో, రవాణా రంగ కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలన్నారు. పెట్రోలు, డీజిల్, గ్యాస్, నిత్యావసర సరకుల ధరలు పెరిగాయని.. అందుకు తగిన విధంగా ఆటో మీటరు ఛార్జీలనూ పెంచాలంటున్నారు. తెలంగాణ ప్రభుత్వం ఓలా, ఉబర్, ర్యాపిడోలకు బదులుగా కొత్త యాప్‌ను తీసుకురావాలని డిమాండ్ చేశారు. అలాగే ఆటో డ్రైవర్లకు ఇస్తామన్న రూ.12 వేలు పథకం అమలు అంశాన్ని పరిశీలించాలని కోరారు.

ఇప్పటికే పలుమార్లు తెలంగాణ ప్రభుత్వ పెద్దలని కలిసి ఆటో డ్రైవర్ల సమస్యలపై విజ్ఞప్తులు చేశామని కార్మిక సంఘాల నేతలు ఈ సందర్భంగా గుర్తుచేశారు. గతంలో తాము ఒకరోజు సమ్మెకు దిగితే తమ సమస్యలు పరిష్కరిస్తామని చెప్పిందని, ఐనా ఇప్పటివరకు ఏ ఒక్క హామీ కూడా అమలు కాలేదన్నారు. తమ న్యాయమైన డిమాండ్లు పరిష్కరించే వరకు ఉద్యమం కొనసాగుతుందన్నారు. ఈ నెల 23 నుంచి ఆటో, క్యాబ్, స్కూల్ వ్యాన్ డ్రైవర్లు బంద్‌కు పిలుపునివ్వడం చర్చనీయాంశంగా మారింది. రాష్ట్రంలో ఆర్టీసీ, కార్పొరేట్ సంస్థలకు ఈవీ ఆటోలు అందించే ప్రతిపాదనను వెంటనే నిలిపివేయాలని కార్మిక సంఘాల నేతలు డిమాండ్ చేశారు. రాష్ట్రంలో దాదాపు 7.5 లక్షల మంది ఆటో డ్రైవర్లు ఉన్నారని.. హైదరాబాద్లో సుమారు 2.5 లక్షల మంది ఉన్నారన్నారు. తమ సమస్యలు పరిష్కరించేంత వరుకు ఉద్యమం కొనసాగుతుందున్నారు. అయితే, ఆటో, క్యాబ్, స్కూల్ వ్యాన్ డ్రైవర్ల హెచ్చరికల నేపథ్యంలో మరి తెలంగాణ ప్రభుత్వం ఈ బంద్ అంశంపై ఎలా స్పందిస్తుందో వేచి చూడాలి.

# పెట్టుబడుల పేరుతో భారీ ఫ్రాడ్స్

- రిటైర్డ్ ఉద్యోగులే బాధితులు
- నేరాల స్వరూపం ఎప్పటికప్పుడు మారుతోంది
- చాల కేసుల్లో ఫిర్యాదు చేసేందుకు బాధితులే వెనకాడుతున్నరు? : డీజీపీ ఆనంద్

హైదరాబాద్, మనం ప్రతినిధి : నేరాల స్వరూపం ఎప్పటికప్పుడు మారుతోందని తెలంగాణ డీజీపీ సీవీ ఆనంద్ వ్యాఖ్యానించారు. సైబర్ నేరాల బారినపడుతున్న వారిలో రిటైర్డ్ ఉద్యోగులే ఎక్కువగా ఉంటున్నారని పేర్కొన్నారు. తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన సురక్ష కా తిరంగా సైబర్ అవేర్ నెస్ కార్యక్రమంలో డీజీపీ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ఇటీవల చోటు చేసుకున్న అన్ని కేసుల్లో కూడా ఫిర్యాదు చేసేందుకు సైతం బాధితులే వెనకాడుతున్నారన్నారు. సురక్ష కా తిరంగా కార్యక్రమంలో రిటైర్డ్ ఉద్యోగులు, సీనియర్ సిటిజన్స్‌ను భాగస్వామ్యం చేస్తూ అవగాహన కల్పిస్తున్నామని డీజీపీ తెలిపారు. కొన్నేళ్ల క్రితం వరకు ఫిజికల్ దోపిడీలు జరిగేవని.. కానీ ఇప్పుడు నార్కోటిక్, సైబర్ నేరాలు పెరిగాయని వెల్లడించారు. నార్కోటిక్స్ బారినపడి విద్యార్థులు, యువకులు తమ జీవితాన్ని నాశనం చేసుకుంటున్నారని తెలిపారు. సైబర్ నేరాల బారినపడుతున్న వారు.. ఫిర్యాదు చేయడానికి కూడా వెనకాడుతున్నారని చెప్పుకొచ్చారు.

**పెట్టుబడుల పేరుతో భారీ ఫ్రాడ్స్..**

సైబర్ నేరాల బారినపడుతున్న వారు.. ఎవరు ఏం అనుకుంటారోనని బయటకు కూడా చెప్పుకోవడం లేదని డీజీపీ అన్నారు. తాము 40 రకాల సైబర్ నేరాలను గుర్తించామని తెలిపారు. అయితే, ఇందులో ఎక్కువగా పెట్టుబడుల పేరుతో భారీ ఫ్రాడ్స్ ఉంటున్నాయని వివరించారు. తాము ఎంత అడ్డుకట్ట వేస్తున్నా.. సైబర్ నేరగాళ్లు ఎప్పటికప్పుడు అప్‌డేట్ అవుతూ కొత్తగా సైబర్ నేరాలకు పాల్పడుతున్నారని డీజీపీ సీవీ ఆనంద్ పేర్కొన్నారు.

# మహనీయుల స్ఫూర్తితోనే కాంగ్రెస్ ప్రభుత్వ పాలన

### పూలే దంపతుల ఆశయాల సాధనకు కంకణబద్ధులై పని చేస్తున్న ప్రజా ప్రభుత్వం

### దేశానికే ఆదర్శంగా తెలంగాణలో శాస్త్రీయంగా కులగణన

### రాష్ట్రంలో 56 శాతం మేర ఉన్న బడుగు, బలహీన వర్గాలు

### ఏడాదిలోనే 100 ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూళ్ల నిర్మాణం

### విద్యా, సంక్షేమానికి పెద్ద పీట వేస్తూ పూలే ఆలోచనలను అమలు చేస్తున్నాం

### పూలే దంపతుల విగ్రహాల ఆవిష్కరణ సభలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క



హైదరాబాద్,ఆగష్టు 14(మనం న్యూస్)ః బడుగు, బలహీన వర్గాల ఆత్మగౌరవం కోసం రాష్ట్ర ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తోందని, పూలే దంపతుల ఆశయాల సాధనకు కంకణబద్ధులై పని చేస్తున్నామని తెలంగాణ ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క స్పష్టం చేశారు. హైదరాబాద్‌లోని నెక్లెస్ రోడ్‌లో శుక్రవారం మహాత్మా జ్యోతిబా పూలే, సావిత్రిబాయి పూలే దంపతుల విగ్రహాలను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేతుల మీదుగా ఘనంగా ఆవిష్కరించారు. అనంతరం ఏర్పాటు చేసిన సభలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ప్రసంగించారు. సామాజిక అసమానతలను పారద్రోలి, అనగారిన వర్గాలు ఆత్మగౌరవంతో బతకాలనే లక్ష్యంతో జీవితాంతం కృషి చేసిన మహానుభావులు పూలే దంపతులని ఆయన కొనియాడారు. వారి విగ్రహాలను రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా ఆవిష్కరించుకోవడం మనందరి అదృష్టమని ఆయన పేర్కొన్నారు. ఈ విగ్రహాల ఆవిష్కరణ ద్వారా బలహీన వర్గాల అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉందన్న స్పష్టమైన సందేశాన్ని ఇచ్చామని వెల్లడించారు. పూలే ఆశయాలను కేవలం మాటలకే పరిమితం చేయకుండా ఆచరణలో అమలు చేస్తున్న ఏకైక ప్రజా ప్రభుత్వం తమదేనని ఆయన ఉద్ఘాటించారు.

**శాస్త్రీయంగా కులగణన :**

బీసీల రిజర్వేషన్‌ల అమలుకు శాస్త్రీయమైన గణాంకాలు అవసరమని గతంలో అనేకసార్లు న్యాయస్థానాలు చెప్పినప్పటికీ, గతంలో ఏ ప్రభుత్వమూ ఆ సాహసం చేయలేదని భట్టి స్పష్టంచేశారు. కానీ, దేశంలో మరే రాష్ట్రం చేయని విధంగా తెలంగాణలో శాస్త్రీయంగా కులగణన (సోషియో, ఎకనామిక్, పొలిటికల్ సర్వే) చేపట్టి దేశానికే ఆదర్శంగా నిలిచామని ఆయన గుర్తుచేశారు. ఈ సర్వే ద్వారా రాష్ట్రంలో బలహీన వర్గాలు 56 శాతం ఉన్నారని తేల్చామని, ఈ శాస్త్రీయ గణాంకాల ఆధారంగానే స్థానిక సంస్థల్లో బీసీలకు రిజర్వేషన్లు అమలు చేయబోతున్నామని ఆయన స్పష్టం చేశారు. గత ప్రభుత్వ హయాంలో జ్యోతిరావు పూలే ఓవర్సీస్ స్కాలర్‌షిప్‌లను కేవలం 300 మందికే ఇస్తే, కాంగ్రెస్ ప్రభుత్వం రాగానే ఆ సంఖ్యను 700లకు పెంచినట్లు ఆయన తెలిపారు. దశాబ్దాలుగా సంక్షేమ హాస్టళ్లకు పక్కా భవనాలు లేవని సభలో ఆర్. కృష్ణయ్య ప్రస్తావించిన అంశంపై ఆయన స్పందిస్తూ.. సీఎం రేవంత్ రెడ్డి ఈ విషయంపై ప్రత్యేక దృష్టి సారించారని తెలిపారు. చరిత్రలో ఎన్నడూ లేని విధంగా కేవలం ఏడాది కాలంలోనే ఒక్కో భవనానికి రూ. 200 కోట్లు కేటాయించి, రాష్ట్రవ్యాప్తంగా 100 ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూళ్లను నిర్మిస్తున్నట్లు భట్టి వెల్లడించారు. ప్రభుత్వం ఏర్పడిన వెంటనే రెసిడెన్షియల్ స్కూళ్లలో డైట్ ఛార్జీలను 40 శాతం, కాస్మోటిక్ ఛార్జీలను 200 శాతం పెంచిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానిదేనని భట్టి పునఃరుద్ఘాటించారు. మహనీయుల విగ్రహాలు ఏర్పాటు చేసుకునేది వారి మార్గంలో ప్రయాణించి, వారు చెప్పిన సిద్ధాంతాలను అమలు చేసేందుకు స్ఫూర్తి పొందడానికేనని డిప్యూటీ సీఎం స్పష్టం చేశారు. ఆ మహానుభావుల స్ఫూర్తి ప్రస్తుత రాష్ట్ర ప్రభుత్వ పాలనలో చాలా స్పష్టంగా కనిపిస్తోందని, వారి విగ్రహావిష్కరణలో పాలుపంచుకునే అవకాశం రావడం పట్ల ఆయన ఆనందం వ్యక్తం చేశారు.

# ఫీజుల జులుం ఎన్నాళ్లు?

- స్కూల్ ఫీజుల నియంత్రణకు చట్టం తేవాలి
- భారీ ఫీజులతో సామాన్య కుటుంబాలపై ఆర్థిక భారం
- ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య అందించాలని సూచన
- ఫీజుల నియంత్రణ కోసం త్వరలో రౌండ్ టేబుల్ నిర్వహిస్తం
- తల్లిదండ్రులు, విద్యావేత్తలు హాజరుకావాలని మాజీ ఐఏఎస్ అధికారి ఆకునూరి మురళి పిలుపు

హైదరాబాద్, మనం ప్రతినిధి : తెలంగాణ రాష్ట్రంలో విచ్చలవిడిగా సాగుతున్న ప్రైవేట్ పాఠశాలల ఫీజుల పెంపుపై విశ్రాంత ఐఏఎస్ అధికారి ఆకునూరి మురళి తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. కార్పొరేట్, ప్రైవేట్ విద్యాసంస్థలు ఇష్టారాజ్యంగా ఫీజులు పెంచుతున్నాయని ఆరోపించారు. సామాన్య, మధ్యతరగతి కుటుంబాలపై ఈ భారం పడుతోందని పేర్కొన్నారు. ఫీజుల నియంత్రణకు ప్రభుత్వం తక్షణమే ప్రత్యేక చట్టం తీసుకురావాలని డిమాండ్ చేశారు.

ఈ మేరకు సోషల్ మీడియా వేదికగా విడుదల చేసిన వీడియోలో ఆయన ప్రభుత్వ విద్యా వ్యవస్థపై ప్రశ్నలు లేవనెత్తారు. నాణ్యమైన విద్య అందక పిల్లలను ప్రభుత్వ పాఠశాలలకు పంపలేని పరిస్థితి ఉందన్నారు. మరోవైపు ప్రైవేట్ స్కూళ్లలో భారీ ఫీజులతో కుటుంబాల నెలవారీ బడ్జెట్ తలకిందులవుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. అయితే, స్వాతంత్ర్యం వచ్చి ఇన్నేళ్లు గడిచినా ప్రజలకు నాణ్యమైన ప్రభుత్వ విద్య అందించలేకపోవడం బాధాకరమన్నారు. ప్రైవేట్ స్కూళ్ల ఫీజుల నియంత్రణకు సరైన చట్టం లేకపోవడం వల్లే సమస్య మరింత తీవ్రమవుతోందని విమర్శించారు.

ప్రైవేట్ పాఠశాలల ఫీజుల నియంత్రణ చట్టం కోసం తెలంగాణ పీపుల్స్ ఫ్రంట్ ఆధ్వర్యంలో త్వరలోనే ఓ రౌండ్ టెబుల్ సమావేశం నిర్వహించనున్నట్లు ఆకునూరి మురళి తెలిపారు. విద్యార్థుల తల్లిదండ్రులు, విద్యావేత్తలు, ప్రజా సంఘాల నాయకులు పెద్ద సంఖ్యలో హాజరై సమావేశాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

# తిరుపతి జిల్లాలో గంజాయి అక్రమ రవాణాపై పోలీసుల కఠిన చర్యలు

తిరుపతి రూరల్ ఆగస్టు 14 మనం న్యూస్: తిరుచానూరు పోలీస్ స్టేషన్ పరిధిలో శుక్రవారం అందిన విశ్వసనీయ సమాచారం మేరకు పోలీసులు, రెవెన్యూ అధికారుల సమక్షంలో పద్మావతి పురం స్మశానం వద్ద ఐదు మంది ముద్దయులను అరెస్ట్ చేసి మొత్తం 5 కిలోల గంజాయిని స్వాదీనము చేసుకున్నాము. ప్రధాన నిందితుడైన అరుగొండం సోమశేఖర్ శ్రీకాళహస్తి ప్రాంతం నుంచి గంజాయి తీసుకువచ్చి తిరుపతి, రేణిగుంట పరిసరాల్లో విక్రయిస్తున్నట్లు దర్యాప్తులో వెల్లడైంది. ఈ కేసులో అరుగొండం సోమశేఖర్, అక్కల రథసారధి, షేక్ ఫైరోజ్ ఫైరు, పన్నూరు లీలాక్రిష్ణ, గురివింటి చరణ్ తేజ్లను అరెస్ట్ చేశారు.

**వెస్ట్ పోలీసులు – 13 కిలోల గంజాయి స్వాధీనం**

వెస్ట్ పోలీస్ స్టేషన్ పరిధిలో ప్రత్యేక నిఘాలో బాగంగా శుక్రవారం మెటర్నటీ హాస్పిటల్ రోడ్డు, రాజన్న పార్కు వెనుక ప్రాంతంలో నలుగురిని పోలీసులు అరెస్ట్ చేసి వారి వద్ద నుంచి 13 కిలోల డ్రై గంజాయి, 4 సెల్ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు.

ఈ కేసులో కొండామర్రి జగదీష్, గొడ్ల పార్థసారథి అలియాస్ పార్థు, షేక్ ఇర్ఫాన్, బడి పోలయ్యలను అరెస్ట్ చేశారు. పోలయ్య విశాఖపట్టణం ప్రాంతానికి చెందినవాడు, ఇతను అక్కడ నుంచి గంజాయిని తిరుపతి లో ముద్దాయిలకు విక్రయించేందుకు తీసుకోచ్చారు అని దర్యాప్తులో వెల్లడైంది. ఈ ఘటనపై ఎన్ డి పి ఎస్ యాక్ట్ -1985 కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

ఈ కేసులకు సంబంధించిన వివరాలను తిరుపతి ఎస్పీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన పత్రికా సమావేశంలో అదనపు ఎస్పీలు శ్రీనివాసులు (పరిపాలన), కె. రవి మనోహరాచారి (శాంతి భద్రతలు) వెల్లడించారు.

## నవకేతనం

కాలపు విలువ చెప్పే,
ధర్మమార్గం దారిచూపే,
నైతికవిలువల బాట తెలిపే,
బానిసత్వ నిరోధం
ఔన్నత్య సంకేతం
పురోగామి కేతనమై
స్వతంత్ర పోరాటయోధుల
త్యాగాలపునాదులమీద నిలిచి
ఏడున్నర దశాబ్దాలపైగా
అంబరాన రెపరెపలాడుతున్న
జాతీయజెండా...

రైతుల కన్నీటి కడలి మునకలు,
నాకేమిటి,నీకేమిటిల
వాటాల పరుగులు,
వ్యవస్థాగత మార్పులతో
వ్యాపారుల బేజారు,
కనుమరుగైన నిస్వార్థసేవలు,
కుటిల కుతంత్రాలకు
ఎందరో బలవుతోంటే,

ఎన్ని చట్టాలొచ్చినా
అబలలపై వికృతచేష్టలు
షరా మామూలు కాగా,
తిరోగామి వాగ్దానాల
కల్లోల వేదికలతో
వేసారిపోతోన్న వ్యవస్థను
బాధాతప్త హృదయంతో కని,
నిర్మల పాల కడలి వంటి సమాజానికై
ఎదురుచూస్తోంది ఆత్రంగా.
ఇప్పటికైనా ...
స్వతంత్ర భారతి మోముపై
సంతోషసుమాలు విరిసేట్టు
విశాల భావాల
నిర్భయ జీవన గమనాల
'నవకేతనం' ఎగరేద్దాం.
ముదమారా కలసి వేద్దాం
ముచ్చటైన భవితల రాచబాట.

**- వేమూరి శ్రీనివాస్**
9912128967

## స్వేచ్ఛా జెండా నీడలో...

స్వాతంత్ర్య సూర్యుడు నెత్తిన నిలిచినా
స్వేచ్ఛా నీడ కోసం మనిషి ఇంకా
వెతుకుతున్నాడు.

జెండా గుండెలో మూడు రంగులు
రెపరెపలాడుతున్నాయి.
జీవితాల్లో ఎందుకో మిగిలేది నలుపే...
దేశం ఒక అఖండ దీపమైతే..
దాని వత్తులై కాలిపోయిన వాళ్లెందరో...

రక్తంతో రాసిన చరిత్ర పుటలపై
స్వార్థం వల్ల చాలా మంది సంతకాలు చేస్తున్నారు.
పొలాల నుదుటిపై పగుళ్లు పూస్తుంటే
రైతు కన్నీరు కాలువై పారుతోంది...

పట్టణాల గాజు మేడల్లో వెలుగులు పూస్తుంటే
పల్లె చీకటి తన నీడను తానే మింగుతోంది.
కులం ఒక కత్తిలా గుండెల్ని కోస్తుంటే
మతం ఒక మంటలా మనసులను కాలుస్తోంది.

మనిషి మనిషికి మధ్య గోడలు పెరుగుతుంటే
భారతమాత ఒడిలో ఏకత్వం మూగబోతుంది...
అక్షరాలు అమ్ముడై వార్తలు వంగిపోతుంటే
నిజం నడిరోడ్డుపై నగ్నంగా నిలబడుతోంది...

న్యాయం నెమ్మదిగా నడిచే నడకను చూసి
అన్యాయం గుర్రమెక్కి పరుగెడుతోంది...
అయినా...ఈ నేల ఇంకా ఓడిపోలేదు

బొటనవేలి ప్రాణంతో
ప్రజాస్వామ్యం కొట్టుకుంటోంది
యువతరం కంట్లో కొత్త భారతం మెరుస్తోంది

జెండా కేవలం గాలికి ఊగే వస్త్రం కాదోయి
అది అమరుల ఊపిరితో ఎగిరే అగ్నిపతాకం
స్వాతంత్ర్యం కేవలం పండుగ చప్పుడు కాదోయి
ప్రతి అన్యాయానికి ఎదురు నిలిచే ప్రజా ప్రకటన

దేశాన్ని ప్రేమించడం అంటే...!?
దేశం గొప్పదని పాడుకోవటమే కాదు...
దేశం బాధను తన గుండెలపై మోపి

'మనిషే నా మతం, న్యాయమే నా జెండా' అని
నిలబడి నినదించడమే నిజమైన దేశభక్తి...
బోలో..స్వతంత్ర్య భారత్ కి జై...!

**- డా. కటుకోఝ్వల రమేష్**
9949083327

# భారత జాతీయ పతాక నేపథ్యం

త్రివర్ణ పతాకం భారత దేశపు గడ్డమీద మొదటి సారిగా బోస్ చేత మణిపూరులో ఆవిష్కరించ బడింది.1923లో మొదట ఎగిరిన స్వరాజ్ పతాకం అని పేరున్న భారత జాతీయ కాంగ్రెస్ పతాకం భారత జాతీయ పతాకానికి ఆధారం.

రెండవ ప్రపంచ యుద్ధంలో ఆజాద్ హింద్ ఫౌజ్ వాడిన జెండా, అదే సమయంలో ఇండియన్ నేషనల్ ఆర్మీ ఈ పతాకాన్ని స్వల్ప మార్పులతో - చరఖా స్థానంలో 'ఆజాద్ హింద్' అన్న అక్షరాలు, ముందుకు దూకుతున్న పులి బొమ్మతో - వాడుకొంది.

20వ శతాబ్దం ప్రారంభంలో స్వాతంత్ర్యోద్యమం బాగా ఊపందుకున్నప్పుడు జాతీయోద్యమ స్ఫూర్తిని, లక్ష్యాలను ప్రతిబింబించే జాతీయ పతాకం అవసరమైంది. 1904లో వివేకానందుడి శిష్యురాలైన ఐరిష్ వనిత సోదరి నివేదిత భారత దేశపు మొట్టమొదటి పతాకాన్ని రూపొందించింది. ఇది పసుపు, ఎరుపు రంగుల్లో ఉన్న జెండా. జెండా మధ్య భాగంలో వజ్రాయుధం, తెల్ల తామర గుర్తులున్నాయి. '(భారత) మాతకు వందనం' అనే అర్థం వచ్చే బెంగాలీ మాటలు (వందేమాతరం)' ఆ జెండా మీదున్నాయి. ఎరుపు స్వాతంత్ర్య పోరాటానికి, పసుపు విజయానికి, తెల్ల తామర స్వచ్ఛతకు చిహ్నాలు. 1907లో మేడం భికాజీ కామా ఎగరేసిన జండా మొట్ట మొదటి త్రివర్ణ పతాకం 1905లో జరిగిన బెంగాల్ విభజనను వ్యతిరేకిస్తూ జరిగిన ఒక నిరసన ప్రదర్శనలో 1906 ఆగష్టు7 న కలకత్తాలోని పార్శీబగాన్ స్క్వేర్‌లో శచీంద్ర ప్రసాద్ బోస్‌చే ఆవిష్కరించ బడింది. ఈ పతాకాన్ని 'కలకత్తా పతాకం' అంటారు. ఈ పతాకంలో సమాన వెడల్పుతో అడ్డంగా మూడు పట్టీలున్నాయి.. పైన నారింజ రంగు, మధ్యలో పసుపుపచ్చ, క్రింద ఆకుపచ్చ పాటు సమాంతర గీతలను కలిగి ఉంది. పైపట్టీ మీద సగం విచ్చుకున్న ఎనిమిది తామర పూలు, కింది పట్టీ మీద నెలవంక, సూర్యుడు మధ్యలో దేవనాగరి లిపిలో 'వందేమాతరం' అనే అక్షరాలు ఉన్నాయి. 1917 లో హోంరూల్ ఉద్యమంలో వాడిన జండా, 1907 ఆగష్టు 22 న మేడం భికాజీ కామా జర్మనీ లోని సుట్‌గార్ట్ లో మరో జండాను ఎగరేసింది. ఈ జండాలో పైన ఆకుపచ్చ, మధ్యన కాషాయం, అడుగున ఎరుపు రంగులు ఉన్నాయి. ఇందులో ఆకుపచ్చ ఇస్లాముకు, కాషాయం హిందూ, బౌద్ధాలకు సూచికలు. ఆకుపచ్చ పట్టీలో బ్రిటిషు భారతంలోని 8 ప్రావిన్సులకు గుర్తుగా 8 పద్మాలు ఉన్నాయి. మధ్యనున్న కాషాయ పట్టీలో దేవనాగరి లిపిలో వందేమాతరం రాసి ఉంది. అడుగున ఉన్న పట్టీలో స్థంభానికి దగ్గరగా నెలవంక, రెండో చివర సూర్యుడు ఉన్నాయి. ఈ జండాను భికాజీ కామా, వీర సావర్కార్, శ్యాంజీ కృష్ణ వర్మలు కలిసి తయారు చేసారు.

మొదటి ప్రపంచ యుద్ధం మొదలయ్యాక, బెర్లిన్ కమిటీలోని భారతీయ విప్లవకారులు దీన్ని స్వీకరించాక, ఈ జండా బెర్లిన్ కమిటీ జండాగా పేరు పొందింది. మొదటి ప్రపంచ యుద్ధ కాలంలో మెసొపొటేమియాలో ఈ జండాను విస్తృతంగా



ఉపయోగించారు. గదర్ పార్టీ జండాను కూడా అమెరికాలో భారతీయ చిహ్నంగా కొన్నాళ్ళు ఉపయోగించారు.

1917లో తిలక్, అనీబిసెంట్లు హోంరూల్ ఉద్యమంలో ఐదు ఎరుపు, నాలుగు ఆకు పచ్చని అడ్డపట్టీలు గల ఇంకొక జెండాను వాడారు. జెండా పైభాగంలో ఎడమవైపు తాము కోరిన డొమినియన్ హోదాకు సూచికగా యూనియన్ జాక్ గుర్తు, కుడివైపు తార-నెలవంక గుర్తులను వాడారు. దానికి దిగువన హిందువులకు పవిత్రమైన సప్తర్షి మండలానికి గుర్తుగా ఏడు నక్షత్రాలున్నాయి. యూనియన్ జాక్ ఉండడం వల్లనేమో ఇది జనామోదం పొందలేకపోయింది. 1916లో మచిలీపట్నానికి చెందిన పింగళి వెంకయ్య ఒక జాతీయ పతాకాన్ని రూపొందించే ప్రయత్నం చేశాడు. ఆయన ప్రయత్నాన్ని గుర్తించిన ఉమర్ సుభాని, ఎస్.బి.బొమ్మన్‌జీ ఇండియన్ నేషనల్ ఫ్లాగ్ మిషన్ ను ఏర్పాటుచేశారు. వెంకయ్య తాను రూపొందించిన పతాకాన్ని గాంధీజీకి చూపించగా, ఆయన దాంట్లో భారతదేశానికీ, దేశం తానెదుర్కొంటున్న సమస్యలనుంచి విముక్తి పొందడానికీ చిహ్నంగా నిలిచిన చరఖా(రాట్నము)ను చేర్చమని సలహా ఇచ్చాడు. నిరాడంబరమైన రాట్నము గాంధీజీ నేతృత్వంలో భారతదేశ ఆర్థిక పునరుత్థానానికి ప్రతీకగా నిలిచింది. పింగళి వెంకయ్య గాంధీ సూచన ప్రకారం ఎరుపు-ఆకుపచ్చ రంగు పట్టీల మీద రాట్నము గుర్తును రూపొందించి చూపాడు. ఐతే అది అన్నిమతాలకూ ప్రాతినిధ్యం వహించేలా లేదని గాంధీ దాన్ని తిరస్కరించాడు. గాంధీ ఆలోచనలకు అనుగుణంగా ఇంకొక త్రివర్ణపతాకం పైనుంచి క్రిందకు వరుసగా తెలుపు, ఆకుపచ్చ, ఎరుపుపట్టీలతో, మూడు పట్టీలమీదుగా ఒకే పెద్ద రాట్నము గుర్తుతో రూపొందించ బడింది. ఆ మూడు పట్టీలు మైనారిటీ మతాలు, ముస్లిం, హిందూ మతాలకు సూచికలు. ఇది అప్పటి బ్రిటిష్ సామ్రాజ్యానికి వ్యతిరేకంగా స్వాతంత్ర్యపోరాటం సాగిస్తోన్న ఐర్లాండు పతాకాన్ని పోలి ఉంది. ఈ పతాకాన్ని అహమ్మదాబాదు కాంగ్రెసు సమావేశంలో ఆవిష్కరించారు. ఇది కాంగ్రెసు అధికార పతాకం కాకపోయినా జాతీయోద్యమంలో ఎక్కువగా వాడారు. ఐతే ఆ జెండాలో మతాలకు చిహ్నాలుండడం చాలామందికి నచ్చలేదు.

1924లో కలకత్తాలో సమావేశమైన ఆలిండియా కాంగ్రెస్ హిందువులకు చిహ్నాలుగా కాషాయ రంగును, గదను చేర్చాలని కోరింది. అదే సంవత్సరం హిందూ యోగుల, ముస్లిం ఫకీర్లు-దర్వేషీల వైరాగ్యానికి చిహ్నమైన జేగురు రంగును చేర్చాలనే ప్రతిపాదన కూడా వచ్చింది. సిక్ఖులు తమ మత చిహ్నంగా పసుపురంగును కూడా చేర్చాలని, లేనట్లైతే మతపరమైన సూచికలను పూర్తిగా తొలగించాలని కోరారు.

భారత దేశంలో అతిపెద్ద రాజకీయ వేదికగా ఉన్న భారత జాతీయ కాంగ్రెసు 1921లో తెలుపు, ఆకుపచ్చ, ఎరుపు రంగులతో అనధికారికంగా ఒక పతాకాన్ని రూపొందించుకొంది. అఖిల భారత కాంగ్రెస్ కమిటీ సమావేశంలో ఆంధ్రా ప్రాంతానికి చెందిన ఒక యువకుడు జెండా తయారు చేసి గాంధీజీకి ఇచ్చాడు. ఈ కార్యక్రమం 1921లో బెజవాడ (ప్రస్తుతం విజయవాడ) లో జరిగింది. ఇది రెండు రంగులతో తయారు చేయబడింది. ఎరుపు హిందూ మతానికి, ఆకుపచ్చ ఇస్లాం మతానికి, తెలుపు ఇతర మతాలకు సూచికలు. కాంగ్రెసు 1931లో కాషాయం, తెలుపు, ఆకుపచ్చ రంగులతో, మధ్యలో రాట్నము బొమ్మగల పతాకాన్ని తన అధికారిక పతాకంగా స్వీకరించింది. ఈ పతాకంలో ఎటువంటి మతపరమైన ప్రతీకలూ లేవు. ఈ పరిణామాల మధ్య కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ 1931 ఏప్రిల్ 2న ఈ వివాదాలను పరిష్కరించడానికి ఏడుగురు సభ్యులతో ఫ్లాగ్ కమిటీని నియమించింది.

'జెండాలోని మూడు రంగులూ మతాలనుద్దేశించినవే కాబట్టి అభ్యంతరకరమైనవేనని' కమిటీ తీర్మానించింది. ఫలితంగా పూర్తిగా ఎర్రమట్టిరంగులో, పైభాగాన రాట్నము గుర్తుతో ఒక కొత్త జెండా తయారైంది. దీన్ని ఫ్లాగ్ కమిటీ ఆమోదించినా ఇది కూడా మతపరమైన భావజాలాన్నే సూచిస్తోం దనే ఉద్దేశంతో కాంగ్రెస్ పార్టీ ఆమోదించలేదు. తర్వాత 1931 కరాచీ కాంగ్రెస్ సమావేశంలో పై నుంచి కిందకు వరుసగా కాషాయం, తెలుపు, ఆకుపచ్చ రంగుల్లో పట్టీలు, మధ్యలో చరఖాతో పింగళి వెంకయ్య రూపొందించిన పతాకాన్ని స్వీకరిస్తూ జాతీయజెండాపై తుది తీర్మానం ఆమోదించబడింది.

స్వతంత్ర భారతదేశ జాతీయ పతాకాన్ని నిర్ణయించడానికి రాజ్యాంగసభ, 1947 జూన్ 23న బాబూ రాజేంద్ర ప్రసాద్ అధ్యక్షతన మౌలానా అబుల్ కలామ్ ఆజాద్, కె.ఎం.పణిక్కర్, సరోజినీ నాయుడు, రాజాజీ, కె.ఎం.మున్షీ, బి.ఆర్.అంబేద్కర్ లతో ఒక కమిటీని నియమించింది. ఆ కమిటీ 1947 జూలై 14న కాంగ్రెస్ పతాకాన్నే అన్ని పార్టీలకు, మతాలకు ఆమోదయోగ్యమయ్యే మార్పులతో జాతీయపతాకంగా స్వీకరించాలని నిర్ణయించింది. దాంట్లో మతపరమైన సూచికలేవీ ఉండరాదని తీర్మానించింది. 1947 ఆగస్టులో భారతదేశానికి స్వాతంత్ర్యం రావడానికి కొన్నిరోజుల ముందు ఏర్పాటైన రాజ్యాంగసభ, కాంగ్రెస్ పార్టీ పతాకాన్నే అన్ని పార్టీలకు, అన్ని మతాలవారికి ఆమోదయోగ్యమైన మార్పులు చేసి జాతీయ పతాకంగా స్వీకరించడానికి నిర్ణయించింది. అన్నిటికంటే ముఖ్యమైన మార్పు రాట్నము స్థానంలో అశోకచక్రాన్ని చేర్చడం. చరఖా స్థానంలో సారనాథ్ స్థూపంలోని ధర్మచక్రాన్ని చేర్చారు. ఈ కొత్త పతాకాన్ని స్వతంత్ర భారత జాతీయ పతాకంగా ఉద్వేగ భరిత వాతావరణంలో 1947 ఆగష్టు 15 నాడు ఆవిష్కరించారు.

**- రామకిష్టయ్య సంగన భట్ల**
9440595494

# మూడు దశాబ్దాలు .. మూడు తరాలు.. మూడు భావజాలాలు



కాలం రీత్యా ఇది మూడు దశాబ్దాల కవిత్వం. తరాల రీత్యా ఇది మూడు తరాల కవిత్వం. భావజాలం రీత్యా ఇది మూడు భావజాలాల కవిత్వం. చరిత్ర ఇది. ముప్పయ్యేళ్ళ కవిత్వ చరిత్ర ఇది. ముప్పయ్యేళ్ళ బోధనం నర్సిరెడ్డి చరిత్ర ఇది. ముప్పయ్యేళ్ళలో తెలుగు కవిత్వ పరిణామ చరిత్ర ఇది. చరిత్ర కోసం కవిత్వం చదవక్కర్లేదు. సాహిత్య చరిత్రను చదవొచ్చు. దేశ చరిత్రలు చదవొచ్చు. బోధనం కవిత్వం ఎందుకు చదవాలి. ఎవరి కవిత్వమైనా ఎందుకు చదవాలి. మానవ స్పందనల్ని ఏ చరిత్రా రికార్డు చేయలేదు. సాహిత్యం తప్ప ముఖ్యంగా కవిత్వం తప్ప

బోధనం స్పందనల ఆధారంగా ఈ మూడు దశాబ్దాలను కొలుద్దాం. ఈ దశాబ్దాల ఆధారంగా బోధనం కవిత్వాన్ని కొలుద్దాం

వయసులో కొంచెం చిన్న వాడైనా కవిత్వంలో నాకన్నా పెద్దవాడు. బోధనం కవితా చేలాంచల కొసగాలుల విసురులు తొలుత అతని మీదే ప్రసరించినవి. విరసం (విప్లవ కవిత్వం) దందహ్యమాన దశాబ్దంగా పిలుపబడే '70'ల్లో కలం పట్టిండు. విప్లవ కవిత్వంలో సూర్యుడు ఒక బలమైన ప్రతీక. ఆ ప్రతీకను తీసుకొని ఎంతో మంది కవిత్వం రాసిన్రు. 'రక్తం సూర్యుడు' లాంటి సంకలనా లొచ్చినై.

'రంపపు పెట్టులాగా సహస్ర కిరణ కరాలెత్తుకుని సూర్యుడు దయిస్తాడు' స్థానికత లోంచి ఇంత మంచి పోలిక నెవరూ చెప్పలేదు. ఈ సంకలనంలోని మొదటి కవిత ఇది.

'విచ్చు కత్తులతో సూర్యుడుదయిస్తాడు'. విరసం సభ్యుడైనందుకా ఇంత శక్తివంతమైన వ్యక్తీకరణ? మంచి నిర్మాణ శిల్పం ఉన్న కవిత ఇది. శబ్దం, వాక్యం, భావం, జీవం ప్రపోర్షనేట్ గా ఉండటమే నిర్మాణ శిల్పం. అట్లాంటి మరో మంచి కవిత 'పరాజితుడు'. ఏ కవి కవిత్వంలోనైనా అంతర్లీనంగా అతని దృక్పథం ఉంటుంది. అయినా అనాది నుంచి అనేక మంది కవులు ప్రత్యేకంగా తమ కవిత్వం గురించి కవిత్వం రాసిండ్రు. అట్లా బోధనం కూడా రెండు కవితలు రాసిండు. నాకైత, మంటను రాయడం చూడు - రెండింటిలో వస్తువొకటే అయినా నాకు నచ్చింది రెండో కవిత.'నా తల చీలికలయ్యేలా నన్ను దున్నుతున్న నాగేలు నా కవిత్వం నల్లద్దాల చల్లదనాన్నో నింగి చుక్కల చక్కదనాన్నో చూడకు నా కవిత్వంలో చెమటనూ చెమర్చిన కంటినీ చూడు'

ఇది ఒక దశ. ఈ దశకు ఇది ఒక ప్రాతినిధ్య కవిత.

'అయ్యా / ఇన్నాళ్లూ మీరు/ మాస్వేదాశ్రు ధారతో స్నానం చేసిన వాళ్లు/ మా కన్నీటితో / దాహం తీర్చుకున్న వాళ్లు మా ఆర్తనాదంలో సంగీతం విన్న వాళ్లు....కాని ఇప్పుడు...../ మేం మీ బానిసలం కాం/ మీలో ఒక్కరమూ కాం కాని మీరు మాత్రం / మాలో ఒకరు కండి'. మరొకటి.. విల్లె వంగిన / నా ఒళ్ళు చెప్పే పాఠం/ ఇక విల్లంబులే మరి శరణ్యం/ స్ఫురణ కొస్తోంది నాకరణ్యం. మొత్తం కోట్ చేయాల్సిన కవిత 'నగరం బాకీ'.

ఇది ఒకటోదశ. ఒకటోతరం.




1981 తరువాత 1992 దాకా కవితల్లేవు. 1982 లో యూనివర్శిటీ నుంచి బయటి కొచ్చిండు. యూనివర్శిటీ నుంచే బయటికొచ్చిండా? యూనివర్సల్ నుంచి వ్యక్తి జీవితం లోకి వచ్చి పడ్డాడా? విప్లవోద్యమ ఆవరణంలోంచి తనలోకి వచ్చి పడ్డాడా? లేక విప్లవోద్యమం తనను కట్టి పడేయలేక పోయిందా? ఏం జరిగిందో తెలియదు. మొత్తానికి ఈ కాలంలో మౌనమే ఈయన కవిత్వం.

ఈ సుదీర్ఘ నిశ్శబ్దం తరువాత....నిశ్శబ్దంగా లేడు- శబ్దం లేకుండా మౌనంగా ఘోషిస్తూనే ఉన్నడు. ఒక దశాబ్ద కాలాన్ని మోస్తూనే ఉన్నడు. మధన పడ్తూనే ఉన్నడు. ఘర్షిస్తూనే ఉన్నడు. దశాబ్దమౌనాన్ని, ఘర్షణను ఒకే కవితలో బళ్ళున బద్దలు చేసిండు.అది 'ఇంటలెక్చువల్స్'కవితలో.. 'అప్పుడప్పుడు / అడవిని గురించి ఆకాశం గురించీ/ చెట్లమాటు సూర్యోదయాల వక్రత గురించీ/ ఉద్రేకంతో ఉపన్యసిస్తాం/ తప్పటడుగుల నుంచి తప్పుకొని మనం/ భూభ్రమణంలో తప్పులు పడతాం చీకటి సుఖానికి రుచి మరిగిన మనం/ సూర్యుని మచ్చల్లో చీకట్లను దేవులాడతాం/ నలుగురితో కలిసి నడిచిన మనం/ ఆఖర్న అటుకొందర్నీ ఇటు కొందర్నీ పంపి/ ఒక్కరం వెనక్కి తిరిగొస్తాం'. కలుషితమైన ఒక దశాబ్దాన్ని యూరోప్ పరిణమాల్ని ప్రపంచ సామ్యవాద మార్పుల్ని కవితాత్మకంగా వ్యాఖ్యానిస్తడు. తప్పొప్పులు పక్కన పెడదాం-ఇది రెండో దశ. రెండో తరం.

కొంచెం ఆ హ్యాంగోవర్ ఇంకా మిగిలి ఉందేమో - 'సౌఖ్యసమాధిలో సుఖ నిద్రకై పరితపించకు/ చలనగుణాన్ని శరీరంలో జీర్ణించడమే నిజంగా మనం జీవించడం' అంటాడు. అప్పటికే కొత్త ప్రశ్నలు- పాత సమాధానాలు. బాలగోపాల్ అన్నట్లు కొత్త ఉద్యమాలు - పాత సిద్ధాంతాలు మొదలై చాలా సంవత్సరాల గడువు దాటింది. లింగ, కుల, ప్రాంత, మత వేదనలు 1995 ప్రాంతం నుంచి వీటి నుండి ఎవరూ తప్పించుకోలేని స్థితి వచ్చింది.

ఈ నేపథ్యంలో బోధనం నర్సిరెడ్డి 'మై కెమీలియన్ ఫాదర్' అనే అద్భుత కవిత రాసిండు. ఆయన మొత్తం కవిత్వంలో ఇది గొప్ప కవిత. ప్రపంచ కవిత్వంలో చేరదగిన కవిత ఇది. ఎన్.ఆర్.బోధనం బోధనం నర్సిరెడ్డిగా వ్యక్తం కాక తప్పని స్థితి. అసలు సిసలు దిగంబర కవిత ఇది. తెలుగు కవిత్వంలో మరే కవితలోనూ బహుషా ప్రపంచ కవిత్వంలోనూ పోల్చలేని రూపరీత్యా, వస్తురీత్యా యునిక్ కవిత ఇది. 'ముడ్డి మొల్తాడుకు రెండు మెల్కలేసి/ కాసెగట్టి గోసిబోసినప్పుడు/ కాల్వకిందికి జీవాల్ని తోలుతున్న పర్వతాలు మా నాయ్న'...అట్లా మొదలై ఎన్నెన్ని కులాలుగా డికాస్టిఫై అయి...చెల్లెలు మనుసుపడ్డ చంద్రయ్యను/ కులం తక్కువోడని/ రచ్చకాడ పెద్ద మనుషులతో గలిసి/ తానూ నాలుగు దన్నినప్పుడు మాత్రం/ బోధనం అంతిరెడ్డి పటేలు మా నాయ్న'

ఇక్కడ మాత్రం డికాస్టిఫై కాని శతాబ్దాల భారత కుల వ్యవస్థపైన పిడుగులు కురిపించిన కవిత ఇది.

భారతదేశ కుల వ్యవస్థ మీద లోతైన, గాఢమైన వ్యాఖ్యానమిది. ఈ అస్తిత్వ ఉద్యమాల నేపథ్యంలో స్త్రీ అస్తిత్వాన్ని గురించి రాసిన 'చెదనుదులిపెయ్' తెలంగాణ అస్తిత్వాన్ని తెలిపే 'పంచాయితీ' మంచి కవితలు. ఈ అస్తిత్వ ఉద్యమాల కొనసాగింపుగా వచ్చిన 'పురుగు' కవితలో మాత్రం తన సహజ సంయమనాన్ని మించిన ఆవేశం చూపిండు. నిప్పులు చెరిగిండు. దీనికి ఎవరి 'అతి' ఎంత కారణమో ఎవరికి వాళ్ళే వివేచించుకోవాలి. ఇది మూడవ దశ, మూడవ తరం.బోధనం నర్సిరెడ్డి అంటే బోధనం ఊరి నుంచి వచ్చినవాడు మార్గ కవిత నుంచి కాక దేశికవిత నుంచి వచ్చిన వాడు. అప్రాతిపదిక మీదే అద్భుతమైన కథలు రాసిండు. కాని కవిత్వంలో చాలా కవితల్లో 'మార్గ'ను వదిలిపెట్టలేదు - అది పదాల్లో వాక్యాల్లో వ్యక్తమయింది. మార్గను వదిలి వేస్తే మంచి లక్ష్యంతో దేవరాజులా వ్యక్తం కావడానికి పుష్కలమైన సంపత్తీ ఉన్నవాడు. అదే ఆయన బలం. ఆ బలంతో కొనసాగాలని ఆకాంక్షిస్తూ...

**- సుంకిరెడ్డి నారాయణరెడ్డి**

## నా ఎనభయో ఏటా...

బిడ్డలు...
తోవ దొరకని నాడు మీరు నడిసిన అడుగులే
దారులు సూపినై
అది డిల్లీ ఐతేంది గల్లీ ఐతేంది
జార్ఖండ్ ఐతేంది అంధుల హాస్టల్ ఐతేంది
ఎట్లయితే గట్లాయననే మీ నిజాయితీ తెగింపు
ఇప్పుడు నా భయాల సంకెళ్ళను తెంపినై
మిమ్ముల బొద్దింకలన్నారు గానీ కొడుకులారా
మీరు తేనెటీగలోలే కరుస్తుంటే
వాళ్ళిప్పుడూ మంటేడ పెట్టాల్నో,
మందెక్కడ పూసుకోవాల్నో తెల్వక
తక్కిడమీక్కడం ఐతండ్రు తండ్రులారా...
మీలో
లాఠీలకు ఒళ్ళుప్పజెప్పి నిలబడ్డపుడు
ఒక చెంప కొడితే ఒక ఇంకొక చెంప
సూపెట్టమన్న
గాంధీలోలే కనపడ్డరు
నెత్తరిత్తే స్వాతంత్ర్యం తెత్తన్న సుభాష్
చంద్రబోసును మరిపించిండ్రూ
మీరే మీ నెత్తురంతా ధారబోస్తూ
విప్లవం వర్ధిల్లాలి అన్న భగత్ సింగ్
తమ్ములంతా మీరేనని
మీరిచ్చే నినాదాలల్లా నిప్పులోలే మీరు

మండినప్పుడే అర్థమైంది
ఈ దేశానికి ఆత్మైన అంబేద్కర్ కు
అసలైన వారసులు మీరేనని
రాజ్యాంగాన్ని గుండెలద్దుకునీ
నిరసనజెండాలైన నాడే ఎరుకైందిరా
నా ఎనభయేళ్ల పుట్టినదినంగోలె...
వాళ్ళ ఆశలను నిజం జేసుకోబోతున్నామనే గర్వతో
విర్రవీగేయాళ్ళకు
వందేళ్ళ వారి కలలను

పూచిక పుల్లల్లా టపటపా ఇరిశినపుడు
మీరు కరిసిన కరుపులకు
వాళ్ళ ఒళ్ళు , నోరు పద్ధతిగా కదులుతున్నపుడు
నాకు మనసు నిమ్మలమైంది

నా వందేళ్ళ పండుగనాడు నేను మీ చేతుల్లో
భద్రంగా ఉంటనని
ఊహొస్తేనే రక్తం వెచ్చగా కిందకి మీదకి
తన్నుకుంటున్నదిరా...
నన్నుత్త పటములా జేసీ పబ్బం గడుపుకునేటోళ్ల
చేతుల నుండి
నాలో కోట్లాది ప్రాణమున్న జీవినని తెలిసి
నన్ను కాపాడుకుంటారు కదా బిడ్డలూ...!!

**- దిలీప్.వి**
8464030808

# పేదరికాన్ని జయించడమే లక్ష్యం



పేదరికాన్ని జయించడమే మన దేశ లక్ష్యం కావాలి. 80వ స్వాతంత్ర్య దినోత్సవం జరుపుకుంటున్న ఈ సమయంలో, భారత్ ఎంత అభివృద్ధి చెందిందన్నది మాత్రమే ప్రశ్న కాదు. ఆ అభివృద్ధి ప్రతి కుటుంబానికీ స్థిరమైన అవకాశంగా మారిందా అన్నదే అసలు ప్రశ్న. భారత్ పేదరిక నిర్మూలనలో గణనీయమైన పురోగతి సాధించింది. నీతి ఆయోగ్ నివేదిక ప్రకారం, బహుముఖ పేదరికం 2015-16లో 24.85 శాతం నుంచి 2019-21 నాటికి 14.96 శాతానికి తగ్గింది. అంతేకాదు, 2022-23 నాటికి ఇది 11.28 శాతానికి చేరినట్లు అంచనా. 2013-14 నుంచి 2022-23 మధ్య సుమారు 24.82 కోట్ల మంది బహుముఖ పేదరికం నుంచి బయటపడ్డారని ఈ గణాంకాలు తెలుపుతున్నాయి.

పేదరికం అంటే కేవలం తక్కువ ఆదాయం మాత్రమే కాదు. ఒక కుటుంబం పేదరిక రేఖను దాటినా, తీవ్రమైన అనారోగ్యం, ఉద్యోగ నష్టం లేదా పంట వైఫల్యం వంటి ఒక్క దెబ్బ దాని ఆర్థిక స్థితిని మళ్లీ కుదేలు చేయగలదు. అందుకే పేదరికాన్ని ఆదాయం, ఆరోగ్యం, విద్య, గృహ వసతులు, పోషకాహారం వంటి అనేక కోణాల ద్వారా సంపూర్ణంగా పరిశీలించాలి. ప్రపంచ బ్యాంకు అంతర్జాతీయ తీవ్ర పేదరిక ప్రమాణాన్ని సవరించింది. కుటుంబాలు మళ్లీ పేదరికంలోకి జారిపోకుండా శాశ్వత ఆర్థిక స్థిరత్వాన్ని



కల్పించడంలో ఉంది. ఆర్థిక వృద్ధి వేగంతో పాటు, అది ఎన్ని ఉత్పాదక ఉద్యోగాలను సృష్టిస్తోందన్నది కూడా ముఖ్యమే. వ్యవసాయంలో సాగునీరు, ఉత్పాదకత, నిల్వ, ప్రాసెసింగ్, మార్కెట్ అనుసంధానాలను మెరుగుపరచడం ద్వారా గ్రామీణ ఆదాయాలను గణనీయంగా పెంచవచ్చు. అలాగే సూక్ష్మ సంస్థలకు తగినరుణం, సాంకేతికత, డిజిటల్ సామర్థ్యాలు అందితే అవి జీవనాధారం నుంచి ఉపాధి సృందించే సంస్థలుగా ఎదగగలవు. విద్య, ఆరోగ్యం, పోషకాహారం అనేవి పేదరిక నిర్మూలనకు పెట్టే దీర్ఘకాలిక పెట్టుబడులు. యువతకు ఉద్యోగ మార్కెట్‌కు సరిపోయే నైపుణ్యాలు అందాలి.

అలాగే ఒకే నమూనా అందరికీ సరిపోదు. జిల్లా స్థాయిలో పేదరికానికి అసలు కారణాన్ని గుర్తించి, దానికి తగిన స్థానిక పరిష్కారాన్ని అమలు చేయాలి. అయితే వాటి అంతిమ లక్ష్యం ప్రభుత్వాలపై ఆధారపడే పరిస్థితిని కొనసాగించడం కాకుండా, ప్రతి కుటుంబాన్ని స్థిరమైన స్వయం ఉపాధి వైపు తీసుకెళ్లడం కావాలి. 1947 నుంచి భారత్ సాధించిన ప్రగతి అసాధారణమైనది. ఇప్పుడు ఆ ప్రగతికి తగినంత పెద్ద లక్ష్యాన్ని నిర్దేశించుకోవాలి. స్వాతంత్ర్యం అంటే విదేశీ పాలన నుంచి విముక్తి మాత్రమే కాదు. పేదరికం, ఆకలి, అవకాశాల కొరత మనిషి జీవితాన్ని నిర్ణయించని స్వేచ్ఛా వాతావరణాన్ని సృష్టించడమే. 80వ స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా భారత్ తదుపరి దశాబ్దానికి ఒక స్పష్టమైన సంకల్పం చేయాలి. అదే - పేదరికాన్ని తగ్గించడం కాదు. దాని పునరుత్పత్తిని పూర్తిగా ఆపడం, ప్రతి భారతీయుడికి తన భవిష్యత్తును తానే నిర్మించుకునే అవకాశం కల్పించడం!

**- కింజరాపు అమరావతి**

ఎడిట్ పేజీ కోసం మీ
సామాజిక విశ్లేషణలు,
సాహిత్య వ్యాసాలు
manamlekhalu@ gmail.com
మెయిల్ అడ్రస్‌కు పంపగలరు

ఈ పేపర్ కోసం
https://www.manamepaper.com/
వెబ్‌సైట్‌లో చూడండి- ఎడిటర్

# ఆలయాలకు శ్రావణ శుక్రవారం శోభ

## కుంకుమ పూజలు, ఓడిబియ్యం సమర్పించిన మహిళలు



**జగిత్యాల, ఆగస్టు 14( మనం ప్రతినిధి ):** జగిత్యాల జిల్లాలోని ఆలయాలకు శ్రావణ మాసం శుక్రవారం శోభా సంతరించుకుంది.

జగిత్యాల పట్టణ చింతకుంట లోని శ్రీ సూర్య ధన్వంతరి ధనలక్ష్మి సహిత దేవాలయం లో శ్రీ ధనలక్ష్మి సేవా సమితి అధ్వర్యంలో శ్రావణ మాసం శుక్రవారం పర్వదినం పురస్కరించుకొని, మాతలు పాల్గొని అమ్మవారికి ప్రత్యేక కుంకుమార్చన, పాలభిషేకం లలితా సహస్ర నామాల స్తోత్ర పారాయణం చేసారు. పారాయణం అనంతరం మాతలు అమ్మ వారికి ఒడి బియ్యం సమర్పించారు. కుంకుమ పూజ అనంతరం లక్కీ డిప్ ద్వార ముగ్గురిని ఎంపిక చేసి వారికి బహుమతులు అందజేశారు. అలాగే అమ్మ వారి శేష వస్త్రం, అమ్మ వారి ప్రసాదం తాంబూలం ఆలయ పూజారి ఆశీర్వచనములతో బహుకరించారు.తదనంతరం అమ్మ వారికి ముడుపులు కట్టారు.అలాగే జగిత్యాల రూరల్ మండలం పొలాసలోని 108 శ్రీ చక్ర సహిత లలితమాత ఆలయంలో ఫౌండర్ చైర్మన్ చెల్లం స్వరూప ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున మహిళలు పాల్గొని కుంకుమ పూజలు చేశారు.

మాణిద్వీప వర్ణన, లలితసహస్రనామా పారాయణం గావించి శ్రీచక్రాలకు కుంకుమ పూజలు చేసి, అమ్మవారికి ఓడిబియ్యం సమర్పించారు.

ఈ కార్యక్రమంలో కొయ్యడ రమేష్, చంద్రారెడ్డి, సత్తయ్యా, మహేందర్, ఊటూరి అర్చన, ఊటూరి కళ్యాణి, ఎన్నం మంజుల, లక్ష్మి, డాక్టర్ వడ్లగట్ట రాజన్న, వొడ్నాల శ్రీనివాస్, వొడ్నాల లత, వడ్ల గట్ట స్వాతి, సుజాత, అంజలి, వనజ, హర్షిణి, ప్రసన్న, కావ్య, మాధురి, శిరిష, తార, సంధ్య, అనురాధ, గంగమ్మ అర్చకులు శ్రీహరి తదితరులు పాల్గొన్నారు.

# బాధిత కుటుంబానికి ఆర్థికసాయం అందించాలి

**దోర్నకల్ ఎమ్మెల్యే రామచంద్రనాయక్‌కు తేజావత్ భీముడు నాయక్ విజ్ఞప్తి**

**మహబూబాబాద్ , ఆగస్టు 14 (మనంన్యూస్):** మహబూబాబాద్ జిల్లా కురవి మండలం పిల్లిగుండ్ల తండా గ్రామపంచాయతీ శివారులో ఆగస్టు 13న చోటుచేసుకున్న విషాద ఘటనలో తల్లీ కుమారుడు మృతి చెందిన నేపథ్యంలో బాధిత కుటుంబాన్ని ప్రభుత్వం తక్షణమే ఆదుకోవాలని ఆల్ ఇండియా బంజారా సేవా సంఘ్-తెలంగాణ రాష్ట్ర శాఖ మీడియా కార్యదర్శి తేజావత్ భీముడు నాయక్ డోర్నకల్ ఎమ్మెల్యే రామచంద్రనాయక్కు విజ్ఞప్తి చేశారు. కురవి మండలం పిల్లిగుండ్ల తండాకు చెందిన భూక్య నవ్య (28), ఆమె కుమారుడు భూక్య అన్వేష్ (6) అనుమానాస్పద పరిస్థితుల్లో చెరువులో మృతి చెందడం అత్యంత విషాదకరమని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. అన్వేష్ మొదటి తరగతి చదువుతున్నాడని, గత కొన్ని రోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్న నేపథ్యంలో తల్లి అతడిని పాఠశాలకు పంపకుండా తన వెంట తీసుకెళ్లినట్లు కుటుంబ సభ్యులు తెలిపారని పేర్కొన్నారు. సాయంత్రం వరకు తల్లీ కుమారుడు ఇంటికి తిరిగి రాకపోవడంతో కుటుంబ సభ్యులు వెతకగా, చెరువు సమీపంలో ఫోన్ మోగుతున్న శబ్దం ఆధారంగా పరిశీలించిన సమయంలో చెరువులో ఇద్దరి మృతదేహాలు కనిపించాయని తెలిపారు. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నారని పేర్కొన్నారు.

### కుటుంబానికి తీరని విషాదం

తల్లీ కుమారుడిని ఒకేసారి కోల్పోవడం ఆ కుటుంబానికి తీరని లోటని తేజావత్ భీముడు నాయక్ అన్నారు. ఈ ఘటనతో కుటుంబం తీవ్ర విషాదంలో మునిగిపోయిందని, ముఖ్యంగా కుటుంబంలో మిగిలిన చిన్నారి భవిష్యత్తు, విద్య, పోషణ, సంరక్షణ బాధ్యతలు కుటుంబ సభ్యులపై మరింత భారంగా మారాయని తెలిపారు. తల్లిని, తమ్ముడిని కోల్పోయిన చిన్నారి భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారకుండా ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని కోరారు. ఆమె విద్యాభ్యాసం నిరంతరాయంగా కొనసాగేందుకు విద్యా సహాయం, ఉపకార వేతనం, పుస్తకాలు, పాఠశాల దుస్తులు, వసతి తదితర అవసరమైన సహాయం అందించాలని విజ్ఞప్తి చేశారు.

### ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా ఆర్థిక సహాయం అందించాలి

విషాద ఘటనను ప్రత్యేకంగా పరిగణించి ముఖ్యమంత్రి సహాయ నిధి, ఆపద్బాంధవు పథకం లేదా అర్హతకు అనుగుణంగా అమలులో ఉన్న ఇతర ప్రభుత్వ అత్యవసర సహాయ పథకాల ద్వారా బాధిత కుటుంబానికి సాధ్యమైనంత ఎక్కువ ఆర్థిక సహాయం మంజూరు చేయాలని తేజావత్ భీముడు నాయక్ కోరారు. డోర్నకల్ ఎమ్మెల్యే రామచంద్రనాయక్ ప్రత్యేక చొరవ తీసుకుని ఈ విషయాన్ని రాష్ట్ర ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లడంతో పాటు సంబంధిత జిల్లా అధికారులతో సమన్వయం చేసి బాధిత కుటుంబానికి త్వరితగతిన ప్రభుత్వ సహాయం అందేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.



### మృతిపై సమగ్ర దర్యాప్తు జరగాలి

తల్లీ కుమారుడి మృతి అనుమానాస్పద పరిస్థితుల్లో చోటుచేసుకున్నందున పోలీసులు అన్ని కోణాల్లో సమగ్ర దర్యాప్తు చేపట్టి వాస్తవాలను వెలుగులోకి తీసుకురావాలని భీముడు నాయక్ కోరారు.

మృతదేహ పరీక్ష నివేదికతో పాటు అందుబాటులో ఉన్న ఇతర ఆధారాలను పరిశీలించాలని, కుటుంబ సభ్యులకు ఉన్న అనుమానాలను కూడా పరిగణనలోకి తీసుకుని పారదర్శకంగా దర్యాప్తు జరపాలని విజ్ఞప్తి చేశారు. నిజానిజాలు వెలుగులోకి వచ్చి బాధిత కుటుంబానికి న్యాయం జరిగేలా అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు.

### బాధిత కుటుంబానికి ప్రగాఢ సానుభూతి

తల్లీ కుమారుడిని కోల్పోయిన కుటుంబ సభ్యులకు ఆల్ ఇండియా బంజారా సేవా సంఘ్-తెలంగాణ రాష్ట్ర శాఖ తరఫున తేజావత్ భీముడు నాయక్ ప్రగాఢ సానుభూతి, సంతాపం తెలిపారు. ఈ విషాద ఘటన మమ్మల్ని తీవ్రంగా కలచివేసింది. నవ్య, అన్వేష్ల మృతి వారి కుటుంబానికే కాకుండా తండా ప్రజలందరికీ తీరని లోటు. ఈ అపారమైన దుఃఖాన్ని భరించే శక్తిని కుటుంబ సభ్యులకు భగవంతుడు ప్రసాదించాలని, మృతుల ఆత్మలకు శాంతి చేకూరాలని ప్రార్థిస్తున్నాం.

ఈ కష్టకాలంలో బాధిత కుటుంబం ఒంటరిగా లేదని, వారికి అండగా నిలిచేందుకు ఆల్ ఇండియా బంజారా సేవా సంఘ్ ఎల్లప్పుడూ ముందుంటుంది. ప్రభుత్వం మానవతా దృక్పథంతో స్పందించి కుటుంబానికి తక్షణ ఆర్థిక సహాయం అందించాలి. ముఖ్యంగా కుటుంబంలోని చిన్నారి భవిష్యత్తుకు ప్రభుత్వం పూర్తి భరోసా కల్పించాలి అని తేజావత్ భీముడు నాయక్ అన్నారు. బాధిత కుటుంబానికి తక్షణ ఆర్థిక సహాయం, చిన్నారి విద్యకు ప్రత్యేక సహాయం, అలాగే అర్హతకు అనుగుణంగా అన్ని ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రయోజనాలు అందేలా అధికారులు చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు.

# అశోక్ నియామకం పట్ల హర్షం



**మహదేవపూర్, ఆగస్ట్ 14 మనం న్యూస్:** కాంగ్రెస్ పార్టీ మహదేవపూర్ మండల అధ్యక్షుని సీనియర్ నాయకుడు యువకుడు కటకం అశోక్ నియామకం పట్ల ఎడపల్లి గ్రామ సర్పంచ్ మోతే నీలరాణి సాంబయ్య హర్షం వ్యక్తం చేశారు. కటకం అశోక్ ను మహదేవపూర్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుని గా ఎంపిక చేసినందుకు రాష్ట్ర ఐటీ, పరిశ్రమలు, శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి దుద్దిల్ల శ్రీధర్ బాబు కు , టీపీసీసీ ప్రధాన కార్యదర్శి దుద్దిల్ల శ్రీను బాబు కు ఆమె ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు మహదేవపూర్ మండలంలో కాంగ్రెస్ పార్టీని మరింత బలోపేతం చేయడంతో పాటు, పార్టీ నాయకులు, కార్యకర్తలను సమన్వయం చేసుకుంటూ ప్రజా సమస్యల పరిష్కారానికి నూతన అధ్యక్షుడు కృషి చేస్తారని వారు ఆకాంక్షించారు. కటకం అశోక్ నాయకత్వంలో మహదేవపూర్ మండలంలో కాంగ్రెస్ పార్టీ మరింత బలపడుతుందని, పార్టీ అధిష్టానం అప్పగించిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహిస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు. కటకం అశోక్ కు హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేస్తూ, ఆయనకు ఈ బాధ్యత అప్పగించిన, సహకరించిన నాయకులకు ఆమె కృతజ్ఞతలు తెలిపారు.

# సింగరేణి కాలేజీకి పూర్వవైభవం వచ్చేనా..!

- ఉన్నకోర్సును ఎత్తివేయడం దౌర్భాగ్యం
- కొత్త కోర్సులు ప్రవేశ పెట్టాల్సింది పోయి ఉన్నవి తొలగింపు
- ఉన్నత విద్యకు దూరం పోవాల్సిందేనా?
- సింగరేణి ఉమెన్స్ కాలేజ్ భవిష్యత్తుపై నీలినీడలు




**కొత్తగూడెం సింగరేణి, ఆగస్టు 14(మనం న్యూస్):** ఒకప్పుడు సింగరేణి కాలేజీ విద్యార్థుల సంఖ్యతో సందడిగా కనిపించేది. నేడు ఆ పరిస్థితి కనిపించడం లేదని.. పూర్వ విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రవేట్ విద్యాసంస్థలకు ధీటుగా ఉన్న అలాంటి ఉమెన్స్ కాలేజీ రాను రాను కళ తప్పుతున్న పరిస్థితి నెలకొందనే ప్రచారం జరగడం చర్చకు దారి తీస్తుంది. ఇప్పుడున్న విద్యా పోటీ ప్రపంచంలో ఈ కాలేజీకి పూర్వ వైభవం రావాలంటే ఏం చేయాలి..? భవిష్యత్తు కోసం ఎలాంటి నిర్ణయాలు తీసుకోవాలి.. మరి దీని కోసం ఎవరు ముందు పడాలనే దానిపై ఆలోచనకు వస్తే.. యాజమాన్యమే ముందుండాలనే వాదన వినిపిస్తోంది. సింగరేణి కోల్ బెల్ట్ గా ముద్ర వేసుకున్న భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కేంద్రంలో సిరుల గని సింగరేణి ప్రధాన కార్యాలయం పక్కనే ఉన్న 'సింగరేణి కాలరీస్ ఉమెన్స్ కాలేజ్' భవిష్యత్తు ప్రశ్నార్థకారంగా నిలిచిందని కొందరు పూర్వ విద్యార్థులు దిగులు పడుతున్నారు. తాము ఈ కాలేజీలో విద్యను అభ్యసించే సమయంలో సరస్వతి నిలయానికి ఒక చరిత్ర ఉండేదని, నేడు ఆ చరిత్ర కనుమరుగయ్యే వాతావరణం కనిపిస్తుందని దీనికి కారణం ఏమై ఉంటుందని పలువురు పూర్వ విద్యార్థులు ప్రశ్నిస్తున్నారు.

పోటికి తగ్గట్టుగా సింగరేణి ఉమెన్స్ కాలేజ్ అని 'బలోపేతం' చేయాల్సింది పోయి 'బలహీనంగా' ఎందుకు మారుస్తున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గతంతో పోల్చుకుంటే ఇప్పుడు ఈ కాలేజీ 'నెంబర్ వన్' పొజిషన్లో నిలవలసి ఉండగా వెనుకకు వెళ్లే విధంగా ఎందుకు చేస్తున్నారని అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఎంతోమంది సింగరేణి సంస్థలలో ఉద్యోగులు కార్మికులు పనిచేస్తున్నారని వారి పిల్లల కోసం, బయటి వారి విద్యార్థుల ఉన్నత చదువుల కోసం ఉపయోగపడాల్సిన సింగరేణి ఉమెన్స్ కాలేజ్ ని నిర్లక్ష్యంగా చూడవద్దని సూచిస్తున్నారు. తక్షణమే సింగరేణి యాజమాన్యంతో పాటు సింగరేణి చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ బుద్ధ ప్రకాష్ జ్యోతి, సింగరేణి డైరెక్టర్(పా) గౌతమ్ పోట్రు స్పందించి సింగరేణి ఉమెన్స్ కాలేజ్ భవిష్యత్తు కోసం అభివృద్ధి చర్యలు చేపట్టాలని పూర్వ విద్యార్థులు ముక్తకంఠంతో వేడుకుంటున్నారు.

### ఎంబీఏ కోర్స్ ఎందుకు ఎత్తివేశారు..?

సింగరేణి మెన్స్ కాలేజీలో పీజీ విభాగానికి సంబంధించిన ఎంబీఏ కోర్సును ఎందుకు ఎత్తివేసారని పలువురు ప్రశ్నిస్తున్నారు. ఉన్న కోర్సులతోపాటు కొత్త కోర్సులను ప్రవేశపెట్టి విద్యను బలోపేతం చేయాల్సింది పోయి ఉన్న ఎంబీఏ కోర్సును తొలగించడం దేనికని మండిపడుతున్నారు. ఈ కాలేజీలో పీజీ విద్య కోర్సులు పూర్తి పూర్తిస్థాయిలో లేకపోవడం వల్ల ప్రైవేట్ విద్యాసంస్థలపై దృష్టి సారించాల్సిన పరిస్థితి ఉందని దీనివల్ల పిల్లల తల్లిదండ్రులపై ఆర్థిక భారం పడుతుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

### సింగరేణి కాలేజ్ ని అభివృద్ధి పరచాలి

సింగరేణి ఉమెన్స్ కాలేజీని అభివృద్ధిపరిచేందుకు యాజమాన్యం తక్షణ చర్యలు చేపట్టాలని విద్యార్థి సంఘమైన ఎస్ఎఫ్ఐ మాజీ సీనియర్ లీడర్, సిపిఎం నాయకులు భూక్య రమేష్ డిమాండ్ చేశారు. కొత్త కొత్త కోర్సులను ప్రవేశపెట్టి విద్యార్థుల సంఖ్యను పెంచుకోవాలని సూచించారు. ఈ కాలేజీలో పై చదువుల నిమిత్తం కోర్సులు లేని కారణంగా అనేకమంది స్థానిక విద్యార్థులు హైదరాబాద్ వరంగల్ ఇతర ఊర్లకు వెళ్లాల్సిన పరిస్థితి నెలకొంది అన్నారు. కొత్త కోర్సులను ప్రవేశపెడితే సింగరేణి కళాశాలకు మంచి భవిష్యత్తు ఉంటుందన్నారు. విద్యార్థులకు అవసరమైన సౌకర్యాలను కల్పించాలని డిమాండ్ చేశారు. విద్యార్థుల కొరకు అదనంగా హాస్టల్ ను కూడా ఏర్పాటు చేయాలన్నారు.

### కాలేజీలో క్యాంటీన్ సౌకర్యం కల్పించాలి

సింగరేణి కళాశాలలో క్యాంటీన్ సౌకర్యం లేక విద్యార్థులు ఇబ్బంది పడుతున్నట్లుగా తెలుస్తోంది. గతంలో క్యాంటీన్ ఉండగా విద్యార్థులకు సౌకర్యవంతంగా ఉండేది.

నేడు క్యాంటీన్ సౌకర్యం లేకపోవడంతో విద్యార్థులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. సింగరేణి ఎడ్యుకేషన్ అధికారులు స్పందించి సింగరేణి ఉమెన్స్ కాలేజీలో క్యాంటీన్ సదుపాయం కల్పించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

# సౌదీ కోర్టు కేసులో రూ.40 వేల ఆర్థిక సాయం

## పరిహారం కొరకు ఎన్నారై వ్యాపారవేత్త ఆకునూరి శంకర్ మద్దతు




**జగిత్యాల ఆగష్టు 14 ( మనం ప్రతినిధి ):** సౌదీ అరేబియాలో రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన గల్ఫ్ కార్మికుడి కుటుంబానికి పరిహారం అందేలా కోర్టులో కేసు దాఖలు చేసేందుకు అవసరమైన ధ్రువపత్రాల అటెస్టేషన్, కోర్టు ఖర్చుల కోసం ప్రవాస భారతీయ వ్యాపారవేత్త ఒకరు రూ.40 వేల ఆర్థిక సహాయం అందించారు. జగిత్యాల జిల్లా, జగిత్యాల రూరల్ మండలం, అనంతారం గ్రామానికి చెందిన గీత కార్మికుడు గుర్రం మహేష్ ఉపాధి కోసం సౌదీ అరేబియాకు వెళ్లాడు. సౌదీకి చేరుకున్న 45 రోజులకే, 2023 జూలై 6న అల్ హసా, హొఫూఫ్ ప్రాంతంలో సైక్లి వెళ్తుండగా కారు ఢీకొనడంతో మృతి చెందాడు.మహేష్ మృతి తర్వాత ఆయన కుటుంబానికి రావాల్సిన పరిహారం కోసం న్యాయపరమైన చర్యలు చేపట్టేందుకు అవసరమైన సహాయం కోరుతూ ఆయన భార్య పూజారాణి తన ఇద్దరు కుమార్తెలతో కలిసి శుక్రవారం హైదరాబాద్లోని సీఎం ప్రవాసీ ప్రజావాణికి వచ్చారు.

ఆమె పరిస్థితిని తెలుసుకున్న ప్రవాస భారతీయ వ్యాపారవేత్త ఆకునూరి శంకర్ స్పందించి, పరిహారం కేసు దాఖలు చేయడానికి అవసరమైన ఖర్చుల కోసం రూ.40 వేల చెక్కును పూజారాణికి అందజేశారు. ఈ సందర్భంగా సీఎం ప్రజావాణి స్టేట్ నోడల్ ఆఫీసర్ కె. విద్యాసాగర్, తెలంగాణ ప్రభుత్వ ఎన్నారై అడ్వయిజరీ కమిటీ చైర్మన్ అంబాసిడర్ డా. బి.ఎం. వినోద్ కుమార్, వైస్ చైర్మన్ మంద భీంరెడ్డి, సభ్యులు చెన్నమనేని శ్రీనివాస రావు, సీఎం ప్రవాసీ ప్రజావాణి లైజన్ ఆఫీసర్ భార్గవి నద్దునూరి, వాలంటీర్ క్రి పద్మారాణి, జీఏడి అధికారి ఇ. చిట్టిబాబు తదితరులు పాల్గొన్నారు.

# ఉద్యమకారులను గుర్తించి గౌరవించాలి

- టీయూఎఫ్ జగిత్యాల జిల్లా చైర్మన్ జవ్వాజి శంకర్



**జగిత్యాల ఆగష్టు 14( మనం ప్రతినిధి ):** ఉద్యమకారులను గుర్తించి స్వాతంత్ర్య దినోత్సవాన ఉద్యమ కారులను ప్రభుత్వం ఘనంగా సన్మానం చేసి గౌరవించాలి అని టీయూఎఫ్ జగిత్యాల జిల్లా చైర్మన్ జవ్వాజి శంకర్ కోరారు.ఉద్యమకారులను, ప్రభుత్వం తగిన రీతిలో గుర్తించి గౌరవించాలని తెలంగాణ ఉద్యమకారుల ఫోరం డిమాండ్ చేస్తూ శుక్రవారం టీయూఎఫ్ ప్రధాన కార్యాలయంలో వ్యవస్థాపకులు డాక్టర్ చీమ శ్రీనివాసరావు ఆదేశాల మేరకు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర సాధన కోసం ఉద్యమ సమయంలో ధూమ్ దాం ఆటపాటలతో, సాంస్కృతిక కార్యక్రమాలు, వంటా-వార్పుల ద్వారా ప్రజలను చైతన్యపరిచిన కళాకారులను, ఉద్యమకారులను స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ప్రభుత్వం గుర్తించాలని విజ్ఞప్తి చేశారు. ఆగస్టు 15న 33 జిల్లాల్లోని అన్ని మండల ప్రజా పరిషత్, జిల్లా కార్యాలయాల్లో వారిని సత్కరించాలని కోరారు. అలాగే,జవ్వాజి శంకర్ మాట్లాడుచు తెలంగాణ ఉద్యమకారులను కేకే కమిటీ కాలయాపన చేయకుండా సెప్టెంబర్ 20 వ తేది లోపు అర్హులైన ప్రతి ఉద్యమకారునికి గుర్తింపు కార్డు తప్పనిసరిగా ఇవ్వాలి అలాగే రూ. 25,000 పెన్షన్, 250 గజాల ఇంటి స్థలాన్ని కేటాయించాలని డిమాండ్ చేశారు ప్రభుత్వం జీవో నెంబర్ 679 ఇచ్చారు అలాగే కోర్ట్ ఎనిమిది వరాల్లో ఉద్యమ కారులకు న్యాయం చేయాలి అనీ చెప్పడం జరిగింది లేనియెడల మరో పోరాటం చేయక తప్పదు అని శంకర్ ఏచ్చరించారు ఈ కార్యక్రమం లో ప్రధానకార్యదర్శి భారతపు లింగారెడ్డి ఉపాధ్యక్షులు రాగుల రాజు మరాఠి గంగారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# జిల్లాలో ఎరువులకు కొరత లేదు



- జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్
- ఎరువుల సరఫరా తదితర అంశాలపై వివిధ శాఖల అధికారులతో జిల్లా కలెక్టర్ సమీక్ష

**రాజన్న సిరిసిల్ల, ఆగస్టు -14 (మనం ప్రతినిధి ):** జిల్లాలో పంటల సాగు కోసం ఎరువుల కొరత లేదని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ తెలిపారు. జిల్లాలో ఎరువుల సరఫరా, నిర్వహణ తదితర అంశాలపై జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలో జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ శుక్రవారం అదనపు కలెక్టర్ గడ్డం నగేష్, మార్క్ ఫెడ్, మార్కెటింగ్, సహకార శాఖ, గ్రామీణాభివృద్ధి శాఖ, వ్యవసాయ శాఖ అధికారితో కలిసి సమీక్ష సమావేశం నిర్వహించారు. జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ మాట్లాడుతూ.. జిల్లాలో సాగుకు కావాల్సిన ఎరువులు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. జిల్లాలో పంటల సాగుకు అనుగుణంగా కావలసిన అన్ని ఎరువులు ఇక్కడే నిల్వ చేయాలని ఆదేశించారు. ప్రభుత్వ నిర్ణయించిన ధరకే విక్రయాలు చేయాలని సూచించారు. వ్యవసాయ శాఖ అధికారులు తమ పరిధిలోని అన్ని ఎరువుల షాపుల్లో తనిఖీ చేయాలని సూచించారు. సమావేశంలో డీఆర్డీఓ లక్ష్మీనారాయణ, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి అఫ్జల్ బేగం, జిల్లా మార్కెటింగ్ అధికారి ప్రకాశ్, జిల్లా సహకార శాఖ అధికారి రామకృష్ణ, మార్క్ ఫెడ్ డీఎం హబీబ్ తదితరులు పాల్గొన్నారు.

# సార్ ఉద్యోగం వారానికి ఒక్కరోజే !!

- విధులకు గైర్హాజరవుతే కఠిన చర్యలు : జెడ్పీ సిఇఓ

**చర్ల, ఆగస్ట్ 14 (మనం న్యూస్) :** ప్రభుత్వ ఉద్యోగులకు వారానికి ఆరు రోజులు పనిదినాలయితే చర్ల మండల పరిషత్ అభివృద్ధి కార్యాలయంలో సూపరింటెండెంట్ గా విధులు నిర్వహిస్తున్న ఉద్యోగికి మాత్రం వారంలో ఒక్కరోజే ఉంటుంది. ఇదేంటి ఈయనకు ఈ ప్రత్యేకత అనుకొని ఆశ్చర్యపోతున్నారా!! అది అంతే...ఆయనకు ఇష్టం ఉన్నప్పుడే ఉద్యోగానికి హాజరవుతాడు. ఉన్నతాదికారులు ప్రశ్నిస్తే ఎదిరుతిరుగుతాడు. మద్యం మత్తులో ఊగిపోతూ బూతుపురాణం లంకించుకుంటాడు. అన్నట్లు సార్ కు నోటి దూలకూడా ఎక్కువే. పత్రికా విలేఖరులను సైతం కార్యాలయంలోకి రానివ్వవద్దంటూ ప్రభుత్వ కార్యాలయం తన అత్తగారి సొత్తులాగా కింది స్థాయి ఉద్యోగులకు ఆదేశాలు ఇస్తుంటాడు. వారానికి ఒకసారి ఉద్యోగం వెలగబెట్టే చర్ల మండల పరిషత్ కార్యాలయం ఉద్యోగిపై 'మనం' అందిస్తున్న ప్రత్యేక కథనం. చర్ల మండలంలోని ప్రభుత్వ కార్యాలయాల ఉద్యోగులు, అధికారులు సమయపాలన పాటించడం లేదు. ప్రతి కార్యాలయం ఉదయం 10 గంటల నుండి సాయంత్రం 5 గంటల వరకు తెరిచిఉంచి ఆయా శాఖలకు చెందిన అధికారులు, ఉద్యోగులు ప్రజలకు అందుబాటులో ఉండాలి. కాని దీనికి విరుద్ధంగా పలు కార్యాలయాలు పనిచేస్తున్నాయి. అధికారులు, ఉద్యోగులు తమ ఇష్టం వచ్చిన సమయంలో విదులకు హాజరవుతున్నారు. కొన్ని శాఖల అదికారులు తీరుబాటుగా 12 గంటలకు వెళ్లి ఒంటి గంటకే ఇంటికి వచ్చేస్తున్నారు. ఈ నేపథ్యంలో 'మనం' శుక్రవారం మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయం, సిడిపివో కార్యాలయంలో అధికారులు, ఉద్యోగుల సమయపాలనను పరిశీలించింది. సిడిపివో కార్యాలయంలో కేవలం అటెండర్ తో పాటు ఒక ఉద్యోగి అందుబాటులో ఉన్నారు. సిడిపివో రేవతి పాల్వంచ కలెక్టరేట్ లో జరిగిన సమావేశానికి వెళ్లినట్లు సిబ్బంది తెలిపారు. మండల పరిషత్ కార్యాలయంలో ఎంపిడివో, ఎంపివో ఫీల్డ్ విజిట్ కు వెల్లారు. కార్యాలయం సూపరింటెండెంట్ గత రెండు రోజులుగా విదులకు గైర్హాజరయ్యాడు. సూపరింటెండెంట్ గత జూన్ లో మండల పరిషత్ కార్యాలయంకు బదిలీపై చర్లకు వచ్చారు. ఈయన స్థానికంగా నివాసం ఉండకుండా భద్రాచలం నుండి రాకపోకలను సాగిస్తుంటారు. సార్ కార్యాలయంలో విధులలో చేరిన దగ్గర నుండి వారానికి ఒక రోజే హాజరవుతున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. వచ్చిన ఒక్కరోజే వారానికి సరిపడా హాజరుపట్టికలో సంతకాలు చేసి వచ్చిన అరగంటలోనే తిరుగు ప్రయాణవడం అతడికి రివాజుగా మారింది. భద్రాద్రి జిల్లాలోని అన్ని మండల పరిషత్ కార్యాలయాలలో బయోమెట్రిక్ హాజరు మిషన్ల ద్వారా ఉద్యోగులు హాజరు వేసుకుంటుండగా చర్లలో మాత్రం హాజరుపట్టికను వాడుతున్నారు. బయోమెట్రిక్ హాజరుపట్టిక ద్వారా తమ గుట్టు రట్టవుతుందన్న ఉద్దేశంతో కొంతమంది కార్యాలయ సిబ్బంది దానిని పనికిరాకుండా చేసినట్లు విమర్శలు ఉన్నాయి. ఈ అవకాశాన్ని ఆసరాగా తీసుకొని సదరు సూపరింటెండెంట్







వారానికి ఒకసారి వచ్చి సంతకాలు పెడుతుంటాడని విమర్శలు ఉన్నాయి. శుక్రవారం ఉదయం 11.12 గంటలకు కార్యాలయంకు వెళ్లిన సమయంలో సార్ సీటు ఖాళీగా దర్శనమిచ్చింది. హాజరుపట్టికలోనూ గత రెండు రోజులుగా సంతకాలు లేవు. సార్ విధులకు హాజరుకాకున్న కొంతమంది కార్యాలయ ఉద్యోగులు సార్ కు ఫోర్జరీ సంతకాలు చేస్తున్నట్లు తెలుస్తోంది. ఇతగాడు కార్యాలయంకు వచ్చే సమయంలో మద్యం మత్తులో వస్తుంటాడని, అధికారులను సైతం ఇష్టానుసారంగా మాట్లాడతాడని తెలియవస్తోంది. తన గుట్టు రట్టవుతుందనే ఉద్దేశంతో పత్రికా విలేఖరులను కార్యాలయంలోకి అడుగు పెట్టనీయవద్దంటూ కింది స్థాయి ఉద్యోగులకు హుకుం జారీ చేసినట్లు తెలుస్తోంది. కార్యాలయంకు వచ్చే వారిపై దురుసుగా ప్రవర్తిస్తూ నోటికి వచ్చినట్టు మాట్లాడతాడనే ఆరోపణలు ఉన్నాయి. ఈ విషయమై భద్రాద్రి జిల్లా పరిషత్ సిఈవో బొగ్గుల నాగలక్ష్మి దృష్టికి తీసుకెళ్లగా వెంటనే సంబంధిత ఫోటోలు, హజరుపట్టిక ఫోటోలు తెప్పించుకొని గైర్హాజరయిన ఉద్యోగిపై సీరియస్ అయ్యారు. వెంటనే సమగ్ర విచారణ చేపట్టి నివేదిక సమర్పించాలని, ఉద్యోగానికి గైర్హాజరయిన రోజులకు సంబంధించి వేతనం నిలిపి వేసి షోకాజ్ నోటీస్ జారీ చేయాలని మండల పరిషత్ అదికారి కనపర్తి ఈదయ్యను ఆదేశించారు. ఉద్యోగులు తప్పనిసరిగా సమయపాలన పాటించాలని లేకుంటే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

మనం Manam Medak మెదక్





# నైపుణ్యంతోనే విద్యార్థులు మనుగడ

## కావేరివిశ్వ విద్యాలయంలో ఓరియంటేషన్ నిర్వహణ

వర్గల్, ఆగస్టు 14(మనం న్యూస్): నూతన ఇంజినీరింగ్ విద్యార్థుల విద్యా విధానం, అవకాశాలపై అవగాహన కార్యక్రమాన్ని కావేరి విశ్వవిద్యాలయంలో ప్రథమ సంవత్సరం ఇంజినీరింగ్ విద్యార్థులు, తల్లిదండ్రులకు శుక్రవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ ఉన్నత విద్యా మండలి చైర్మన్ ప్రొఫెసర్ బాలకృష్ణారెడ్డి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు నిరంతరం తమ నైపుణ్యాలను అభివృద్ధి చేసుకోవాలని, ముఖ్యంగా ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, ఆధునిక డిజిటల్ సాంకేతికతలను అందిపుచ్చుకోవాలని సూచించారు. సాంకేతిక పరిజ్ఞానంతో పాటు మానవీయ విలువలు, నైతికత, సృజనాత్మకత, కమ్యూనికేషన్ నైపుణ్యాలు, సామాజిక బాధ్యతలను పెంపొందించుకోవాలన్నారు. మారుతున్న వృత్తి ప్రపంచాన్ని సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు ఆవిష్కరణాత్మక ఆలోచన, విమర్శనాత్మక ఆలోచన, సమస్య పరిష్కార నైపుణ్యాలను అభివృద్ధి చేసుకోవాలని విద్యార్థులకు సూచించారు. అనంతరం ఛాన్సలర్ జి.వి. భాస్కర్ రావు మాట్లాడుతూ కావేరి విశ్వవిద్యాలయాన్ని దేశంలోని ప్రముఖ విద్యాసంస్థల్లో ఒకటిగా, భవిష్యత్తులో అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు పొందిన విశ్వవిద్యాలయంగా తీర్చిద్దాలన్నదే తమ లక్ష్యమని తెలిపారు. విద్యార్థులకు ప్రాక్టికల్ విద్య, పరిశ్రమలతో అనుసంధానం, టీంవర్క్, ఆవిష్కరణలు, అంతర్జాతీయ అవకాశాలకు అనుగుణమైన నైపుణ్యాల అభివృద్ధికి ప్రాధాన్యత ఇస్తున్నట్లు తెలిపారు.ఈ కార్యక్రమంలో కావేరి సీడ్స్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్లు డాక్టర్ జి. పవన్, సి. వంశీధర్, మిథున్ చంద్ గౌరారం ఖిఐ జె. ఆరోగ్యం,రిజిస్ట్రార్ డాక్టర్ బి. శ్రీనివాసులు డైరెక్టర్ పోల్సాని హర్ష రావు, డీన్లు డాక్టర్ కొండ శ్రీనివాస్, డాక్టర్ జి. పుష్పకథ, డాక్టర్ సునీతా మెహతాసీనియర్ ప్రొఫెసర్లు, విభాగాధిపతులు, అధ్యాపకులు, విద్యార్థులు మరియు తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# పండగ సాయన్న జయంతిని అధికారికంగా నిర్వహించాలి

- సీఎం రేవంత్ రెడ్డితో వాకిటి శ్రీహరి, నీలం మధు, బొర్రా జ్ఞానేశ్వర్ భేటీ
- పాల్గొన్న వివిధ పార్టీల నాయకులు, సంఘాల ప్రతినిధులు
- సానుకూలంగా స్పందించి ముఖ్యమంత్రి
- అక్టోబర్ 22న అధికారిక వేడుకలకు గ్రీన్ సిగ్నల్
- ముఖ్యమంత్రికి ధన్యవాదాలు తెలిపిన నీలం మధు ముదిరాజ్, నాయకులు



పటాన్ చెరు, ఆగస్టు 14(మనం న్యూస్) : తెలంగాణ సమాజంలో నిజాం నిరంకుశత్వానికి, భూస్వామ్య వ్యవస్థ దౌర్జన్యాలకు వ్యతిరేకంగా పోరాడి, ఆకలితో అలమటించే నిరుపేదల కడుపు నింపిన బహుజన వీరుడు తెలంగాణ రాబిన్ హుడ్ 'పండగ సాయన్న' జయంతి ఉత్సవాలను రాష్ట్ర ప్రభుత్వం తరపున అధికారికంగా నిర్వహించాలని ముదిరాజ్ సామాజికవర్గ ప్రజాప్రతినిధులు, అగ్రనేతలు, కుల సంఘ నాయకులు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు మంత్రివర్యులు వాకిటి శ్రీహరి, మెదక్ పార్లమెంట్ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ నీలం మధు ముదిరాజ్, మాజీ ముదిరాజ్ కార్పొరేషన్ చైర్మన్ బొర్రా జ్ఞానేశ్వర్ తదితర నాయకులు సచివాలయంలో ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డిని కలిసి ప్రత్యేకంగా వినతిపత్రం సమర్పించారు. ఈ భేటీ సందర్భంగా తెలంగాణ ఉద్యమ చరిత్రలో, ముఖ్యంగా బడుగు, బలహీన వర్గాల ఆత్మగౌరవ పోరాటంలో పండగ సాయన్న సేవలను సీఎం రేవంత్ రెడ్డికి నేతలు వివరించారు. భూస్వాముల దోపిడీ నుంచి ధాన్యం బస్తాలను స్వాధీనం చేసుకుని పేదలకు పంచిన తెలంగాణ రాబిన్హుడ్గా పేరుగాంచిన పండగ సాయన్న స్ఫూర్తిని నేటి తరానికి అందించాల్సిన అవసరం ఉందని వారు సీఎం దృష్టికి తీసుకెళ్లారు. ముదిరాజ్ సామాజికవర్గ నేతల విన్నపంపై స్పందించిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అత్యంత సానుకూలంగా స్పందించారు. పేదల కోసం, సామాజిక న్యాయం కోసం పోరాడిన వీరుడిని గౌరవించుకోవడం ప్రభుత్వ బాధ్యత అని పేర్కొంటూ, చారిత్రక ఆధారాలతో ప్రతి ఏటా అక్టోబర్ 22వ తేదీన పండగ సాయన్న జయంతిని రాష్ట్ర ప్రభుత్వం తరపున అధికారికంగా నిర్వహిస్తామని హామీ ఇస్తూ అతిత్వరలో ఎ. విడుదల చేయాల్సిందిగా అధికారులను ఆదేశించారు, ముఖ్యమంత్రి తీసుకున్న ఈ చారిత్రాత్మక నిర్ణయం పట్ల మెదక్ పార్లమెంట్ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ నీలం మధు ముదిరాజ్ హర్షం వ్యక్తం చేశారు. పండగ సాయన్న జయంతిని అధికారికంగా ప్రకటించడం ద్వారా తెలంగాణలోని బహుజనుల, ముఖ్యంగా ముదిరాజ్ సామాజికవర్గ ఆత్మగౌరవాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం సముచితంగా గౌరవించిందని ఆయన కొనియాడారు. ముదిరాజ్ బిడ్డల సుదీర్ఘకాల ఆకాంక్షను గుర్తించి, వినతిపత్రం సమర్పించిన వెంటనే సానుకూలంగా స్పందించిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి ఈ సందర్భంగా నీలం మధు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. అలాగే ఈ విజ్ఞప్తికి మద్దతుగా నిలిచిన అందరికీ కృతజ్ఞతలు తెలియజేశారు. ప్రభుత్వ నిర్ణయంతో రాష్ట్రవ్యాప్తంగా ముదిరాజ్ సామాజికవర్గ ప్రజలు, బహుజన సంఘాలు ఆనందం వ్యక్తం చేస్తున్నాయి. ఈ కార్యక్రమంలో చొప్పరి శంకర్, మహబూబ్ నగర్ డీసీసీ సంజీవ్, ఖైరతాబాద్ డీసీసీ మోత రోహిత్, గుండ్లపల్లి శ్రీనివాస్, అల్లుడు జగన్, పిట్ల నగేష్, మద్దెల సంతోష్, మహేష్ సుంకరబోయిన, సాయన్న సేవాసమితి కృష్ణ. బలరాం, రాజశేఖర్, బక్క జనార్దన్, భీమ్ లక్ష్మణ్, పండగ బాలు, ఆగం పాండు, నిజ్జల రమేష్, ముదిరాజ్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# గ్లోబల్ ఆర్అండ్డి అధ్యాయానికి గ్రేటర్ నోయిడాలో శ్రీకారం



హైదరాబాద్, ఆగస్టు 14(మనంన్యూస్): భారతదేశంలోని నంబర్ 1 ట్రాక్టర్ ఎగుమతి బ్రాండ్, ప్రముఖ సోనాలికా ట్రాక్టర్స్ యజమాని ఇంటర్నేషనల్ ట్రాక్టర్స్ లిమిటెడ్ , ఉత్తరప్రదేశ్లోని గ్రేటర్ నోయిడాలో 25 ఎకరాల విస్తీర్ణంలో కొత్త గ్లోబల్ రీసెర్చ్, డెవలప్మెంట్ సెంటర్ను ఏర్పాటు చేయడానికి సిద్ధమైంది. ఈ అభివృద్ధి ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ లక్నోలో ఐటీఎల్ యాజమాన్యంతో సమావేశమైన అనంతరం చోటుచేసుకుంది. ఐటీఎల్ ప్రతిపాదించిన ఈ కొత్త గ్లోబల్ ఆర్అండ్డి సెంటర్ భవిష్యత్ అవసరాలకు అనుగుణమైన సాంకేతికతలు, రైతు-కేంద్రిత ఆవిష్కరణలను అభివృద్ధి చేసే ప్రపంచస్థాయి ఆధునిక ఇంజినీరింగ్ కేంద్రంగా రూపుదిద్దుకోనుంది. ఈ కొత్త గ్రీన్ఫీల్ సదుపాయం, 'జీత్నే కా డీయూఎం' అనే సంస్థ సిద్ధాంతంతో గత మూడు దశాబ్దాలుగా వ్యవసాయ రంగంలో ఐటీఎల్ తీసుకొచ్చిన పరివర్తనకు సహజమైన కొనసాగింపుగా నిలుస్తుంది. ఈ సమావేశంలో ఐటీఎల్ తన తదుపరి వ్యవసాయ ఆవిష్కరణల దశపై ఉన్న దృష్టిని, అలాగే సాంకేతికత ఆధారిత పారిశ్రామిక పెట్టుబడులకు ఉత్తరప్రదేశ్ అభివృద్ధి చెందుతున్న ప్రధాన కేంద్రంగా ఎలా మారుతోందనే అంశాన్ని చర్చించింది. ఈ కొత్త కేంద్రం ద్వారా ఇంజినీరింగ్ నైపుణ్యాన్ని రైతుల అనుభవాలతో సమన్వయం చేసి, భారతీయ మరియు ప్రపంచ మార్కెట్ అవసరాలకు అనుగుణంగా వ్యవసాయ పరిష్కారాలను అభివృద్ధి చేసే శక్తివంతమైన వ్యవస్థను ఐటీఎల్ మరింత బలోపేతం చేయనుంది. అలాగే, ఉన్నత విలువ గల ఇంజినీరింగ్, నైపుణ్యాభివృద్ధి, ఉపాధి సృష్టి మరియు సాంకేతికత ఆధారిత పారిశ్రామిక పురోగతి ద్వారా రాష్ట్ర ఆవిష్కరణల పర్యావరణ వ్యవస్థకు కూడా ఈ కేంద్రం కీలకంగా దోహదపడుతుందని భావిస్తున్నారు. ఇది రాష్ట్రంలో సంస్థ దీర్ఘకాలిక విస్తరణ కార్యాచరణలో ఒక ముఖ్యమైన మైలురాయిగా నిలవనుంది. ఇంటర్నేషనల్ ట్రాక్టర్స్ లిమిటెడ్ సంయుక్త మేనేజింగ్ డైరెక్టర్ శ్రీ రమణ్ మిట్టల్ మాట్లాడుతూ, ఉత్తరప్రదేశ్ గౌరవ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ గారిని కలుసుకుని, గ్రేటర్ నోయిడాలో 25 ఎకరాల విస్తీర్ణంలో ఏర్పాటు చేయనున్న ఐటీఎల్ కొత్త గ్లోబల్ఆర్అండ్డి సదుపాయం గురించి మా దృష్టిని పంచుకోవడం మాకు గౌరవంగా అనిపించింది. ఇది ఐటీఎల్ లో వ్యవసాయ ఆవిష్కరణల తదుపరి దశను రూపొందించే దిశగా ఒక కీలక ముందడుగు. వ్యాపార వాతావరణం అభివృద్ధి చెందేందుకు ఆయన అందించిన ప్రోత్సాహం, విశ్వాసం మరియు స్ఫూర్తిదాయక నాయకత్వానికి మేము హృదయపూర్వక కృతజ్ఞతలు తెలుపుతున్నాము. సాంకేతికత ఆధారిత, ప్రగతిశీల ఉత్తరప్రదేశ్ను నిర్మించాలనే ఆయన దూరదృష్టి మాకు మరింత పెద్ద లక్ష్యాలను నిర్దేశించడానికి, వేగంగా ముందుకు సాగడానికి మరియు భవిష్యత్తును నిర్మించడానికి స్ఫూర్తినిస్తుంది. వ్యవసాయ పరిశోధన మరియు ఆవిష్కరణల కోసం ప్రపంచ ప్రమాణాలకు అనుగుణమైన ఒక సంస్థను నిర్మించడం మా లక్ష్యం. రైతులను శక్తివంతం చేసే, వ్యవసాయాన్ని రూపాంతరం చేసే మరియు అసాధ్యాన్ని సాధ్యంగా మార్చే సాంకేతికతలను అభివృద్ధి చేయాలనే సంకల్పంతో ముందుకు సాగుతున్నాము. ఉత్తరప్రదేశ్ నుంచి భారత్కు, ప్రపంచానికి - వ్యవసాయ భవిష్యత్తును నిర్మిం చేందుకు మేము ఎదురుచూస్తున్నాం.

# రామేశ్వరపల్లిలో మళ్లీ కేబుల్ వైర్ల దొంగలు



- 12 వ్యవసాయ మోటార్ల వైర్లు చోరీ

భిక్కనూర్, ఆగస్ట్ 14 (మనం న్యూస్): భిక్కనూర్ మండలం రామేశ్వరపల్లి గ్రామ పరిధిలో వ్యవసాయ మోటార్ల కేబుల్ వైర్ల చోరీలు మళ్లీ కలకలం రేపుతున్నాయి. గుర్తుతెలియని వ్యక్తులు రాత్రి వేళ పొలాల్లోకి చొరబడి ఏకంగా 12 వ్యవసాయ మోటార్లకు సంబంధించిన కేబుల్ వైర్లను కత్తిరించి ఎత్తుకెళ్లినట్లు రైతులు తెలిపారు. ఉదయం పొలాలకు వెళ్లిన రైతులు మోటార్ల వద్ద వైర్లు కనిపించకపోవడంతో చోరీ జరిగిన విషయం గుర్తించారు. గతంలో కూడా ఇదే తరహాలో చోరీలు జరగడంతో రైతుల్లో ఆందోళన నెలకొంది. మోటార్లకు కొత్తగా వైర్లు అమర్చుకోవడానికి అదనపు ఖర్చు భరించాల్సి వస్తోందని రైతులు వాపోతున్నారు. ఇదిలా ఉండగా వరుసగా జరుగుతున్న కేబుల్ వైర్ల చోరీలను అరికట్టేందుకు పోలీసులు ఇప్పటికే ప్రత్యేక గస్తీ ఏర్పాటు చేసి రాత్రి వేళల్లో అనుమానాస్పద వ్యక్తుల కదలికలపై నిఘా పెంచారు. దొంగలను పట్టుకునేందుకు పోలీసులు తీవ్రంగా ప్రయత్నిస్తున్నారని స్థానికులు తెలిపారు. చోరీలకు పాల్పడుతున్న వారిని త్వరగా గుర్తించి కఠిన చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు. పోలీసులు చేస్తున్న ప్రయత్నాలతో త్వరలోనే దొంగల ముఠా పట్టుబడుతుందని స్థానికులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

# ఎంపీడీవో కార్యాలయాల్లో ప్రజావాణి కార్యక్రమాలు

- ఆగస్టు 17 నుండి ప్రారంభం
- ఉదయం 10 గంటల నుండి 1:00 వరకు



ఎంపీడీవో కార్యాలయంలో ప్రజావాణి

సిద్దిపేట, ఆగస్టు 14( మనం ప్రతినిధి): రాష్ట్రంలో ఎల్ నినో ప్రభావం వల్ల వ్యవసాయ రంగంలో ఎదురవుతున్న సవాళ్లను అధిగమించేందుకు అధికారులు సమన్వయంతో పనిచేయాలని పంట మార్పిడి తప్పనిసరిగా జరిగేలా చూడాలని రాష్ట్ర ప్రభుత్వం జిల్లా అధికారులకు ఆదేశాలు జారీ చేసింది. ప్రజావాణి కార్యక్రమం నిర్వహణ గూర్చి అన్నీ జిల్లాల కలెక్టర్లుతో వీడియో కాన్ఫరెన్స్ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు నిర్వహించి మన సూచనలు చేశారు. రాష్ట్రంలో గత కొన్ని రోజులుగా వర్షాలు కురిసాయని, ఆ నీటిని పూర్తిగా తాగునీటికి మాత్రమే ఉపయోగించనున్నట్లు ప్రభుత్వం స్పష్టం చేసింది. పంట మార్పిడి కొన్ని జిల్లాలలో ఆశించిన స్థాయిలో జరగలేదని అసహనం వ్యక్తం చేయగా ఎల్ నీ నో ప్రభావం ఈనెల ఆఖరి నుండి మొదలవుతుందని, సాంప్రదాయ పంటలు కాకుండా ప్రత్యామ్నాయ పంటల వైపు రైతులను ప్రోత్సహించాలని ప్రభుత్వ యంత్రాంగం పేర్కొంది. కూరగాయల సాగును ప్రోత్సహించాలని, వాటికి మార్కెట్లో మంచి ధరలు లభించే అవకాశాలు ఉన్నాయని తెలిపారు. ప్రతి జిల్లాలో అత్యవసర ప్రణాళికలను సిద్ధం చేసి వెంటనే అమలు చేయాలని, అవసరమైన విత్తనాలు, ఎరువులు అందుబాటులో ఉంచాలని ఆదేశించారు.

ఆగస్టు 17 సోమవారం నుండి మండల కేంద్రంలోని ఏంపిడిఓ కార్యాలయంలో ఉదయం 10 గంటల నుండి మధ్యాహ్నం 1 వరకు ప్రజావాణి కార్యక్రమం నిర్వహించాలని, మండల అధికారులందరూ ఈ మండల ప్రజావాణి కార్యక్రమంలో పాల్గొని వచ్చే దరఖాస్తులను వెంటనే పరిష్కరించాలని ఆదేశించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కె హైమావతి సంబంధిత శాఖల అధికారులతో మాట్లాడుతూ వ్యవసాయ శాఖ అధికారులు గ్రామంలో సర్పంచ్, ప్రజా ప్రతినిధులతో కలిసి క్షేత్రస్థాయిలో పర్యవేక్షణ చేసి వరి కాకుండా ఇతర పంటలు వేసుకునేలా ప్రోత్సహించాలని ఆదేశించారు. వ్యవసాయ శాఖ అధికారులు సీరియస్ గా పనిచేయాలని, ఎల్ నీ నో ప్రభావం పరిగణలోకి తీసుకొని రైతులు పంట మార్పిడి చేసుకోవాలని సూచించారు. మండల ప్రజావాణి కి సంబంధించి మండల పరిషత్ కార్యాలయాలలో అన్ని ఏర్పాట్లు సిద్ధం చేయాలని జెడ్పి సీఈఓ ను ఆదేశించారు ఈ కార్యక్రమంలో జెడ్పిసిఈఓ రమేష్, డిఎచ్ఓ సువర్ణ, డిఏఓ మల్లయ్య, సిపిఓ దశరథ్, ఇరిగేషన్ ఈఈ నాగరాజు ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.

# నేడు హంసలో 80వ భారత స్వాతంత్య్ర దినోత్సవ వేడుకలు

ములుగు, ఆగస్టు 14(మనంన్యూస్): హంస హోమియోపతి మెడికల్ కాలేజ్, హాస్పిటల్ రీసెర్చ్ సెంటర్, క్షీరసాగర్, ములుగు మండలం ఆధ్వర్యంలో నేడు 80వ భారత స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు 15 ఆగస్టు 2026న హంసఅరేనాలో ఘనంగా నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమాన్ని కళాశాల డైరెక్టర్లు డా. ఉమేష్ అక్కలదేవి, డా. పద్మజ అక్కలదేవి ఆధ్వర్యంలో, కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ డా. శ్రీనివాస్ బాబు కాశీ సమన్వయంతో నిర్వహించనున్నారు. ఈ వేడుకలకు ప్రముఖ హోమియోపతి వైద్య నిపుణులు, ఒక్కిఖి ప్రభుత్వ హోమియోపతిక్ మెడికల్ కాలేజ్, హైదరాబాద్ మాజీ ప్రిన్సిపాల్ డా. ప్రవీణ్ కుమార్ సువర్ణ ముఖ్య అతిథిగా హాజరుకానున్నారు. వేడుకలు ఉదయం 9:00 గంటలకు అసెంబ్లీతో ప్రారంభమై, 9:10 గంటలకు జాతీయ పతాకావిష్కరణ నిర్వహించనున్నారు. అనంతరం విద్యార్థులచే దేశభక్తి, జాతీయ సమైక్యత మరియు స్వాతంత్ర్య స్ఫూర్తిని ప్రతిబింబించే సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిం చబడతాయి. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ డా. శ్రీనివాస్ బాబు మాట్లాడుతూ, భారత స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాలను స్మరించుకోవడంతో పాటు, యువతలో దేశభక్తి, బాధ్యత, క్రమశిక్షణ, సేవాభావం మరియు జాతీయ సమైక్యతను పెంపొందించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని పేర్కొన్నారు.

దేశ స్వాతంత్ర్యం కోసం ప్రాణత్యాగం చేసిన మహనీయులను స్మరించుకుంటూ, వారి ఆశయాలను ముందుకు తీసుకెళ్లాలని, విద్యార్థులు దేశ అభివృద్ధిలో తమ వంతు పాత్ర పోషించాలని నిర్వాహకులు పిలుపునిచ్చారు. ఈ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో కళాశాల అధ్యాపకులు, సిబ్బంది, విద్యార్థులు మరియు ఇతర ప్రముఖులు పాల్గొననున్నారు.

# సీఎం రేవంత్ రెడ్డి పర్యటనపై ఎమ్మెల్యే చింత ప్రభాకర్ బహిరంగ లేఖ

- సీఎం పర్యటన రాజకీయ ప్రచారానికి పరిమితం కాకూడదు
- సంగమేశ్వర-బసవేశ్వర ప్రాజెక్టులకు నిధులు కేటాయించి పనులు వేగవంతం చేయాలి
- ఎమ్మెల్యే చింత ప్రభాకర్



సంగారెడ్డి ఆగస్టు 14 మనం న్యూస్ ప్రతినిధి : ముఖ్యమంత్రి రేవంత్రెడ్డి శనివారం సంగారెడ్డి జిల్లాలో పర్యటించనున్న నేపథ్యంలో జిల్లాలోని రైతులు, ప్రజలు కీలక అభివృద్ధి పనులు, సాగునీటి ప్రాజెక్టులపై ఎన్నో ఆశలు పెట్టుకున్నారని సంగారెడ్డి బీఆర్ఎస్ ఎమ్మెల్యే చింత ప్రభాకర్ పేర్కొన్నారు. సీఎం అధికారిక పర్యటన కేవలం రాజకీయ ప్రచారానికి పరిమితం కాకుండా సంగారెడ్డి జిల్లా అభివృద్ధికి ఉపయోగపడేలా స్పష్టమైన నిర్ణయాలు తీసుకోవాలని కోరుతూ ముఖ్యమంత్రికి ఆయన బహిరంగ లేఖ రాశారు. సంగమేశ్వర-బసవేశ్వర ప్రాజెక్టులకు నిధులు కేటాయించాలి సంగారెడ్డి, జహీరాబాద్, ఆందోల్, నారాయణఖేడ్ నియోజకవర్గాల పరిధిలోని 19 మండలాల్లో సుమారు 397 గ్రామాలకు సాగునీరు అందించే సామర్థ్యం ఉన్న సంగమేశ్వర-బసవేశ్వర లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టులకు తక్షణమే నిధులు మంజూరు చేసి పనులను వేగవంతం చేయాలని చింత ప్రభాకర్ డిమాండ్ చేశారు. దాదాపు 3.84 లక్షల ఎకరాలకు సాగునీరు అందించేలా ప్రతిపాదించిన ఈ ప్రాజెక్టులు పూర్తయితే మెతుకుసీమ రైతాంగానికి ఎంతో ప్రయోజనం చేకూరుతుందని అన్నారు ప్రస్తుతం వర్షాధారంగా వ్యవసాయం చేస్తున్న రైతులు సాగునీటి కోసం ఎదురుచూస్తున్నారని, ఈ ప్రాజెక్టులు పూర్తయితే వేలాది మంది రైతులకు శాశ్వత సాగునీటి భరోసా కలుగుతుందని చెప్పారు. పంటల సాగు విస్తీర్ణం పెరగడంతో పాటు వ్యవసాయంపై ఆధారపడిన గ్రామీణ కుటుంబాలకు ఆర్థిక భరోసా లభిస్తుందని పేర్కొన్నారు. ఈ ప్రాజెక్టులు పూర్తయితే వర్షాల కోసం ఆకాశం వైపు చూసే పరిస్థితి రైతులకు ఉండదు. వర్షాలు సకాలంలో పడకపోయినా సాగునీటి భరోసాతో రైతులు సమయానికి వ్యవసాయ పనులు చేపట్టి పంటలు పండించుకునే అవకాశం కలుగుతుంది. రైతులపై ఈ ప్రభుత్వానికి నిజంగా ప్రేమ, చిత్తశుద్ధి ఉంటే సంగమేశ్వర-బసవేశ్వర వంటి కీలక ప్రాజెక్టులపై స్పష్టమైన కార్యాచరణ ప్రకటించాలి అని చింత ప్రభాకర్ అన్నారు. ₹గత హామీలను అమలు చేయాలి సీఎం పర్యటనలో కొత్త హామీలు ఇవ్వడం కంటే గతంలో ప్రజలకు ఇచ్చిన హామీలను ముందుగా అమలు చేయాలి. ప్రకటనలకే పరిమితం కాకుండా సంగారెడ్డి అభివృద్ధికి అవసరమైన నిధులను వాస్తవంగా మంజూరు చేసి పనులు ప్రారంభించాలి అని ఆయన స్పష్టం చేశారు.

కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత సంగారెడ్డికి నిధులు మంజూరు చేస్తున్నామని ప్రకటనల్లో చెబుతున్నప్పటికీ క్షేత్రస్థాయిలో అభివృద్ధి పనులు కనిపించడం లేదని విమర్శించారు. ప్రకటనల్లో నిధులు చూపించడం కాదు.. జీవోలు జారీ చేసి, నిధులు విడుదల చేసి, పనులు ప్రారంభించినప్పుడే సంగారెడ్డి ప్రజలకు అభివృద్ధి ఫలాలు అందుతాయి అని అన్నారు.

# వ్యాపారవేత్తలకు ఇంక్యుబేటర్తో కొత్త అవకాశాలు

- డి ఆర్ డి ఓ దామోదర్రెడ్డి



కామారెడ్డి, ఆగస్టు 14 (మనం ప్రతినిధి): గ్రామీణ ప్రాంతాల్లో మహిళలు నిర్వహిస్తున్న వ్యాపారాలను మరింత అభివృద్ధి చేసి, స్థిరమైన ఆదాయ వనరులుగా తీర్చిదిద్దేందుకు ఇంక్యుబేటర్ కార్యక్రమం దోహదపడుతుందని డి ఆర్ డి ఓ దామోదర్రెడ్డి తెలిపారు. మహిళా వ్యాపారవేత్తలు ఈ అవకాశాన్ని పూర్తిస్థాయిలో సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఎస్ ఇ ఆర్ పి ఆధ్వర్యంలో మహిళల నేతృత్వంలో కొనసాగుతున్న వ్యాపారాలను బలోపేతం చేయడంతోపాటు, అభివృద్ధి సామర్థ్యం ఉన్న వ్యాపారాలను గుర్తించి అవసరమైన సహకారం అందించేందుకు శుక్రవారం జిల్లా స్థాయి ఇంక్యుబేటర్ కార్యక్రమాన్ని నిర్వహించారు.ఆధునిక సాంకేతికత వినియోగం.ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ., మహిళా వ్యాపారవేత్తలకు సాంకేతిక పరిజ్ఞానం, నైపుణ్యాభివృద్ధి, మార్గదర్శకత్వం, మార్కెటింగ్, ఆర్థిక అవకాశాలను అందించడమే కార్యక్రమం ప్రధాన ఉద్దేశమన్నారు. మహిళలు తమ వ్యాపారాలను చిన్నస్థాయిలోనే పరిమితం చేయకుండా భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా విస్తరించాలని సూచించారు. ఉత్పత్తుల నాణ్యత పెంపు, ఆధునిక సాంకేతికత వినియోగం, ప్యాకేజింగ్, బ్రాండింగ్, మార్కెటింగ్, మార్కెట్ అనుసంధానం, ఆర్థిక వనరుల సమీకరణపై దృష్టి పెట్టాలని తెలిపారు.ఛాలెంజ్ ఫండ్తో విస్తరణకు అవకాశంఇంక్యుబేటర్ కార్యక్రమంలో భాగంగా నిర్వహిస్తున్న ఛాలెంజ్ ఫండ్ గురించి మహిళా వ్యాపారవేత్తలకు అవగాహన కల్పించారు. అర్హత ఉన్న వారు ఈ అవకాశాన్ని వినియోగించుకుని వ్యాపార విస్తరణకు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. అర్హులను గుర్తించడం నుంచి దరఖాస్తు ప్రక్రియ, తదుపరి దశల్లో మార్గదర్శకత్వం అందించడం వరకు క్షేత్రస్థాయి సిబ్బంది చురుకైన పాత్ర పోషించాలని ఆదేశించారు. బ్యాంకులతో సమన్వయంవ్యాపారాల విస్తరణకు అవసరమైన ఆర్థిక సహాయం అందించేందుకు బ్యాంకులు, సంబంధిత ఆర్థిక సంస్థలతో సమన్వయం చేయాలని అధికారులు సూచించారు. మహిళలకు అందుబాటులో ఉన్న ఆర్థిక వనరులు, రుణ సదుపాయాలపై అవగాహన కల్పించాలని తెలిపారు. ఇంక్యుబేటర్ ద్వారా సాంకేతిక పరిజ్ఞానం, మెంటరింగ్, ఆర్థిక సదుపాయాలు, మార్కెట్ అవకాశాలను అనుసంధానం చేసి వ్యాపారాలను మరింత లాభదాయకంగా తీర్చిదిద్దే అవకాశం ఉందన్నారు. మండలాల వారీగా గుర్తింపు జిల్లాలోని అన్ని మండలాల్లో అర్హత కలిగిన మహిళా వ్యాపారవేత్తలను గుర్తించి కార్యక్రమం ద్వారా లభించే అవకాశాలపై అవగాహన కల్పించాలని సూచించారు. ఏ పీ ఎం లు, కమ్యూనిటీ కోఆర్డినేటర్లు గ్రామీణ ప్రాంతాల్లో మహిళా వ్యాపారాలను గుర్తించి, వాటి అభివృద్ధి అవకాశాలు, అవసరాలను తెలుసుకుని తగిన మార్గదర్శకత్వం అందించాలన్నారు. ఇప్పటికే విజయవంతంగా కొనసాగుతున్న మహిళా వ్యాపారాలను ఆదర్శంగా చూపించి మరింత మంది మహిళలను వ్యాపార రంగంలోకి ప్రోత్సహించాలని పేర్కొన్నారు. వ్యాపారాభివృద్ధి అవకాశాలపై అవగాహన. కార్యక్రమంలో ఏ డి ఆర్ డి ఓ విజయలక్ష్మి, డిపిఎం సాయిలు, బిట్స్ పిలాని మేనేజర్ వినోద్కుమార్, జిల్లా ఇన్చార్జి శివకుమార్, ఏ పీ ఎం రాజేందర్తో పాటు అన్ని మండలాల ఏ పీ ఎంలు, కమ్యూనిటీ కోఆర్డినేటర్లు, మహిళా వ్యాపారవేత్తలు, సెర్ప్ సిబ్బంది, సంబంధిత అధికారులు పాల్గొన్నారు. బిట్స్ పిలాని ప్రతినిధులు ఇంక్యుబేటర్ ద్వారా అందించే మార్గదర్శకత్వం, వ్యాపారాభివృద్ధి అవకాశాలపై అవగాహన కల్పించారు. మహిళలు స్వయం ఉపాధితో పాటు ఇతరులకు ఉపాధి కల్పించే స్థాయికి ఎదగాలని అధికారులు ఆకాంక్షించారు.

# ప్రతి నెల సివిల్ రైట్స్ డే నిర్వహించాలి

- కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్



కామారెడ్డి, ఆగస్టు 14 (మనంప్రతినిధి): ఎస్సీ, ఎస్టీలపై జరిగే దాడులు, అట్రాసిటీస్ కేసుల్లో బాధితులకు ప్రభుత్వం నిర్దేశించిన నిబంధనల ప్రకారం సకాలంలో పరిహారం అందేలా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్, జిల్లా మేజిస్ట్రేట్ ఆశిష్ సంగ్వాన్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్లో ఆయన అధ్యక్షతన జిల్లా విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లాలో ఎస్సీ, ఎస్టీలపై నమోదైన అట్రాసిటీస్ కేసులు, వాటి దర్యాప్తు, కేసుల పురోగతి, బాధితులకు అందుతున్న పరిహారం తదితర అంశాలపై కలెక్టర్ సమీక్షించారు. బాధితులకు ప్రభుత్వం నుంచి అందాల్సిన పరిహారం, ఇతర సహాయాలను ఎలాంటి జాప్యం లేకుండా అందించాలని సూచించారు. కేసుల దర్యాప్తు, పురోగతిని ఎప్పటికప్పుడు సమీక్షిస్తూ బాధితులకు అవసరమైన సహాయ సహకారాలు అందేలా చూడాలన్నారు. హక్కులపై అవగాహన కల్పించాలి. ప్రతి నెల సివిల్ రైట్స్ డే కార్యక్రమాన్ని నిర్వహించాలని కలెక్టర్ ఆదేశించారు. ఈ కార్యక్రమాల ద్వారా ఎస్సీ, ఎస్టీ వర్గాల ప్రజలకు తమ హక్కులపై అవగాహన కల్పించడంతో పాటు, వారి సమస్యలను గుర్తించి పరిష్కరించేందుకు చర్యలు చేపట్టాలని సూచించారు. అట్రాసిటీస్ కేసుల్లో బాధితులకు న్యాయం జరిగేలా సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని అన్నారు. సమావేశంలో అదనపు కలెక్టర్లు వి. విక్టర్, ఎన్.వై. గిరి, డిప్యూటీ కలెక్టర్ రవి తేజ, జడ్పీ సీఈవో చందర్ నాయక్, బాన్సువాడ, ఎల్లారెడ్డి డీఎస్పీలు, డీసీఆర్బీ డీఎస్పీ, ఎస్సీ అభివృద్ధి శాఖ అధికారి పి. వెంకటేష్, జిల్లా గిరిజన సంక్షేమ, ఉద్యానవన శాఖ అధికారులు, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

# అన్ని రంగాల్లో సింగరేణి కంపెనీ ఉండాలన్నదే లక్ష్యం

## సింగరేణి చైర్మన్ డాక్టర్ బుద్ధ ప్రకాష్ జ్యోతి

## సోలార్ పవర్ ప్లాంటును ప్రారంభించిన సీఎండి



**కొత్తగూడెం సింగరేణి, ఆగస్టు 14(మనం న్యూస్):** సింగరేణి సంస్థ అన్ని రంగాల్లో ముందుండాలన్నదే లక్ష్యమని సింగరేణి చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ బుద్ధ ప్రకాష్ జ్యోతి అన్నారు. కొత్తగూడెంలోని సింగరేణి కార్పొరేట్ పరిధిలోని సంస్థకు సంబంధించిన భవనాలపై ఏర్పాటు చేసిన 1.23 మెగావాట్ల రూఫ్టాప్ సోలార్ పవర్ ప్లాంట్ లను శుక్రవారం సింగరేణి సంస్థ ఛైర్మన్ బుద్ధ ప్రకాశ్ జ్యోతి ప్రారంభించి గ్రిడ్ కు అనుసంధానం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సింగరేణి అంటే బొగ్గు ఉత్పత్తి చేసే కంపెనీగా చాలా ఏళ్లుగా గుర్తింపు ఉందని కానీ నేడు మనం చేపట్టిన వ్యాపార విస్తరణ చర్యలతో సింగరేణి కాలరీస్ అంటే థర్మల్ విద్యుత్ రంగంలోనూ సోలార్ విద్యుత్ ఫ్లోటింగ్ సోలార్ విద్యుత్ ఉత్పత్తిలోనూ తనదైన మార్కును చాటుతోందని పేర్కొన్నారు. సింగరేణి సంస్థ పర్యావరణహిత చర్యగా బొగ్గు ఉత్పత్తి థర్మల్ విద్యుత్ ఉత్పత్తితో పాటు సింగరేణి వ్యాప్తముగా ఖాళీగా ఉన్న అన్ని ప్రదేశాల్లో ఇప్పటివరకు 245.5 మెగావాట్ల సోలార్ ప్లాంట్లను ఏర్పాటు చేసుకున్నామని చెప్పారు. భారత ప్రభుత్వ తెలంగాణా ప్రభుత్వ ఆదేశాలమేరకు దేశ రాష్ట్ర ఇంధన అవసరాలకు అనుగుణముగా మరిన్ని సోలార్ ప్లాంట్లను ఏర్పాటు చేస్తామని తెలిపారు. సింగరేణి సంస్థలోని భవనాలపై సోలార్ రూఫ్ టాప్ లను ఏర్పాటు చేసుకుంటున్నామని దీనిలో భాగంగా ఈ రోజు కార్పొరేట్ పరిధిలోని సింగరేణి సంస్థకు సంబంధించిన భవనాలపై ఏర్పాటు చేసుకున్న 1.23 మెగావాట్ల రూఫ్టాప్ సోలార్ పవర్ ప్లాంట్లను ప్రారంభించుకోవటం చాలా సంతోషం అని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఛైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ బుద్ధ ప్రకాష్ జ్యోతితో పాటు డైరెక్టర్(ఆపరేషన్స్)ఎల్.వి. సూర్యనారాయణ, డైరెక్టర్(ప్రాజెక్ట్స్ అండ్ ప్లానింగ్)కె.వెంకటేశ్వర్లు, డైరెక్టర్(ఈ అండ్ ఎం)ఎం.తిరుమలరావు, జిఎం(కోఆర్డినేషన్) తాడబోయిన శ్రీనివాస్, జిఎం (సిపి అండ్ పి) ఎ.మనోహర్, జిఎం(ఈ అండ్ఎం) వర్క్ షాప్ అండ్ ఎనర్జీ మేనేజ్మెంట్)కె.శ్రీనివాసులు, గుర్తింపు సంఘం(ఏఐటియూసి) బ్రాంచ్ సెక్రటరీ ఎస్వీ.రమణ మూర్తి, ప్రాతినిధ్య సంఘం(ఐఎన్టియూసి) సీనియర్ వైస్ ప్రెసిడెంట్ సి.త్యాగరాజన్, కార్పొరేట్ సిఎంఓఏఐ ఉపాధ్యక్షుడు కేశవరావు, ఇతర అధికారులు, ఉద్యోగులు కార్మిక సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

# 19 నుండి ప్రతిష్టా మహోత్సవాలు




**కొత్తగూడెం టౌన్ ఆగస్టు 14 (మనం న్యూస్):** శ్రీ పార్వతీ సమేత శ్రీ రామలింగేశ్వర స్వామి వారు, శ్రీ పర్వత వర్ధని అమ్మవారు గణపతి ద్వారపాలకః నందీశ్వర జీవధ్వజ పంచాయతన ప్రతిష్ట సందర్భంగా ప్రతిష్టాంగ హోమములు, జీవకళాణ్యాసనము, మహా పూర్ణాహుతి కలశోద్వాసన, మహా కుంభ గోజ్వాల దర్పణ దర్శనమహోత్సవాలను ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ మహోత్సవాలు ఈ నెల 19వ తేదీ నుంచి 23వ తేదీ వరకు కొనసాగనున్నాయి.

ప్రతిష్ట మహోత్సవానికి విచ్చేసిన భక్తులకు అన్నప్రసాద వితరణ కార్యక్రమం ఉంటుందని, మహోత్సవాల్లో భాగంగా వివిధ ఆధ్యాత్మిక కార్యక్రమాలు, ప్రత్యేక పూజలు, అభిషేకాలు, భజనలు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ సందర్భంగా భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించి స్వామివారి ఆశీస్సులు పొందాలని నిర్వాహకులు కోరారు. కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు భక్తులు, దాతలు, స్థానికులు సహకరించాలని విజ్ఞప్తి చేశారు. మహోత్సవాల నిర్వహణకు పలువురు ప్రముఖులు, భక్తులు సహకరిస్తున్నారని నిర్వాహకులు తెలిపారు. భక్తుల సౌకర్యార్థం ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నట్లు ఆలయ ఈఓ సులోచన పేర్కొన్నారు.

# ఖమ్మం జిల్లాను పర్యాటకంగా తీర్చిదిద్దాలి

- నీటి వనరులను పరిరక్షిస్తూ పర్యాటక ప్రాంతాలుగా అభివృద్ధి చేయాలి
- జిల్లాలోని అత్యుత్తమ పర్యాటక ప్రాంతాల అభివృద్ధికి ప్రణాళికాబద్ధంగా చర్యలు
- ప్రతిపాదనలను త్వరితగతిన ఖరారు చేసి అమలు దశకు తీసుకురావాలి
- కలకోట పెద్ద చెరువు, మడుపల్లి, మధిర ట్యాంక్ బండ్ పర్యాటక అభివృద్ధి పురోగతి పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించిన కలెక్టర్ దివాకర టిఎస్



**మధిర/బోనకల్, ఆగస్టు 14(మనం న్యూస్):** ఖమ్మం జిల్లాలోని సహజసిద్ధమైన నీటి వనరులు, చెరువులు, సరస్సులను పర్యావరణ పరిరక్షణకు అనుగుణంగా పర్యాటక కేంద్రాలుగా అభివృద్ధి చేసి, జిల్లాను రాష్ట్రంలోనే ప్రముఖ పర్యాటక గమ్యస్థానంగా తీర్చిదిద్దేందుకు సమగ్ర ప్రణాళికలు రూపొందించాలని జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం బోనకల్, మధిర మండలాల్లో జిల్లా కలెక్టర్ పర్యటించి వివిధ పర్యాటక అభివృద్ధి ప్రాంతాలను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. బోనకల్ మండలంలోని కలకోట పెద్దచెరువు వద్ద పర్యాటక అభివృద్ధికి మంజూరైన పనులు, చేపట్టాల్సిన అభివృద్ధి ప్రతిపాదనలను పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. అనంతరం మధిర మండలంలోని మడుపల్లి, మధిర ట్యాంక్ బండ్ ప్రాంతాలను కలెక్టర్ సందర్శించి, అక్కడ జరుగుతున్న పర్యాటక అభివృద్ధి పనుల పురోగతిని పరిశీలించారు. కిచెన్, డైనింగ్ హాల్, టాయిలెట్ బ్లాక్ తదితర నిర్మాణ పనులను పరిశీలించి, నిర్మాణంలో ఉపయోగిస్తున్న సామాగ్రి నాణ్యతను పరిశీలించాలని అధికారులను ఆదేశించారు. నిర్మాణ పనుల్లో నాణ్యత ప్రమాణాలను తప్పనిసరిగా పాటించాలని, నాణ్యతలో ఎలాంటి లోపాలు తలెత్తినా సహించేది లేదని స్పష్టం చేశారు. మధిర రివర్ ఫ్రంట్ అభివృద్ధి పనులను ఉప ముఖ్యమంత్రి ఆకాంక్షలకు అనుగుణంగా సమగ్రంగా, ప్రణాళికాబద్ధంగా చేపట్టాలని కలెక్టర్ సూచించారు. ప్రజలకు ఆహ్లాదకరమైన వాతావరణంతో పాటు అవసరమైన అన్ని మౌళిక సదుపాయాలు అందుబాటులో ఉండేలా అభివృద్ధి పనులను రూపొందించాలన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ దివాకర టీఎస్ మాట్లాడుతూ జిల్లాలో చేపట్టే ప్రతి పర్యాటక అభివృద్ధి కార్యక్రమం సహజ వనరుల పరిరక్షణకు అనుగుణంగా ఉండాలని అన్నారు. పర్యాటక అభివృద్ధి పేరుతో నీటి వనరులు, పర్యావరణానికి ఎలాంటి నష్టం కలగకుండా ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. జిల్లాలో పర్యాటక రంగానికి విస్తృత అవకాశాలు ఉన్నాయని, వాటిని సమర్థవంతంగా వినియోగించు కోవాల్సిన అవసరం ఉందన్నారు. మధిర ట్యాంక్ బండ్ పర్యాటక అభివృద్ధిలో భాగంగా ఎ+1 తరహాలో రెండు కాటేజీలు, రిసెప్షన్, కిచెన్-రెస్టారెంట్, విద్యుదీకరణ, టాయిలెట్ బ్లాక్ తదితర సదుపాయాలను ఏర్పాటు చేసేందుకు చేపట్టిన పనులను వేగవంతం చేయాలని ఆదేశించారు. నిర్మాణ పనులను నిర్దేశిత ప్రమాణాల ప్రకారం నాణ్యతతో పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని అన్నారు. ప్రర్యాటక ప్రాంతాల అభివృద్ధి ద్వారా స్థానిక ప్రజలకు ఉపాధి అవకాశాలు కల్పించడంతో పాటు స్థానిక ఆర్థిక వ్యవస్థకు మరింత ఊతమిచ్చేలా చర్యలు చేపట్టాలని సూచించారు. అదేవిధంగా కలకోట పెద్దచెరువు బండ్ విస్తరణ, పర్యాటక అభివృద్ధి కోసం ఎ+1 తరహాలో మూడు కాటేజీలు, రిసెప్షన్, కేఫెటీరియా, పార్కింగ్, విద్యుదీకరణ, టాయిలెట్ బ్లాక్ తదితర సదుపాయాలను ఏర్పాటు చేసేందుకు సమగ్ర ప్రతిపాదనలు సిద్ధం చేసి త్వరితగతిన అందించాలని అధికారులను ఆదేశించారు. అభివృద్ధి పనులకు అవసరమైన భూమి అందుబాటులో లేని ప్రాంతాల్లో ప్రత్యామ్నాయ ఇంజినీరింగ్ పరిష్కారాలను అన్వేషించాలని కలెక్టర్ సూచించారు. అవసరమైతే పర్యాటక అభివృద్ధి కార్యక్రమాల కోసం భూసేకరణ చేపట్టేందుకు జిల్లా యంత్రాంగం సిద్ధంగా ఉందని తెలిపారు. అన్ని శాఖల అధికారులు పరస్పర సమన్వయంతో పనిచేసి పర్యాటక అభివృద్ధి ప్రతిపాదనలను త్వరితగతిన ఖరారు చేసి అమలు దశకు తీసుకురావాలని ఆదేశించారు. పర్యాటక ప్రాంతాల్లో రహదారులు, పార్కింగ్, విద్యుత్, తాగునీరు, పారిశుధ్యం, భద్రత వంటి మౌలిక సదుపాయాలను సమగ్రంగా అభివృద్ధి చేయాలని సూచించారు. జిల్లాలోని సహజసిద్ధమైన నీటి వనరులను పర్యావరణ పరిరక్షణతో పాటు పర్యాటక అభివృద్ధికి అనుసంధానం చేస్తూ, స్థానిక ప్రజలకు ఉపాధి అవకాశాలు పెరిగేలా, చిన్న వ్యాపారాలు అభివృద్ధి చెందేలా, స్థానిక ఆర్థికాభివృద్ధికి దోహదపడే విధంగా దీర్ఘకాలిక ప్రణాళికలు రూపొందించాలని కలెక్టర్ అధికారులకు దిశానిర్దేశం చేశారు. కలెక్టర్ వెంట జిల్లా టూరిజం అధికారి బి. సుమన్ చక్రవర్తి, మధిర తహశీల్దారు రాంబాబు, బోనకల్ తహసీల్దారు, ఆర్ అండ్ బి, ఇరిగేషన్ శాఖల అధికారులు, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

# ఇడమయ్యకు కృత్రిమ కాళ్లు

- రెండు లక్షల వ్యయంతో ఏర్పాటు
- విజయవాడలో కొలతలు తీసుకున్న వైద్యులు
- కాళ్ల ఏర్పాటుకు ముందుకు వచ్చిన దాతలు శ్రీనివాసరావు దంపతులు
- 20 రోజులలో యూఎస్ నుండి రానున్న కాళ్లు
- మనం కథనంతో కదిలిన దాతలు





## ఇడమయ్యను నడిపిస్తాను

కృత్రిమ కాళ్లు పెట్టించేందుకు ముందుకు వచ్చిన స్వచ్ఛంద సంస్థ

ఇడమయ్య ఇంటికి వెళ్లి భరోసా ఇచ్చిన నిర్వాహకుడు

దుస్తులు, నగదు అందజేత

'మనం' కథనానికి స్పందన



చర్ల, జూన్ 29 (మనం న్యూస్) : ఆరేళ్ల క్రితం విద్యుత్ ఘాతంతో ప్రమాద వశాత్తూ రెండు కాళ్లు పూర్తిగా, రెండు చేతులను పాక్షికంగా కోల్పోయి దుర్బర జీవితం అనుభవిస్తున్న చర్ల మండలం బక్కచింతలపాడు గ్రామానికి చెందిన ఆదివాసీ మడకం ఇడమయ్యను ఆదుకునేందుకు స్వచ్ఛంద సేవా సంస్థ నిర్వాహకుడు తోలెం శ్రీనివాసరావు ముందుకు వచ్చారు. కాళ్లు, చేతులు కోల్పోయి ఇబ్బందులు పడుతున్న ఇడమయ్య దీనగాథపై ఈ నెల 20 వ తేదీన 'మనం' దినపత్రికలో ప్రచురితమైన 'పాపం ఇడమయ్య' కథనానికి పినపాక మండలం సింగిరెడ్డిపల్లి పంచాయతీ దేవానగరం గ్రామానికి చెందిన మహర్షి స్వచ్ఛంద సంస్థ నిర్వాహకులు తోలెం శ్రీనివాసరావు స్పందించారు. సోమవారం ఆయన బక్కచింతలపాడు గ్రామాన్ని సందర్శించి ఇడమయ్య తో మాట్లాడారు. దెబ్బతిన్న అవయవాలను పరిశీలించి నడిపించే బాధ్యతనదేనంటూ భరోసా ఇచ్చారు. సుమారు రెండు లక్షల రూపాయల వ్యయంతో రెండు కృత్రిమ కాళ్లను పెట్టిస్తానని తెలిపారు. త్వరలో ఇడమయ్యను విజయవాడ తీసుకువెళ్లి కృత్రిమ కాళ్ల కొలతలను తీయించి నెల రోజులలో ఏర్పాటు చేస్తానని భరోసా ఇచ్చారు. పూర్తిగా దెబ్బతిన్న కుడి చేతికి సైతం వైద్యుని సూచనతో రాడ్లు వేయించే ఏర్పాటు చేస్తానని హామీ ఇచ్చారు. తమ సంస్థ ద్వారా ఇప్పటి వరకు అనేక సేవా కార్యక్రమాలను నిర్వహించినట్లు శ్రీనివాసరావు తెలిపారు. ప్రమాదాలలో కాళ్లు కోల్పోయిన 20 మందికి సంస్థ ద్వారా కృత్రిమ కాళ్లను అమర్చినట్లు వెల్లడించారు. ఇడమయ్యకు బ్యాటరీ సైకిల్ ఏర్పాటు చేస్తానని తెలిపారు. ఆయన కుటుంబానికి అన్ని రకాలుగా సహాయ సహకారాలను అందిస్తామని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా ఇడమయ్యకు నూతన దుస్తులు, నగదును అందజేసి మానవత్వం చాటుకున్నారు. ఇడమయ్య దీనగాదను బాహ్యప్రపంచానికి తెలియ చేసిన 'మనం'ను అభినందించారు. కార్యక్రమంలో కలివేటి పవన్ కుమార్, పాయం నాగబాబు, స్థానికులు పాల్గొన్నారు.

మనం https://www.manamepaper.com/clip/268593 Telangana (30-6-2026)

చర్ల, ఆగస్ట్ 14 (మనం న్యూస్) : ఆరేళ్ల క్రితం విధి వక్రీకరించి విద్యుత్ ఘాతంతో రెండు కాళ్లు పూర్తిగా, రెండు చేతులు పాక్షికంగా కోల్పోయి నడవలేక మంచానికే పరిమితమైన భద్రాద్రి కొత్తగూడెం జిల్లా చర్ల మండలం బక్కచింతలపాడు గ్రామానికి చెందిన ఆదివాసీ మడకం ఇడమయ్య ఎట్టకేలకు కృత్రిమ కాళ్ల సహాయంతో మళ్లీ నడక సాగించనున్నాడు. ఆయన దుస్థితిపై 'మనం' దినపత్రికలో జూన్ 21 వ తేదీన 'పాపం ఇడమయ్య' శీర్షికన వార్తా కథనం ప్రచురితమైన విషయం విదితమే. 'మనం' కథనానికి స్పందించిన భద్రాద్రి జిల్లా పినపాక మండలం దేవానగరం గ్రామానికి చెందిన మహర్షి స్వచ్ఛంద సేవాసంస్థ డైరెక్టర్ తోలెం శ్రీనివాసరావు జూన్ 29న బక్కచింతలపాడు గ్రామానికి వచ్చి ఇడమయ్య స్థితిగతులను పరిశీలించారు. నెల రోజుల లోగా నిన్ను నడిపిస్తానంటూ భరోసా ఇచ్చారు. ఇచ్చిన హామీ మేరకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని విజయవాడకు చెందిన ఇవాల్యుయేషన్ సెంటర్ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ జున్ను నాగరాజును సంప్రదించారు. దాత కస్తూర్బా శ్రీనివాసరావు దంపతులు రూ. రెండు లక్షల విలువ చేసే రెండు కృత్రిమ కాళ్లను ఏర్పాటు చేసేందుకు ముందుకు వచ్చారు. శుక్రవారం మహర్షి స్వచ్ఛంద సంస్థ నిర్వాహకులు శ్రీనివాసరావు ఇడమయ్యను విజయవాడ తీసుకువెళ్లి డాక్టర్ నాగరాజు చే కృత్రిమ కాళ్లకు సంబంధించిన కొలతలను తీసుకున్నారు. యూఎస్, జర్మనీ టెక్నాలజీ సిలికాన్ లాకింగ్ మెకానిజం యాక్షన్ ఫుట్ సిస్టం ద్వారా ఆదునిక కృత్రిమ కాళ్లు తయారయి 20 రోజులలో అవి విజయవాడ రానున్నాయి. దీంతో ఇడమయ్య దాదాపు ఆరేళ్ల తర్వాత తన కాళ్ల మీద తాను నిలబడి నడవనున్నాడు. తన దీనగాధను ప్రచురించిన 'మనం', కథనంతో స్పందించి తనను నడిపించేలా చేయనున్న మహర్షి సంస్థ నిర్వాహకులు శ్రీనివాసరావు, దాతలు కస్తూరి శ్రీనివాసరావు దంపతులకు ఇడమయ్య అతని కుటుంబం కృతజ్ఞతలు తెలిపింది.

# సమృద్ధిగా వర్షాలు కురవాలి

- వరలక్ష్మీ వ్రతంలో మాజీ ఎమ్మెల్యే డా. బానోత్ చంద్రావతి



**వైరా, ఆగస్టు 14 (మనం న్యూస్):** సమృద్ధిగా వర్షాలు కురవాలని,రైతులు సుభిక్షంగా ఉండాలని మాజీ ఎమ్మెల్యే, డా బానోత్ చంద్రావతి అన్నారు.శుక్రవారం వరలక్ష్మీ వ్రతంలో ఆమె పాల్గొన్నారు. వైరా వేదపాఠశాలలో శ్రీ సత్యసాయి సేవా ట్రస్టు మహిళా విభాగం ఆధ్వర్యంలో సామూహిక వరలక్ష్మీ వ్రతాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మాజీ ఎమ్మెల్యే డా. బానోత్ చంద్రావతి హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. వర్షాభావ పరిస్థితులతో రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్న నేపథ్యంలో సకాలంలో సమృద్ధిగా వర్షాలు కురిసి పంటలు బాగా పండాలని ఆకాంక్షిస్తు గోపూజ నిర్వహించారు. అనంతరం 108 బిందెల నీటితో ప్రత్యేక జలాభిషేకం చేపట్టారు. రైతుల సంక్షేమం, ప్రజల సుఖసంతోషాల కోసం భగవంతుడిని ప్రార్థించారు.స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని నిర్వహించిన మొక్కలు నాటే కార్యక్రమంలోనూ మాజీ ఎమ్మెల్యే చంద్రావతి పాల్గొన్నారు. అనంతరం భక్తులకు అన్నప్రసాద వితరణ చేశారు. కార్యక్రమంలో సత్యసాయి సేవా ట్రస్టు రాష్ట్ర అధ్యక్షులు దమ్మాలపాటి సుధాకర్, జిల్లా అధ్యక్షులు నరసింహారావు, వైరా కన్వీనర్ కుమార్, కోఆర్డినేటర్ భాస్కరరావు, యూత్ కోఆర్డినేటర్ నరేష్, మహిళా కోఆర్డినేటర్ హనుమాయమ్మ, కాపా మురళీకృష్ణ, 15వ వార్డు కౌన్సిలర్ శైలజ, మాచెర్ల నాగభూషణం తదితరులు పాల్గొన్నారు.

# పోలీసు ఆఫీసర్స్ అసోసియేషన్ నూతన కార్యవర్గం

## జిల్లా ఎస్పీ రోహిత్ రాజు అభినందనలు

**భద్రాద్రి కొత్తగూడెం, ఆగస్ట్ 14 (మనంప్రతినిధి):** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పోలీసు ఆఫీసర్స్ అసోసియేషన్ నూతన కార్యవర్గ ఎన్నికలు విజయవంతంగా పూర్తయ్యాయి. ఎన్నికల్లో నూతనంగా ఎన్నికైన అధ్యక్షులు, ఉపాధ్యక్షులు, కార్యదర్శి, సంయుక్త కార్యదర్శి, ఆర్గనైజింగ్ కార్యదర్శి, కోశాధికారి, కార్యవర్గ సభ్యులను జిల్లా ఎస్పీ రోహిత్ రాజు అభినందించారు. నూతనంగా ఎన్నికైన కార్యవర్గం పోలీసు అధికారులు, సిబ్బంది సంక్షేమం, సమస్యల పరిష్కారం, సమన్వయం కోసం సమర్థవంతంగా పనిచేయాలని ఎస్పీ ఆకాంక్షించారు. పోలీసు శాఖలో పరస్పర సహకారం, ఐక్యతను మరింత బలోపేతం చేస్తూ విధి నిర్వహణలో స్ఫూర్తిదాయకంగా నిలవాలని సూచించారు. పోలీసు అధికారులు, సిబ్బంది సంక్షేమం కోసం అసోసియేషన్ చేస్తున్న కృషికి జిల్లా పోలీసు శాఖ తరపున పూర్తి సహకారం అందిస్తామని ఎస్పీ తెలిపారు. జిల్లా పోలీసు అధికారులు, సిబ్బంది నూతన కార్యవర్గానికి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఆర్ డిఎస్పి సత్యనారాయణ పోలీస్ అధికారుల సంఘం సభ్యులు మరియు సిబ్బంది పాల్గొన్నారు.

### నూతన కార్యవర్గం ఇదే...

అధ్యక్షులుగా ఎస్. రామకృష్ణ, హెడ్ కానిస్టేబుల్ (ఏడూళ్ళ బయ్యారం) ఉపాధ్యక్షునిగా కృష్ణారావు, (వెల్ఫేర్ రిజర్వ్ ఇన్స్పెక్టర్) పఠాన్ నాగుల్మీరా ఖాన్ (ఎస్ఐ కొమరారం), కార్యదర్శిగా ఎస్సి ఇన్స్పెక్టర్ శ్రీనివాస్, జాయింట్ సెక్రటరీగా బి. శంకర్,( పీసీ కొత్తగూడెం 1టౌన్ పోలీస్ స్టేషన్), ఆర్గనైజింగ్ సెక్రటరీగా కె. వీరేష్ కుమార్,( పీసీ డిఎఆర్ భద్రాద్రి కొత్తగూడెం) కోశాధికారిగా ఎం.డి. రఫీ, హెడ్ కానిస్టేబుల్ (కొత్తగూడెం ట్రాఫిక్ పోలీస్ స్టేషన్), అదేవిధంగా నూతన కార్యవర్గ సభ్యులుగా భద్రాచలం పిసి బి. రవీందర్ , కొత్తగూడెం త్రీ టౌన్ పిసి వై. చిరంజీవి, దమ్మపేట పిసి ఎ. శ్రీ రామకృష్ణారెడ్డి, ఏఎస్సు లక్ష్మీదేవిపల్లి కె. కస్తూరి, ఏఆర్పిసి బి. కృష్ణయ్య, ఏఆర్పిసి ఎం. చంద్రశేఖర్ ఎన్నికయ్యారు.



# వరుస చైన్ స్నాచింగ్ కేసులను ఛేదించిన పోలీసులు

- అంతర్రాష్ట్ర నేరస్తుడు... 8 మంది నిందితుల అరెస్ట్
- రూ.26 లక్షల విలువైన సొత్తు స్వాధీనం ఎస్పీ రోహిత్ రాజు




**భద్రాద్రి కొత్తగూడెం, ఆగస్ట్ 14 (మనంప్రతినిధి):** భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో వరుసగా జరుగుతున్న చైన్ స్నాచింగ్ కేసులను పోలీసులు సమర్థవంతంగా ఛేదించారు. జిల్లా ఎస్పీ రోహిత్ రాజు ఆదేశాల మేరకు, పాల్వంచ డీఎస్పీ సతీష్ కుమార్ ఆధ్వర్యంలో అశ్వారావుపేట, దమ్మపేట, బూర్గంపాడు, పాల్వంచ రూరల్, టేకులపల్లి, కొమరారం, జూలూరుపాడు, చంద్రుగొండ పోలీస్ స్టేషన్ల పరిధిలో నమోదైన వరుస చోరీ కేసులపై ప్రత్యేక దర్యాప్తు చేపట్టిన పోలీసులు నిందితులను గుర్తించి అరెస్ట్ చేశారు. ఈ కేసులకు సంబంధించి మొత్తం 8 మంది నిందితులను అరెస్ట్ చేయగా, మరో నిందితుడు పరారీలో ఉన్నాడు. నిందితుల నుంచి సుమారు 150 గ్రాముల బరువున్న 6 బంగారు గొలుసులను, 3 ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. స్వాధీనం చేసుకున్న సొత్తు మొత్తం విలువ సుమారు రూ.26 లక్షలు ఉంటుందని తెలిపారు. ప్రధాన నిందితుడు సున్నం నాగేంద్రబాబు అలియాస్ నాగేంద్ర తన సహచరులతో కలిసి రాత్రి వేళల్లో ఇళ్ల బయట నిద్రిస్తున్న మహిళలను లక్ష్యంగా చేసుకుని చోరీలకు పాల్పడేవాడని దర్యాప్తులో వెల్లడైంది. మహిళల మెడలోని బంగారు గొలుసులను ఎలక్ట్రిక్ వైర్ కట్టర్తో కట్ చేసి క్షణాల్లో అపహరించి, ద్విచక్ర వాహనాలపై అక్కడి నుంచి పరారయ్యేవారు. కొన్ని సందర్భాల్లో ముందుగానే ద్విచక్ర వాహనాలను చోరీ చేసి, వాటిని తదుపరి నేరాలకు ఉపయోగించినట్లు పోలీసులు గుర్తించారు.

చోరీ చేసిన బంగారు ఆభరణాలను నిందితులు తమ వద్ద ఉంచుకోకుండా, ముఠాకు సహకరిస్తున్న మహిళల వద్ద దాచిపెట్టినట్లు దర్యాప్తులో తేలింది. నిందితుల విచారణలో దమ్మపేట, బూర్గంపాడు, పాల్వంచ రూరల్, టేకులపల్లి, కొమరారం, జూలూరుపాడు, చంద్రుగొండ పోలీస్ స్టేషన్ల పరిధిలో నమోదైన మొత్తం 10 కేసులకు సంబంధించి కీలక ఆధారాలు లభించాయి. ఈ ముఠాలో ప్రధాన నిందితుడైన సున్నం నాగేంద్రబాబు, వయస్సు 35 సంవత్సరాలు, ఉసిర్లగూడెం గ్రామం, అశ్వారావుపేట మండలానికి చెందిన వ్యక్తిగా పోలీసులు గుర్తించారు. ఇతనిపై అశ్వారావుపేట, దమ్మపేట, ములకలపల్లి, బూర్గంపాడు, పాల్వంచ, భద్రాచలం, టేకులపల్లి, కొమరారం, జూలూరుపాడు, చంద్రుగొండతో పాటు తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లోని పలు పోలీస్ స్టేషన్ల పరిధిలో మొత్తం 83 దొంగతనం కేసులు ఉన్నట్లు దర్యాప్తులో వెల్లడైంది. ఈ కేసుల్లో మరో నిందితుడైన తమ్మిశెట్టి బాలవీరస్వామి, వయస్సు 50 సంవత్సరాలు, మాధాల గ్రామం, ముప్పాళ్ల మండలం, పల్నాడు జిల్లా, ఆంధ్రప్రదేశ్కు చెందిన వ్యక్తి ప్రస్తుతం పరారీలో ఉన్నాడు. ఇతను అంతర్రాష్ట్ర నేరస్తుడిగా గుర్తించామని, అతని కోసం ప్రత్యేక బృందాలతో గాలింపు చర్యలు కొనసాగుతున్నాయని ఎస్పి తెలిపారు. దర్యాప్తులో భాగంగా పార్కలగండి, దమ్మపేట పరిధిలో వృద్ధ మహిళను లక్ష్యంగా చేసుకుని బంగారు నానుతాడు చోరీ చేసినట్లు, బూర్గంపాడు పరిధిలో ద్విచక్ర వాహనం చోరీ చేసినట్లు, పాల్వంచ రూరల్ పరిధిలో మరో ద్విచక్ర వాహనాన్ని చోరీ చేసినట్లు పోలీసులు గుర్తించారు. అనంతరం చోరీ చేసిన వాహనాలను ఉపయోగించి బూర్గంపాడు, టేకులపల్లి, కొమరారం, జూలూరుపాడు, చంద్రుగొండ ప్రాంతాల్లో మహిళల మెడలోని బంగారు గొలుసులను చోరీ చేసినట్లు దర్యాప్తులో వెల్లడైంది. చంద్రుగొండ పోలీస్ స్టేషన్ పరిధిలోని సీతాయిగూడెం కేసులో ప్రధాన నిందితుడి వద్ద నుంచి 24 గ్రాముల బంగారు చైన్ను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. అదేవిధంగా ఇతర కేసుల్లో చోరీ చేసిన బంగారు ఆభరణాలను నిందితుల సహకారంతో వివిధ ప్రాంతాల్లో దాచిపెట్టినట్లు గుర్తించి వాటిని స్వాధీనం చేసుకున్నారు. వరుస చైన్ స్నాచింగ్ కేసులను సమర్థవంతంగా ఛేదించి నిందితులను అరెస్ట్ చేయడంతో పాటు భారీ మొత్తంలో చోరీ సొత్తును స్వాధీనం చేసుకున్న పోలీసు అధికారులు, సిబ్బందిని జిల్లా ఎస్పీ రోహిత్ రాజు అభినందించారు. ఈ కేసుల ఛేదనలో పాల్వంచ డీఎస్పీ సతీష్ కుమార్, అశ్వారావుపేట సీఐ నాగరాజు, ఎస్ఐలు రాజేశ్ కుమార్, యయాతి రాజు, బాలస్వామినాథం, దేవ్ సింగ్, హెచ్సీ ప్రసాద్, పీసీలు వెంకట్,ధర్మారావు, లక్ష్మయ్య, రామకృష్ణారెడ్డి, బాలకృష్ణ, నరసింహారావు, డబ్ల్యూపీసీ మౌనిక తదితరులు పాల్గొన్నారు.

## స్వాతంత్ర్య వేడుకల్లో రూ.859.22 కోట్ల విలువైన

# ఆస్తులు, ప్రయోజనాల పంపిణీ

## జిల్లా జాయింట్ కలెక్టర్ ఆదర్శ రాజేంద్రన్



**చిత్తూరు, ఆగస్టు 14 మనం న్యూస్:** 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల పురస్కరించుకుని ఆగస్టు 15న పోలీస్ పరేడ్ గ్రౌండ్స్లో వివిధ ప్రభుత్వ శాఖల ఆధ్వర్యంలో అర్హులైన లబ్ధిదారులకు భారీగా ఆస్తులు, ఆర్థిక ప్రయోజనాలు పంపిణీ చేయుచున్నామని జిల్లా జాయింట్ కలెక్టర్ ఆదర్శ రాజేంద్రన్ పేర్కొన్నారు. శుక్రవారం 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల పురస్కరించుకుని ఆగస్టు 15న పోలీస్ పరేడ్ గ్రౌండ్స్లో వివిధ ప్రభుత్వ శాఖల సంబంధించిన ముందస్తు ఏర్పాట్లలో భాగంగా జాయింట్ కలెక్టర్ స్టాల్స్ ను పరిశీలించారు ఈ సందర్భంగా జెసి మాట్లాడుతూ ప్రజలు, పుర ప్రముఖులు, విద్యార్థులు, స్వాతంత్ర సమరయోధులు, స్థానిక ప్రజా ప్రతినిధులు,80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల పాల్గొని కార్యక్రమాలను విజయవంతం చేయాలి తెలిపారు డీఆర్డీఏ ఆధ్వర్యంలో బ్యాంక్ లింకేజీ, ఉన్నతి, స్త్రీనిధి పథకాల ద్వారా మొత్తం 8,188 సంఘాలకు చెందిన 53,029 మంది సభ్యులకు రూ.777.81 కోట్ల విలువైన ప్రయోజనాలు అందించనున్నారు. ఇందులో బ్యాంక్ లింకేజీ కింద 3,676 స్వయం సహాయక సంఘాలు, 32,972 మంది సభ్యులకు రూ.584.79 కోట్ల ప్రయోజనాలు, ఉన్నతి పథకం కింద 421 మంది సభ్యులకు రూ.3.54 కోట్ల ప్రయోజనాలు, స్త్రీనిధి పథకం కింద 4,512 స్వయం సహాయక సంఘాలు, 19,636 మంది సభ్యులకు రూ.189.48 కోట్ల ప్రయోజనాలు ఉన్నాయి.మెప్మా ఆధ్వర్యంలో బ్యాంక్ లింకేజీ, ప్రత్యేక ప్రాజెక్టుల ద్వారా మొత్తం 665 గ్రూపులు, 647 మంది సభ్యులకు రూ.80.60 కోట్ల విలువైన ప్రయోజనాలను అందించనున్నారు. బ్యాంక్ లింకేజీ కింద 665 స్వయం సహాయక సంఘాలకు రూ.76.60 కోట్లు, కింద 599 మంది సభ్యులకు రూ.1.58 కోట్లు, ప్రత్యేక ప్రాజెక్టుల కింద 48 యూనిట్లకు రూ.2.42 కోట్ల విలువైన ప్రయోజనాలు అందనున్నాయి. జిల్లా పరిషత్ ఆధ్వర్యంలో ఈ-ఆటో పథకం కింద 25 మంది సభ్యులకు రూ.0.79 కోట్ల విలువైన ఈ-ఆటోలను అందించనున్నారు.

# స్వాతంత్య్ర వేడుకల్లో రూ.859.22 కోట్ల విలువైన ఆస్తులు, ప్రయోజనాల పంపిణీ

- జిల్లా జాయింట్ కలెక్టర్ ఆదర్శ రాజేంద్రన్



**చిత్తూరు, ఆగస్టు 14 మనం న్యూస్:** 80వ స్వాతంత్య్ర దినోత్సవ వేడుకల పురస్కరించుకుని ఆగస్టు 15న పోలీస్ పరేడ్ గ్రౌండ్స్లో వివిధ ప్రభుత్వ శాఖల ఆధ్వర్యంలో అర్హులైన లబ్ధిదారులకు భారీగా ఆస్తులు, ఆర్థిక ప్రయోజనాలు పంపిణీ చేయుచున్నామని జిల్లా జాయింట్ కలెక్టర్ ఆదర్శ రాజేంద్రన్ పేర్కొన్నారు. శుక్రవారం 80వ స్వాతంత్య్ర దినోత్సవ వేడుకల

పురస్కరించుకుని ఆగస్టు 15న పోలీస్ పరేడ్ గ్రౌండ్స్లో వివిధ ప్రభుత్వ శాఖల సంబంధించిన ముందస్తు ఏర్పాట్లలో భాగంగా జాయింట్ కలెక్టర్ స్టాల్స్ ను పరిశీలించారు ఈ సందర్భంగా జెసి మాట్లాడుతూ ప్రజలు, పుర ప్రముఖులు, విద్యార్థులు, స్వాతంత్ర సమరయోధులు, స్థానిక ప్రజా ప్రతినిధులు,80వ స్వాతంత్య్ర దినోత్సవ వేడుకల పాల్గొని కార్యక్రమాలను విజయవంతం చేయాలి తెలిపారు

డీఆర్డీఏ ఆధ్వర్యంలో బ్యాంక్ లింకేజీ, ఉన్నతి, స్త్రీనిధి పథకాల ద్వారా మొత్తం 8,188 సంఘాలకు చెందిన 53,029 మంది సభ్యులకు రూ.777.81 కోట్ల విలువైన ప్రయోజనాలు అందించనున్నారు. ఇందులో బ్యాంక్ లింకేజీ కింద 3,676 స్వయం సహాయక సంఘాలు, 32,972 మంది సభ్యులకు రూ.584.79 కోట్ల ప్రయోజనాలు, ఉన్నతి పథకం కింద 421 మంది సభ్యులకు రూ.3.54 కోట్ల ప్రయోజనాలు, స్త్రీనిధి పథకం కింద 4,512 స్వయం సహాయక సంఘాలు, 19,636 మంది సభ్యులకు రూ.189.48 కోట్ల ప్రయోజనాలు ఉన్నాయి.మెప్మా ఆధ్వర్యంలో బ్యాంక్ లింకేజీ, ప్రత్యేక ప్రాజెక్టుల ద్వారా మొత్తం 665 గ్రూపులు, 647 మంది సభ్యులకు రూ.80.60 కోట్ల విలువైన ప్రయోజనాలను అందించనున్నారు. బ్యాంక్ లింకేజీ కింద 665 స్వయం సహాయక సంఘాలకు రూ.76.60 కోట్లు, కింద 599 మంది సభ్యులకు రూ.1.58 కోట్లు, ప్రత్యేక ప్రాజెక్టుల కింద 48 యూనిట్లకు రూ.2.42 కోట్ల విలువైన ప్రయోజనాలు అందనున్నాయి.

జిల్లా పరిషత్ ఆధ్వర్యంలో ఈ-ఆటో పథకం కింద 25 మంది సభ్యులకు రూ.0.79 కోట్ల విలువైన ఈ-ఆటోలను అందించనున్నారు.

# తిరుపతి జిల్లాలో గంజాయి అక్రమ రవాణాపై పోలీసుల కఠిన చర్యలు

**తిరుపతి రూరల్ ఆగస్టు 14 మనం న్యూస్:** తిరుచానూరు పోలీస్ స్టేషన్ పరిధిలో శుక్రవారం అందిన విశ్వసనీయ సమాచారం మేరకు పోలీసులు, రెవెన్యూ అధికారుల సమక్షంలో పద్మావతి పురం స్మశానం వద్ద ఐదు మంది ముద్దయులను అరెస్ట్ చేసి మొత్తం 5 కిలోల గంజాయిని స్వాదీనము చేసుకున్నాము. ప్రధాన నిందితుడైన అరుగొండం సోమశేఖర్ శ్రీకాళహస్తి ప్రాంతం నుంచి గంజాయి తీసుకువచ్చి తిరుపతి, రేణిగుంట పరిసరాల్లో విక్రయిస్తున్నట్లు దర్యాప్తులో వెల్లడైంది. ఈ కేసులో అరుగొండం సోమశేఖర్, అక్కల రథసారధి, షేక్ ఫైరోజ్ ఫైరు, పన్నూరు లీలాక్రిష్ణ, గురివింటి చరణ్ తేజ్లను అరెస్ట్ చేశారు.

- వెస్ట్ పోలీసులు - 13 కిలోల గంజాయి స్వాధీనం.

వెస్ట్ పోలీస్ స్టేషన్ పరిధిలో ప్రత్యేక నిఘాలో బాగంగా శుక్రవారం మెటర్నిటీ హాస్పిటల్ రోడ్డు,




రాజన్న పార్కు వెనుక ప్రాంతంలో నలుగురిని పోలీసులు అరెస్ట్ చేసి వారి వద్ద నుంచి 13 కిలోల డ్రై గంజాయి, 4 సెల్ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు.

ఈ కేసులో కొండామర్రి జగదీష్, గొడ్ల పార్థసారథి అలియాస్ పార్థు, షేక్ ఇర్ఫాన్, బడి పోలయ్యలను అరెస్ట్ చేశారు. పోలయ్య విశాఖపట్టణం ప్రాంతానికి చెందినవాడు, ఇతను అక్కడ నుంచి గంజాయిని తిరుపతి లో ముద్దాయిలకు విక్రయించేందుకు తీసుకోచ్చారు అని దర్యాప్తులో వెల్లడైంది. ఈ ఘటనపై ఎన్ డి పి ఎస్ యాక్ట్ -1985 కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.ఈ కేసులకు సంబంధించిన వివరాలను తిరుపతి ఎస్పీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన పత్రికా సమావేశంలో అదనపు ఎస్పీలు శ్రీనివాసులు (పరిపాలన), కె. రవి మనోహరాచారి (శాంతి భద్రతలు) వెల్లడించారు.

# హెల్మెట్ ధరించడం ప్రతి ఒక్కరి బాధ్యత

- జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్

**చిత్తూరు, ఆగస్టు 14.మనం న్యూస్:** రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రతి ఒక్కరూ హెల్మెట్ ధరించి, ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్, సూచించారు. సురక్షిత చిత్తూరు - మీ భద్రత మా బాధ్యత కార్యక్రమంలో భాగంగా చిత్తూరు జిల్లా పోలీసుల ఆధ్వర్యంలో కార్వేటినగరం మండలం అమ్మపల్లి క్రాస్ వద్ద 1000 మందికి ఉచితంగా హెల్మెట్లు పంపిణీ చేశారు. అనంతరం 1000 మంది ద్విచక్ర వాహనదారులతో అమ్మపల్లి క్రాస్ నుంచి కార్వేటినగరం పోలీస్ స్టేషన్ వరకు మెగా హెల్మెట్ బైక్ ర్యాలీ నిర్వహించారు.జిల్లా ఎస్పీ తుషార్ డూడి,అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్, జి.డి. నెల్లూరు ఎమ్మెల్యే థామస్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా పారిశ్రామికవేత్త మాదిరాజు గణేష్ రాజు,కుమార్ రాజు 1000 హెల్మెట్లను ఉచితంగా వితరణ చేశారు.

**రోడ్డు ప్రమాదం ఒక కుటుంబ భవిష్యత్తును మార్చేస్తుంది - కలెక్టర్**

జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ మాట్లాడుతూ, గత ఐదు సంవత్సరాల రోడ్డు ప్రమాద గణాంకాలను పరిశీలిస్తే చిత్తూరు జిల్లాలో ప్రతి



ఏడాది సుమారు 350 మంది రోడ్డు ప్రమాదాల్లో ప్రాణాలు కోల్పోతున్నారని తెలిపారు. వీరిలో 150 నుంచి 170 మంది వరకు ద్విచక్ర వాహనదారులే ఉన్నారని, అదనంగా ప్రతి ఏడాది 400 నుంచి 450 మంది ద్విచక్ర వాహనదారులు తీవ్రంగా గాయపడుతున్నారని పేర్కొన్నారు.

రోడ్డు ప్రమాదం ఒక వ్యక్తికి జరిగిన విషాదం మాత్రమే కాదని, దాని ప్రభావం మొత్తం కుటుంబంపై పడుతుందని కలెక్టర్ అన్నారు. కుటుంబాన్ని పోషించే వ్యక్తి ప్రమాదానికి గురైతే ఆ కుటుంబం ఆర్థికంగా, సామాజికంగా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొనే అవకాశం ఉందన్నారు. హెల్మెట్, సీట్ బెల్ట్ వంటి రక్షణ చర్యలను తప్పనిసరిగా పాటిస్తూ ట్రాఫిక్ నిబంధనలను గౌరవించాలని సూచించారు.

# రజకులను షెడ్యూల్ కులాల జాబితాలో చేర్చడానికి సిపిఐ మద్దతు ఇవ్వండి

**తిరుపతి ఆగస్టు 14మనం న్యూస్:** రజకుల కులాన్ని షెడ్యూల్ కులాల జాబితాలో చేర్చడానికి సిపిఐ మద్దతు ప్రకటించాలని కోరుతూ సిపిఐ రాష్ట్ర కార్యదర్శి గుజ్జల ఈశ్వరయ్యకు శుక్రవారం ప్రవేట్ హోటల్ నందు ఆంధ్రప్రదేశ్ ఎస్సీ సాధన కమిటీ కన్వీనర్ అక్కినపల్లి లక్ష్మయ్య, కోర్ కమిటీ సభ్యులు పి షణ్ముగం పాత్రలో ప్రతినిధి బృందం వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా అక్కనపల్లి లక్ష్మయ్య మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు కు పార్టీపరంగా లేఖ రాస్తానని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి తెలియజేయడం జరిగిందని వివరించారు. అట్టడుగు వర్గాలలో అత్యంత వెనుకబడిన సామాజికంగా అన్ని రకాల ఇబ్బందులు పడుతున్న రజక కులాన్ని భారతదేశంలోని ఇతర 18 రాష్ట్రాల నందు అలాగే మూడు కేంద్రపాలిత ప్రాంతాల్లో



ఉన్న విధంగా ఆంధ్రప్రదేశ్లో కూడా రజకులను షెడ్యూల్ కులాల జాబితాలో చేర్చాలని తమ డిమాండ్ అని వివరించారు. అలాగే ప్రభుత్వం ఇచ్చిన మాటకు కట్టుబడి తక్షణం కమిషన్ ఏర్పాటు చేసి అసెంబ్లీలో తీర్మానం చేయాలని కోరారు అదేవిధంగా కేంద్ర ప్రభుత్వానికి సిఫారస్ చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో కోరి కమిటీ సభ్యులు మల్లెల నాగరాజు రాష్ట్ర రజక ఉద్యోగ సంఘం అధ్యక్షులు గంధం బాబు ,మనోహర్, సురేంద్ర, నారాయణ ,అనురాధ ,శేఖర్, రవి, తదితరులుపాల్గొన్నారు.



# దేశభక్తి మన ఊపిరి... తిరంగా మన గర్వం

- కూటమి పార్టీల ఆధ్వర్యంలో నగరంలో భారీ 'తిరంగా బైక్ ర్యాలీ'

**తిరుపతి,ఆగస్ట్ 14 మనం న్యూస్:** జాతీయ జెండా మన గౌరవానికి ప్రతీక... దాన్ని భుజానికెత్తుకుని దేశం కోసం నిలబడడమే దేశభక్తి అని కూటమి పార్టీల నాయకులు పిలుపునిచ్చారు. రాష్ట్ర తెలుగుదేశం పార్టీ పిలుపు మేరకు తిరుపతి ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు, శాప్ ఛైర్మన్ రవి నాయుడు, యాదవ కార్పొరేషన్ ఛైర్మన్ నరసింహ యాదవ్ ఆధ్వర్యంలో తిరుపతి నియోజకవర్గ ఇన్చార్జ్ జె బి శ్రీనివాస్ ఆదేశాలతో శుక్రవారం సాయంత్రం తిరుపతి నగరంలో భారీ 'తిరంగా బైక్ ర్యాలీ' నిర్వహించారు. ఎన్టీఆర్ కూడలి నుంచి ప్రకాశం రోడ్డు, పంచముఖ ఆంజనేయ స్వామి వారి ఆలయం, గాంధీ రోడ్డు, నాలుగు కాళ్ళ మండపం మీదుగా శ్రీదేవి కాంప్లెక్స్ వరకు జనసంద్రోహం నడుమ త్రివర్ణ పతాకాలతో ర్యాలీ సాగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ స్వాతంత్య్ర దినోత్సవ వేడుకల్లో భాగంగా దేశభక్తిని చాటడం, జాతీయ సమైక్యతను పెంపొందించడానికి కూటమి పార్టీల పిలుపుమేరకు ఘనంగా ర్యాలీ చేశామన్నారు. ప్రతి పౌరుడు తాను పుట్టిన భారతదేశానికి సేవ చేసేందుకు ముందుంటారని అన్నారు. ఐక్యతతో దేశ రాష్ట్ర అభివృద్ధి కి కూటమి ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో తాతయ్య గుంట ఆలయ ఛైర్మన్ మహేష్ యాదవ్, కాపు కార్పొరేషన్ డైరెక్టర్, వరప్రసాద్, తోట వాసు, మొదలియార్ కార్పొరేషన్ డైరెక్టర్ ఎస్వీఎం శ్రీధర్, మాజీ డిప్యూటీ మేయర్ ఆర్సీ మునికృష్ణా, జనసేన నగర అధ్యక్షులు రాజా రెడ్డి, ఆముదాల తులసి, ఆముదాల వెంకటేష్, సుధాకర్,అంకాలమ్మ దేవాలయం చైర్మన్ కొండా రాజమోహన్, ఎన్డీఏ కూటమి నాయకులు రఘు, మాజీ కార్పొరేటర్లు నరసింహాచారి, నరేంద్ర, మహిళా నాయకురాళ్లు భారతి, యశోద, అనిత, రేవతి, రేఖ కూటమి పార్టీల యువత పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# గ్రామీణ వ్యాపారులకు తోడుగా ట్రేడ్ లైసెన్స్

- వ్యాపారానికి రక్ష, రుణాలకు దారి

**చంద్రగిరి ఆగస్టు14మనం న్యూస్:** గ్రామ పంచాయతీల నుండి ఎటువంటి ముందస్తు అనుమతి లేకుండా గ్రామీణ ప్రాంతాల్లో వివిధ రకాల వ్యాపారాలు నిర్వహిస్తున్న వారిని గుర్తించి స్వర్ణ పంచాయతీ పోర్టల్ ద్వారా డిజిటల్ ట్రేడ్ లైసెన్స్ సర్టిఫికెట్ స్యాచురేషన్ పద్ధతిలో మంజూరు చేయుటకు ఆంధ్రప్రదేశ్ పంచాయతీరాజ్ శాఖ చర్యలు చేపట్టింది.

ఇందులో భాగంగా ప్రాథమికంగా చంద్రగిరి మండలంలోని మిట్టపాలెం, ఎ రంగంపేట గ్రామపంచాయతీలలో అన్ని రకాల వ్యాపారస్తులను గుర్తించి వారికి డిజిటల్ ట్రేడ్ లైసెన్స్ సర్టిఫికెట్ల ఆవశ్యకత పై అవగాహన,సర్టిఫికేట్లను అందించే కార్యక్రమం




కందులవారి పల్లె పంచాయతీలోని మీటింగ్ హాలు నందు జరిగింది. ఈ కార్యక్రమంలో మిట్టపాలెం, ఎ రంగంపేట గ్రామపంచాయతీ లోని ప్రాంతాలలో కిరాణా దుకాణాలు, రైస్/ఆయిల్ మిల్లులు, టీ స్టాళ్లు, చిన్న హోటళ్లు, వెల్డింగ్/ఫ్యాబ్రికేషన్ వర్క్షాప్లు, పెట్రోల్ బంకులు, గ్యాస్ ఏజెన్సీలు, టైలరింగ్ షాపులు, సెలూన్లు మొ అన్ని రకాల వ్యాపారస్తులు పాల్గొన్నారు. ట్రేడ్ లైసెన్స్ వ్యాపారవేత్తలకు ఒక నిర్దిష్ట ప్రదేశంలో నిర్దిష్ట వ్యాపార కార్యకలాపాన్ని నిర్వహించడానికి గ్రామ పంచాయతీ జారీ చేసే చట్టపరమైన అనుమతి పత్రం. ఈ పత్రం పొందడం ద్వారా ఆరోగ్యం, భద్రత, పరిశుభ్రత సంబంధిత స్థానిక నిబంధనలను వ్యాపారులు పాటిస్తారని నిర్ధారిస్తుంది అలానే నిర్దిష్ట స్థలం ఆ రకమైన వ్యాపార కార్యకలాపానికి అనుమతించబడిందని ధృవీకరిస్తుంది.

# తిరుమల డ్యూటీలకు వెళ్లే ఉద్యోగ, కార్మికులకు ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేయాలి

- ఆర్టీసీ ఆర్ఎం కార్యాలయం వద్ద సీఐటీయూ ధర్నా

**తిరుపతి ఆగస్టు 14 మనం న్యూస్:** తిరుమలలో విధులు నిర్వహించే ఉద్యోగులు, కాంట్రాక్ట్ కార్మికులకు ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేయాలని, సమయానికి విధులకు చేరుకునేలా రవాణా సౌకర్యాలు మెరుగుపరచాలని డిమాండ్ చేస్తూ టీటీడీ కాంట్రాక్ట్ వర్కర్స్ ఎంప్లాయిస్ యూనియన్ (సీఐటీయూ) ఆధ్వర్యంలో నేడు తిరుపతి ఆర్టీసీ ఆర్ఎం కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి టి సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ తిరుమల డ్యూటీలకు వెళ్లే కార్మికులు తెల్లవారుజామునే సిద్ధమై బస్సుల కోసం గంటల తరబడి వేచి ఉండాల్సి వస్తోందని, సరైన సమయానికి బస్సులు లేక విధులకు ఆలస్యంగా చేరుకుంటున్నారని తెలిపారు. సాధారణ బస్సులు కొన్ని




ప్రాంతాల్లో ఆగకుండా ఫ్లైఓవ్వ నుంచి వెళ్లిపోతున్నాయని, బస్సుల్లో రద్దీ ఎక్కువగా ఉంటోందని, ఏసీ బస్సుల్లో ఉద్యోగులు, కార్మికులను అనుమతించకపోవడంతో మరింత ఇబ్బందులు ఎదురవుతున్నాయని అన్నారు. ఐదు నిమిషాలు ఆలస్యమైనా ఎఫ్ఆర్ఎస్లో గైర్హాజరు నమోదు చేసి పనిష్మెంట్లు విధించడం అన్యాయమని పేర్కొన్నారు.

# బ్రహ్మోత్సవాల నేపథ్యంలో తిరుమలలో స్వచ్ఛతపై ప్రత్యేక దృష్టి

- రియల్టైమ్లో ఫిర్యాదుల పరిష్కారానికి 'నందకం' యాప్
- టీటీడీ అదనపు ఈవో సి.హెచ్. వెంకయ్య చౌదరి

**తిరుమల,ఆగస్ట్ 14 మనం న్యూస్:** వచ్చే నెల 15వ తేదీ నుంచి ప్రారంభం కానున్న శ్రీవారి బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని తిరుమలలో పారిశుద్ధ్య నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారించినట్లు టీటీడీ అదనపు ఈవో సి.హెచ్. వెంకయ్య చౌదరి తెలిపారు.

శుక్రవారం తిరుమలలోని శ్రీ పద్మావతి అతిథి గృహంలో గల సుధర్మ



సమావేశ మందిరంలో పారిశుద్ధ్య విభాగం అధికారులు, సంబంధిత ఏజెన్సీలతో ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా తిరుమలలో పారిశుద్ధ్య నిర్వహణలో నాణ్యతా ప్రమాణాలు పెంపొందించడంపై ఆయన అధికారులకు పలు సూచనలు చేశారు.

అనంతరం అదనపు ఈవో మాట్లాడుతూ తిరుమలను మరింత స్వచ్ఛంగా తీర్చిదిద్దేందుకు అవసరమైన చర్యలపై ఏజెన్సీల ప్రతినిధులతో చర్చించినట్లు చెప్పారు. తిరుమల పవిత్రతకు, స్వచ్ఛతకు మారుపేరుగా నిలిచేలా మరింత మెరుగైన పారిశుద్ధ్య కార్యకలాపాలు చేపట్టాలని సూచించినట్లు తెలిపారు. ఇందుకోసం అవసరమైన మెటీరియల్స్, ఆధునిక యంత్రాల వినియోగంపై కూడా చర్చించినట్లు వివరించారు.

# కలికిరి లో ఘనంగా ముందస్తు స్వాతంత్య్ర దినోత్సవ వేడుకలు



**కలికిరి ఆగస్టు 14 మనం న్యూస్:** స్థానిక ఎస్.డబ్ల్యూ.ఆర్. ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో ముందస్తు స్వాతంత్య్ర దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. కళాశాల విద్యార్థినులు ఉత్సాహంగా ర్యాలీ నిర్వహించి, మహాత్మా గాంధీ మరియు డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ విగ్రహాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. అనంతరం కళాశాల ప్రాంగణంలో పలు క్రీడా పోటీలు నిర్వహించారు. దేశభక్తిని ప్రతిబింబించేలా భారతదేశ పటాన్ని దీపాలతో అలంకరించడం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. విద్యార్థినులు దేశభక్తి గీతాలు, సాంస్కృతిక కార్యక్రమాలు తదితర కార్యక్రమాల్లో ఉత్సాహంగా పాల్గొన్నారు. ఎస్ డబ్ల్యు ఆర్ డిగ్రీ కళాశాల నుండి భారీ త్రివర్ణ పతాకం చేపట్టి పట్టణంలో భారీ తిరంగ ర్యాలీ నిర్వహించారు. స్థానిక నాలుగు రోడ్ల కూడలిలో విద్యార్థినులందరూ త్రివర్ణ పతాకంతో మానవహారం నిర్వహించారు.

# కొర్లగుంటలో భక్తిశ్రద్ధలతో సామూహిక వరలక్ష్మీ వ్రతం

**తిరుపతి: ఆగస్ట్ 14, మనం న్యూస్:** మహిళల్లో ఆధ్యాత్మిక భావనను పెంపొందించడంతో పాటు సమాజంలో పరస్పర సహకారాన్ని చాటేలా స్థానిక కొర్లగుంటలోని ప్రసన్న భారతి పాఠశాల వేదికగా రాస్ మహిళా సంఘాల ఆధ్వర్యంలో శ్రావణమాస వేడుకలు అత్యంత వైభవంగా జరిగాయి. శ్రావణ శుక్రవారాన్ని పురస్కరించుకుని ఇక్కడ నిర్వహించిన సామూహిక వరలక్ష్మీ వ్రతం కార్యక్రమం సర్వత్రా ఆకట్టుకుంది. ఈ వేడుకకు చుట్టుపక్కల ప్రాంతాల నుంచి దాదాపు 300 మంది మహిళలు పెద్దఎత్తున తరలివచ్చి భక్తిశ్రద్ధలతో వరలక్ష్మీ దేవిని పూజించారు.



**ఆధ్యాత్మికతతో పాటు పొదుపు ముఖ్యం:డాక్టర్ ఎస్. వెంకటరత్నం**

ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన రాస్ ప్రధాన కార్యదర్శి డాక్టర్ ఎస్. వెంకటరత్నం జ్యోతి ప్రజ్వలన చేసి వేడుకలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మహిళల జీవితంలో క్రమశిక్షణతో పాటు ఆధ్యాత్మిక చింతన ఎంతో కీలకమైనదన్నారు. శ్రావణమాసం పవిత్రతను చాటుతూ ఇంత భారీ సంఖ్యలో మహిళలు ఒకచోట చేరి పూజలు నిర్వహించడం అభినందనీయమని కొనియాడారు.

## పసిఫిక్ దీవిలో పుతిన్ పర్యటనపై
# జపాన్ అసహనం



**మాస్కో, ఆగష్టు 14:** రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ గురువారం నాడు తొలిసారిగా పసిఫిక్ మహా సముద్రంలోని కురిల్ దీవులను సందర్శించారు, రష్యా నియంత్రణలో ఉన్న ఈ ద్వీప సమూహం తనదేనని జపాన్ వాదిస్తోంది. అందుకే పుతిన్ పర్యటనపై ఆ దేశం నిరసన తెలిపింది. పుతిన్ ఈ ద్వీప సమూహంలో దక్షిణ కొసన ఉన్న ఇటురుప్ దీవిలో చేపల కర్మాగారం, ఆసుపత్రి, పాఠశాలను సందర్శించారు. స్థానిక ప్రజలతో సంభాషించారు. కురిల్ ద్వీప సమూహంలో దక్షిణాగ్రాన ఉన్న నాలుగు దీవులు జపాన్ తనవేనంటోంది. వీటిని వారు ఉత్తర భూభాగాలు అని పిలుస్తారు. రెండవ ప్రపంచ యుద్ధం చివరి రోజుల్లో సోవియట్ యూనియన్ వాటిని జపాన్ నుంచి స్వాధీనం చేసుకుంది. ఈ వివాదం కారణంగా రెండో ప్రపంచ యుద్ధం తరవాత రెండు దేశాలు శాంతి ఒప్పందంపై సంతకం చేయలేకపోయాయి. పైగా ఇటీవలి సంవత్సరాల్లో రష్యా కురిల్ దీవుల్లో తన సైనిక బలగాలను పెంచింది. జపాన్ విదేశాంగ మంత్రి తోషిమిత్సు మొటెగి మాట్లాడుతూ.. ఇటురుప్‌లో పుతిన్ పర్యటనను తమ దేశం తీవ్రంగా నిరసిస్తోందని స్పష్టం చేశారు.

## 2 సీటర్ విమాన ప్రమాద మృతులు భారతీయ యువకులుగా గుర్తింపు



**లండన్, ఆగష్టు 14:** తూర్పు ఇంగ్లాండ్‌లోని ఎస్సెక్స్ ప్రాంత ఒంగర్ పట్టణం వద్ద గత జూన్ నెల 30వ తేదీన జరిగిన 2 సీటర్ సెస్నా విమాన ప్రమాదంలో మృతులను భారతీయ యువకులుగా గుర్తించినట్లు పోలీసులు గురువారం వెల్లడించారు. ఈ విమానాన్ని పైలట్ డయాన్ పటేల్ (26) నడపగా, వంశీ మండల (24) అనే విద్యార్థి అందులో ప్రయాణించారు. వంశీ యూనివర్సిటీ చదువు పూర్తిచేసుకున్న సందర్భాన్ని వేడుకగా జరుపుకొనేందుకు చిన్నపాటి విమానయాత్రగా వీరు నార్త్ వీల్ ఎయిర్‌ఫీల్డ్ నుంచి బయలుదేరిన కొద్దిసేపటికే ఈ ప్రమాదం జరిగినట్లుగా ఎస్సెక్స్ పోలీస్ డిటెక్టివ్ చీఫ్ సూపరింటెండెంట్ మోర్గాన్ క్రోనిన్ తెలిపారు. తీవ్రగాయాలతో యువకులు ఇద్దరూ అక్కడికక్కడే మరణించినట్లు పేర్కొన్నారు. బాధిత కుటుంబాలు ఈ కేసు విచారణకు వర్చువల్ పద్ధతిలో హాజరయ్యాయి.

## భారత్‌కు రానున్న ఇరాన్ అధ్యక్షుడు పెజెష్కియాన్!



**టెహ్రాన్, ఆగష్టు 14:** ఇరాన్ అధ్యక్షుడు మసూద్ పెజిష్కియాన్ త్వరలో భారత్‌లో పర్యటించనున్నారు. సెప్టెంబర్లో ఢిల్లీలో జరిగే బ్రిక్స్ సదస్సుకు ఆయన హాజరు కానున్నట్లు సంబంధిత వర్గాలు వెల్లడించాయి. పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు నెలకొన్న వేళ భారత్ అధ్యక్షతన జరిగే అంతర్జాతీయ సదస్సులో ఆయన పాల్గొనడం ప్రాధాన్యం సంతరించుకుంది. అక్టోబర్ 2024లో రష్యాలో జరిగిన బ్రిక్స్ సదస్సు సందర్భంగా భారత ప్రధాని నరేంద్ర మోడీతో ఇరాన్ అధ్యక్షుడు భేటీ అయ్యారు. ద్వైపాక్షిక సంబంధాలు, ప్రాంతీయ అంశాలపై చర్చించారు. గతేడాది బ్రెజిల్ వేదికగా ఈ సదస్సు జరగగా.. అనంతరం ఈ ఏడాది అధ్యక్ష బాధ్యతలను భారత్ స్వీకరించింది. బ్రిక్స్ కూటమిలో 2024లో ఇరాన్‌తోపాటు ఈజిప్టు, ఇథియోపియా, యూఏఈ దేశాలు చేరాయి. గతేడాది ఇండోనేసియా కూడా ఇందులో చేరింది. దీంతో ప్రస్తుతం పూర్తిస్థాయి సభ్యదేశాల సంఖ్య 11కు చేరింది. ఇదిలా ఉంటే, రెండు నెలల క్రితం ఢిల్లీలో జరిగిన బ్రిక్స్ దేశాల విదేశాంగ మంత్రుల సమావేశంలో పాల్గొనేందుకు ఇరాన్ విదేశాంగ మంత్రి అబ్బాస్ అరాగ్చీ భారత్‌కు వచ్చిన సంగతి తెలిసిందే.

## చైనాకు భారత్ సాయం చేస్తోంది
# అమెరికా ఆరోపణలు

**వాషింగ్టన్, ఆగష్టు 14:** తమ సుంకాలను తప్పించుకోవడానికి చైనాకు భారత్ సహాయం చేస్తోందని అమెరికా ఆరోపించింది. ఇందుకు షాడో నెట్‌వర్క్ ఉపయోగపడుతోందని పేర్కొంది. ఆ నెట్‌వర్క్‌లో భారత్ సహా 40 దేశాలు ఉన్నాయని విమర్శించింది. 'ది గ్రేట్ ట్రాన్స్‌షిప్‌మెంట్ స్కామ్' పేరిట విడుదలైన నివేదికలో అగ్రరాజ్యం ఈ ఆరోపణలు చేసింది. దానిని అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ వాణిజ్య సలహాదారు పీటర్ నవారో విడుదల చేశారు. అన్యాయమైన వాణిజ్య పద్ధతులు అనుసరిస్తున్నాయని భావించిన దేశాలపై అమెరికా సెక్షన్ 301 పేరిట టారిఫ్లను విధిస్తుంటుంది. 2018లో చైనాపై ఆ సెక్షన్ కింద ఆంక్షలు పెట్టింది. అప్పటి నుంచి చైనాకు అక్రమ సరకు రవాణా పెరిగిందని ఆ నివేదిక వెల్లడించింది. దాని విలువ 303 బిలియన్ డాలర్లు వరకు ఉంటుందని అంచనా వేసింది. రీలేబులింగ్, రీప్యాకేజింగ్, రవాణా మార్గాన్ని మార్చడం కోసం చైనా వస్తువులను ఇతర దేశాల మీదుగా పంపుతుంటారు. కార్మికులకు చెల్లించే వ్యయాలు తక్కువగా ఉన్న దేశాలు, కస్టమ్స్ పర్యవేక్షణ పెద్దగా లేని, అమెరికా మార్కెట్లోకి ప్రవేశించేందుకు అనుకూలంగా ఉండే దేశాల ద్వారా చైనా తయారీదారులు వస్తువులను తరలిస్తుంటారు. తయారైన దేశం నుంచి గాకుండా వేరే దేశం మీదుగా అమెరికాకు చేరే వస్తువులను గుర్తించేందుకు 'డిటెక్టివ్ బోర్డర్' పేరిట ఒక ఏఐ టూల్‌ను తీసుకువచ్చేందుకు అగ్రరాజ్యం ప్రయత్నాలు చేస్తోంది. షిప్‌మెంట్ రికార్డులు, రూటింగ్ హిస్టరీ, ఓనర్‌షిప్ లింక్స్ వంటి వాటిని పరిగణనలోకి తీసుకొని ఆ టూల్ వాటిని గుర్తించనుంది.

## నేపాల్‌కు 'అగ్నిపథ్' సెగలు...
# గూర్ఖా సైనికుల ఆందోళన



**ఖాట్మండ్, ఆగష్టు 14:** జెన్-జీ ఆందోళనలతో ఏకంగా అధికార పీఠమే కదిలిన నేపాల్‌కు ఇప్పుడు మరో తలనొప్పి ఎదురైంది. పొఖారాలో గత కొద్ది రోజులుగా మాజీ గూర్ఖా సైనికులతో పాటు పెద్ద ఎత్తున యువత నిరసనలకు దిగారు. భారత ఆర్మీలోకి మళ్లీ నేపాలీ యువకులను పంపించాలనేదే వారి ప్రధాన డిమాండ్. ఇంతకీ వారి ఆందోళనకు కారణమేంటీ? అసలు భారత సైన్యంలో నేపాలీలు ఎందుకు ఉన్నారు? ఈ నియామకాలపై 'అగ్నిపథ్' ఎలాంటి ప్రభావం చూపించిందో తెలుసుకుందాం..!

**అగ్నివీరులమే అవుతామంటూ..**

భారత ఆర్మీ చీఫ్ ధీరజ్ సేథ్ ఈ నెల 16న ఖాట్మండ్‌లో పర్యటించనున్నారు. ఈ నేపథ్యంలో పొఖారాలో ఈ ఆందోళనలు మొదలయ్యాయి. అగ్నిపథ్ కింద భారత సైన్యంలోకి నేపాలీ యువతను తీసుకునేలా చర్చలు జరపాలని వారు డిమాండ్ చేస్తున్నారు. గతకొంతకాలంగా రాజకీయ అస్థిరతను ఎదుర్కొంటోన్న ఈ హిమాలయ దేశంలో.. ప్రస్తుతం ఉపాధి అవకాశాలు గణనీయంగా తగ్గాయి. దీంతో పొట్టకూటి కోసం వీరు గల్ఫ్ దేశాలకు వలస వెళ్లాల్సిన పరిస్థితి నెలకొంది. అయితే, ప్రస్తుతం పశ్చిమాసియాలో నెలకొన్న ఉద్రిక్తతల కారణంగా.. గల్ఫ్‌లో ఉద్యోగం కంటే భారత సైన్యంలో పనిచేయడమే చాలా ఉత్తమమని వారు భావిస్తున్నారు. అందుకే అగ్నివీరులుగా తమకు అవకాశం కల్పించేలా చూడాలని అక్కడి యువత డిమాండ్ చేస్తోంది. మరోవైపు, గతంలో భారత సైన్యంలో పనిచేసిన తమకు గుర్తింపుతో పాటు హక్కులు, ప్రయోజనాలు కల్పించాలని తమ ప్రభుత్వాన్ని కోరుతూ గూర్ఖా మాజీ సైనికులు సైతం ఈ ఆందోళనల్లో పాల్గొన్నారు.

భారత సైన్యంలో సేవలందిస్తున్న ఏకైక విదేశం నేపాల్. 200 ఏళ్ల కంటే ముందే జరిగిన ఓ ఒప్పందం కారణంగా.. నేపాలీలు మన ఆర్మీలో సుదీర్ఘంగా కొనసాగారు. 1814-1816 మధ్య ఆంగ్లో-నేపాల్ యుద్ధం జరిగింది. ఆ సమయంలో గూర్ఖా సైనికుల శౌర్యానికి ముగ్ధుడైన ఈస్ట్ ఇండియా కంపెనీ జనరల్ డేవిడ్ ఆక్టర్లోని బ్రిటిష్ సైన్యంలో గూర్ఖా సైనికులను నియమించుకునేలా ఒప్పందం చేసుకున్నారు. అలా యుద్ధం ముగియడానికి ముందే 1815 ఏప్రిల్లో భారత గడ్డపై గూర్ఖా సైనికుల బెటాలియన్ ఏర్పడింది. అప్పటి నుంచి ఈ సంప్రదాయం కొనసాగగా.. బ్రిటన్ నుంచి రాజకీయ మద్దతు, దౌత్య ప్రయోజనాల కోసం నేపాల్ పాలకులు కూడా దాన్ని అంగీకరిస్తూ వచ్చారు.

1947లో భారత్‌కు స్వాతంత్ర్యం లభించిన తర్వాత.. బ్రిటన్, భారత్, నేపాల్ మధ్య త్రైపాక్షిక ఒప్పందం కుదిరింది. బ్రిటిష్, భారత సైన్యంలో గూర్ఖా సైనికుల నియామకాలు కొనసాగించడమే దీని ప్రధాన ఉద్దేశం. ఇలా విదేశీ సైన్యంలో సేవలందించిన నేపాలీ సైనికులకు పింఛన్లు, పదవీ విరమణ ప్రయోజనాలు కూడా ఆయా దేశాలే అందించాల్సి ఉంటుంది. ఒప్పందంలో భాగంగా నాలుగు గూర్ఖా రెజిమెంట్లు యూకేకు వెళ్లగా.. ఆరు స్వతంత్ర భారత్‌కు లభించాయి. ఆ తర్వాత గూర్ఖా రైఫిల్స్ పేరుతో మరో దళాన్ని కూడా భారత్ ఏర్పాటు చేసింది. ప్రస్తుతం దాదాపు 35వేల మంది నేపాలీ సైనికులు భారత ఆర్మీలో పనిచేస్తున్నారు. అలాగే, 1.32లక్షల మంది మాజీ సైనికులున్నారు.

అయితే, 2020 కొవిడ్ మహమ్మారి కారణంగా భారత సైన్యంలోకి నేపాలీల నియామకాలు నిలిచిపోయాయి. ఆ తర్వాత 2022లో కేంద్ర ప్రభుత్వం 'అగ్నిపథ్' పథకాన్ని తీసుకొచ్చింది. దీంతో ఈ నియామక ప్రక్రియను పునరుద్ధరించేందుకు నేపాల్ ప్రభుత్వం అనుమతించలేదు. ఈ పథకం 1947 నాటి త్రైపాక్షిక ఒప్పందం నిబంధనలకు అనుగుణంగా లేదని పొరుగు దేశం వాదించింది. సైన్యంలోని నిబంధనలను మార్చినప్పుడు తమ అభిప్రాయాలను తీసుకోలేదని ఆరోపించింది. దీన్ని భారత్ ఆనాడే తోసిపుచ్చింది. అది తమ ప్రభుత్వ విధానమని తేల్చిచెప్పింది. అలా ఈ విభేదాల కారణంగా భారత సైన్యంలో నేపాలీల నియామకాలు ఆగిపోయాయి.

అయితే, ఈ నిర్ణయం కారణంగా స్వదేశంలో నేపాల్ ప్రభుత్వానికి వ్యతిరేకత ఎదురైంది. భారత సైన్యంలో నియామకాలు కొనసాగినప్పుడు.. గూర్ఖా సైనికుల జీతభత్యాలు, ఇతర పరిహారం కింద ఏటా రూ.1000 కోట్ల మొత్తం నేపాల్ ఆర్థిక వ్యవస్థలోకి వెళ్లేది. ఇప్పుడు ఆ నిధులు ఆగిపోయాయి. దీనికి తోడు అస్థిరత కారణంగా స్వదేశంలో ఉద్యోగ అవకాశాలు దొరకట్లేదు. ఈ క్రమంలోనే నేపాల్లో ఆందోళనలు వెల్లువెత్తాయి.

## ప్రతి నీటి బొట్టూ
# భారత్‌కు రెడ్‌లైనే..

## 'సింధూ జలాల నిలిపివేత'పై పాక్ ప్రధాని షెహబాజ్ షరీఫ్ ప్రేలాపనలు

## 2025 మే నాటి కంటే గట్టిగా ప్రతీకారం తీర్చుకుంటం



**ఇస్లామాబాద్, ఆగష్టు 14:** సింధూ జలాల ఒప్పందం విషయంలో పాకిస్థాన్ ప్రధాని షెహబాజ్ షరీఫ్ మరోసారి భారత్‌పై అక్కసు వెళ్లగక్కారు. సింధూ జలాల్లో తమకు దక్కాల్సిన ప్రతి నీటి బొట్టును రెడ్‌లైన్‌గానే పరిగణిస్తామని ప్రేలాపనలు చేశారు. తమ నీటి హక్కులను కాలరాసేలా భారత్ ఎలాంటి చర్యలకు పాల్పడినా గట్టిగా బదులిస్తామని అన్నారు. పాక్ స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని ఇస్లామాబాద్‌లో ఏర్పాటు చేసిన ఓ కార్యక్రమంలో మాట్లాడుతూ.. షెహబాజ్ షరీఫ్ కవ్వింపు వ్యాఖ్యలు చేశారు.''పాకిస్థాన్ శాంతిని కోరుకుంటోంది. కానీ, దాన్ని మా బలహీనతగా చూడకూడదు. మా సార్వభౌమత్వానికి, రక్షణ ప్రయోజనాలకు ముప్పు వాటిల్లితే చూస్తూ ఊరుకునేది లేదు. 2025 మే నాటి కంటే గట్టిగా బదులిస్తాం'' అంటూ గతేడాది ఇరు దేశాల మధ్య జరిగిన ఘర్షణలను షెహబాజ్ ప్రస్తావించారు. భారత్‌తో జరిగిన ఘర్షణల్లో తామే గెలిచామంటూ పాక్ ప్రధాని అన్నారు. అందువల్లే 'సింధూ జలాల'ను భారత్ ఏకపక్షంగా నిలిపివేసిందని నిరాధార ఆరోపణలు చేశారు. 2025 ఏప్రిల్లో పహల్గాంలో జరిగిన ఉగ్రదాడి అనంతరం.. పాకిస్థాన్‌తో ఉన్న సింధూ జలాల ఒప్పందాన్ని భారత్ నిలిపివేసిన సంగతి తెలిసిందే. దీంతో అక్కడ వ్యవసాయంతో పాటు తాగునీటిపై తీవ్ర ప్రభావం పడుతోంది. సింధూ జలాలను విడుదల చేయాలని పదేపదే పాక్ డిమాండ్లు చేస్తోంది. అయితే నీరు, రక్తం కలిసి ప్రవహించలేవనీ, సీమాంతర ఉగ్రదాడులను ఆపితేనే ఈ అంశంపై ఆలోచిస్తామని భారత్ ఇప్పటికే స్పష్టంగా చెప్పింది. ఏ అంతర్జాతీయ ఒప్పందమైనా దేశ ప్రయోజనాలకు వ్యతిరేకంగా ఉన్నట్లు తేలితే.. ఒక సార్వభౌమ దేశంగా దానిని రద్దు చేసే హక్కు భారత్‌కు ఉందని పేర్కొంది.

## బలోచిస్థాన్ హోంమంత్రి
# కాన్వాయ్‌పై దాడి

## భద్రతా సిబ్బంది మృతి



**క్వెట్టా, ఆగష్టు 14:** బలోచిస్థాన్ హోంమంత్రి మీర్ జియావుల్లా కాన్వాయ్‌పై దాడి జరిగింది. దుండగులు జరిపిన కాల్పుల్లో ఇద్దరు భద్రతా సిబ్బంది మృతిచెందగా.. ఆరుగురు గాయాలపాలయ్యారు. హోం మంత్రి సురక్షితంగా బయటపడ్డారు. క్షతగాత్రులను ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. మీర్ జియావుల్లా కలత్ ప్రాంతం నుంచి క్వెట్టాకు వెళ్తుండగా.. ఖడ్కోచా గోరు ప్రాంతంలో కొందరు సాయుధ దుండగులు ఆయన కాన్వాయ్‌ను లక్ష్యంగా చేసుకున్నారు. పాక్ స్వాతంత్ర్య దినోత్సవం రోజున ఈ ఘటన చోటుచేసుకోవడం గమనార్హం. ఈ కాల్పుల్లో కాన్వాయ్‌లోని పలు వాహనాలు ధ్వంసమయ్యాయి.

ఈ దాడులకు ఇప్పటివరకు ఏ ఉగ్రవాద సంస్థ బాధ్యత వహిస్తున్నట్టు ప్రకటన చేయలేదు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టామని స్థానిక పోలీసులు వెల్లడించారు. నిందితుల కోసం గాలిస్తున్నామని.. వారిపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. ఈ దాడి వెనుక బలోచ్ లిబరేషన్ ఆర్మీ హస్తం ఉండొచ్చని అనుమానం వ్యక్తం చేశారు. తమకు స్వయంప్రతిపత్తి కల్పించాలని, తమ ప్రాంతంలోని సహజవనరులపై తమకే నియంత్రణ ఉండాలని బలోచిస్థాన్ ప్రావిన్స్‌లోని వేర్పాటువాద గ్రూపు బీఎల్‌ఏ దశాబ్దాలుగా డిమాండ్ చేస్తోంది. ఈ నేపథ్యంలో తరచూ సైనిక, పారామిలిటరీ, ఇతర ప్రభుత్వ సంస్థలను లక్ష్యంగా చేసుకొని దాడులకు పాల్పడుతోంది. దీనిని పాకిస్థాన్ ఉగ్రవాద సంస్థగా ప్రకటించింది.

## కలికిరి లో ఘనంగా ముందస్తు
# స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు



**కలికిరి ఆగస్టు 14 మనం న్యూస్:** స్థానిక ఎస్.డబ్ల్యూ.ఆర్. ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో ముందస్తు స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. కళాశాల విద్యార్థినులు ఉత్సాహంగా ర్యాలీ నిర్వహించి, మహాత్మా గాంధీ మరియు డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ విగ్రహాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు.

అనంతరం కళాశాల ప్రాంగణంలో పలు క్రీడా పోటీలు నిర్వహించారు. దేశభక్తిని ప్రతిబింబించేలా భారతదేశ పటాన్ని దీపాలతో అలంకరించడం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. విద్యార్థినులు దేశభక్తి గీతాలు, సాంస్కృతిక కార్యక్రమాలు తదితర కార్యక్రమాల్లో ఉత్సాహంగా పాల్గొన్నారు. ఎస్ డబ్ల్యు ఆర్ డిగ్రీ కళాశాల నుండి భారీ త్రివర్ణ పతాకం చేపట్టి పట్టణంలో భారీ తిరంగ ర్యాలీ నిర్వహించారు. స్థానిక నాలుగు రోడ్ల కూడలిలో విద్యార్థినులందరూ త్రివర్ణ పతాకంతో మానవహారం నిర్వహించారు.

## ఇరాన్‌కు రెండు టన్నుల బంగారం ఇచ్చిన యూఏఈ

### అంతర్జాతీయ మీడియా కథనం



**అబుధాబి, ఆగష్టు 14:** చర్చలు, దౌత్య ప్రయత్నాలు నిలిచిపోవడంతో అమెరికా-ఇరాన్ యుద్ధం ఇప్పటికిప్పుడే ముగిసే సూచనలు ఏమీ కనిపించడం లేదు. రెండు దేశాలు అంతలోనే కాల్పులు విరమణ అంటున్నాయి.. ఆ వెంటనే దాడులు చేసుకుంటున్నాయి. తమపై అమెరికా బాంబుల వర్షం కురిపించిన వెంటనే.. ఇరాన్ గల్ఫ్ దేశాలను టార్గెట్ చేస్తోంది. ఇలా ఇంకా తాము లక్ష్యంగా మారకూడదని భావించిన యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ ఇరాన్‌ను బుజ్జగించే ప్రయత్నాలు చేస్తోంది. దానిలో భాగంగానే రెండు టన్నుల బంగారం ఇచ్చిందని అంతర్జాతీయ మీడియా కథనాలు పేర్కొన్నాయి.

అమెరికా ఆంక్షల కారణంగా ప్రపంచంలోని పలు దేశాల బ్యాంకుల వద్ద ఇరాన్ ఆస్తులు ఫ్రీజ్ అయి ఉన్నాయి. అలా తమ వద్ద ఉన్న నిధులను విడుదల చేసి, యుద్ధానికి దూరంగా ఉండాలని యూఏఈ నిర్ణయించుకున్నట్లు కనిపిస్తోంది. ఈ ప్రణాళికలో భాగంగా ఆగస్టు 11, 12 తేదీల్లో అబుధాబి-టెహ్రాన్ మధ్య విమానాలు నడిచాయని తెలుస్తోంది. వీటిలో స్తంభింపజేసిన చేసిన ఇరాన్ నిధులను తరలించినట్లు సమాచారం. జూన్ 8న కూడా ఒక విమానం అబుధాబి నుంచి ఇరాన్‌లోని మెహ్రాబాద్ ఎయిర్‌పోర్ట్‌కు వెళ్లింది. అప్పుడు మూడు బిలియన్ డాలర్లను ఇరాన్‌కు బదిలీ చేసినట్లు వార్తలు వచ్చాయి. ఇలా యూఏఈ తరలించిన నిధుల్లో 283 మిలియన్ డాలర్లు విలువైన రెండు టన్నులు బంగారం కూడా ఉందట.

అలాగే ఇరాన్ విమానయాన సంస్థలకు 15 సెకండ్ హ్యాండ్ విమానాలను అమ్మేందుకు కూడా యూఏఈ అంగీకరించినట్లు ఆ కథనాలు వెల్లడించాయి. అవిగాక మరో 14 ప్యాసింజర్ విమానాలు కూడా తిరిగి ఇవ్వనుందట. రెండు ఎయిర్ బస్ విమానాలు ఇరాన్‌కు వెళ్లడానికి ముందు రొమేనియాలోని ఒక ఎయిర్‌పోర్టులో ఉన్నట్లు ఉపగ్రహ చిత్రాల్లో వెల్లడైంది. అమెరికా, ఇజ్రాయెల్ చేసిన దాడుల్లో తమ 30 ప్యాసింజర్ విమానాలు ధ్వంసమయ్యాయని ఇరాన్ గతంలో చెప్పింది. ఇప్పుడు యూఏఈ నుంచి వెళ్లే విమానాలు ఆ లోటును భర్తీ చేయనున్నాయి.పశ్చిమాసియాలో ఘర్షణలు ఎప్పుడు తీవ్ర రూపం దాల్చుతాయో తెలియని అనిశ్చితిలో.. తమ భూభాగంపై ఇరాన్ దాడులను నివారించేందుకు యూఏఈ ఈ ప్రయత్నాలు చేసినట్లు కనిపిస్తోంది. అలాగే ఆమెరికా ఆంక్షలు, యుద్ధంతో ఇరాన్ ఆర్థికంగా మరింత చితికిపోతోంది. ఈ సమయంలో నిధుల బదిలీ వల్ల టెహ్రాన్‌కు కాస్త బలం చేకూరొచ్చని తెలుస్తోంది.

# రేవంత్‌కు డన్నింగ్ క్రూగర్.. బై పోలార్ డిసార్డర్ జబ్బు

## క్షుద్ర పూజలు చేసే రేవంత్ సీఎం అయ్యిండా?

## కాంగ్రెస్ స్కామ్‌లు.. పింఛన్లు కోసం పైసలు వసూలుజేస్తుండ్రు?

## తెలంగాణ భవన్.. అస్తిత్వానికి చిరునామా : ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్

**హైదరాబాద్, మనం ప్రతినిధి :** తెలంగాణ భవన్ అంటేనే అస్తిత్వానికి చిరునామా అని కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ కల్వకుంట్ల సంజయ్ అన్నారు. ఎన్నో పోరాటాలకు నిలయంగా తెలంగాణ భవన్ నిలిచిందన్నారు. తెలంగాణ భవన్ నిర్మాణం చేసి నేటికి 20 ఏండ్ల అయిన సందర్భంగా రాష్ట్ర ప్రజలందరికీ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..చేతబడులంటూ రేవంత్ రెడ్డి తన చెత్తబుద్ధిని బయట పెట్టుకున్నారని విమర్శించారు. రేవంత్ రెడ్డి క్షుద్ర పూజలు చేసి సీఎం అయ్యారా? అని ప్రశ్నించారు. ఈ నవీన యుగంలో సైన్స్ యుగంలో సీఎం రేవంత్ రెడ్డి క్షుద్ భాష మాట్లాడుతున్నారు. విద్యార్థులకు,భవిష్యత్ తరాలకు ఎలాంటి సందేశం ఇస్తున్నారు? రేవంత్ రెడ్డిని అతని భార్య డాక్టర్‌కు చూపించాలి? అని ఎద్దేవా చేశారు. కొత్త పింఛన్ దరఖాస్తులో బీడీ కార్మికుల కాలమ్ పెట్టలేదు. ఉమ్మడి రాష్ట్రంలో పాలకులు బీడీ కార్మికులను పట్టించుకోలేదు. కేసీఆర్ సీఎం అయిన తర్వాతనే బీడీ కార్మికులకు పింఛన్ ఇచ్చారన్నారు. కోరుట్ల నియోజకవర్గంలో ఎక్కువ మంది బీడీ కార్మికులు ఉంటారు. బీడీ కార్మికులకు ఉన్న పింఛన్లు తీసివేస్తారా అని నిలదీశారు. కాంగ్రెస్ అంటేనే స్కామ్, పింఛన్లు ఇవ్వడానికి పైసలు వసూలు చేస్తున్నారని విమర్శించారు. కేసీఆర్ కిట్ తీసివేశారు. కల్యాణలక్ష్మీ పథకం రేవంత్ రెడ్డి సీఎం అయ్యాక సంతాన లక్ష్మీ పథకంగా మారిందన్నారు. పెండ్లపుడు ఇవ్వాల్సిన కల్యాణ లక్ష్మి చెక్ ను పిల్లలు పుట్టాక ఇస్తున్నారు. కోటి మంది మహిళలను కోటేశ్వరులను చేస్తానని చెప్పిన రేవంత్ రెడ్డి కనీసం 2,000 రూపాయలు ఇవ్వడం లేదని మండిపడ్డారు. ఇదిలాఉంటే, తెలంగాణలో 8 మంది బీజేపీ ఎంపీలు ఉండి కూడా ఈ రాష్ట్రానికి వారు చేసిందేమీలేదని దుయ్యబట్టారు. రేవంత్ రెడ్డి డన్నింగ్ క్రూగర్,బై పోలార్ డిసార్డర్ జబ్బులతో భాదపడుతున్నారు. డన్నింగ్ క్రూగర్ సిండ్రోమ్ అంటే ఏమి తెలవకున్నా తెలిసినట్టు మాట్లాడటం. బై పోలార్ డిజార్డర్ కొన్ని నిమిషాల్లోనే పరస్పర విరుద్ధంగా మాట్లాడటం అన్నారు. ఇప్పటికైనా సీఎం జ్ఞానం తెచ్చుకుని ప్రవర్తించాలి అని హితవు పలికారు. ఆయన వెంట కార్పొరేషన్ మాజీ చైర్మన్ వై .సతీష్ రెడ్డి,బీసీ కమిషన్ మాజీ సభ్యుడు ఉపేంద్ర చారి పాల్గొన్నారు.

## హెల్మెట్ ధరించడం ప్రతి ఒక్కరి బాధ్యత



## జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్

**చిత్తూరు, ఆగస్టు 14.మనం న్యూస్:** రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రతి ఒక్కరూ హెల్మెట్ ధరించి, ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్, సూచించారు. సురక్షిత చిత్తూరు - మీ భద్రత మా బాధ్యత కార్యక్రమంలో భాగంగా చిత్తూరు జిల్లా పోలీసుల ఆధ్వర్యంలో కార్వేటినగరం మండలం అమ్మపల్లి క్రాస్ వద్ద 1000 మందికి ఉచితంగా హెల్మెట్లు పంపిణీ చేశారు. అనంతరం 1000 మంది ద్విచక్ర వాహనదారులతో అమ్మపల్లి క్రాస్ నుంచి కార్వేటినగరం పోలీస్ స్టేషన్ వరకు మెగా హెల్మెట్ బైక్ ర్యాలీ నిర్వహించారు.జిల్లా ఎస్పీ తుషార్ డూడి,అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్, జి.డి. నెల్లూరు ఎమ్మెల్యే థామస్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా పారిశ్రామికవేత్త మాదిరాజు గణేష్ రాజు,కుమార్ రాజు 1000 హెల్మెట్లను ఉచితంగా వితరణ చేశారు.

**రోడ్డు ప్రమాదం ఒక కుటుంబ భవిష్యత్తును మార్చేస్తుంది - కలెక్టర్**

జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ మాట్లాడుతూ, గత ఐదు సంవత్సరాల రోడ్డు ప్రమాద గణాంకాలను పరిశీలిస్తే చిత్తూరు జిల్లాలో ప్రతి ఏడాది సుమారు 350 మంది రోడ్డు ప్రమాదాల్లో ప్రాణాలు కోల్పోతున్నారని తెలిపారు. వీరిలో 150 నుంచి 170 మంది వరకు ద్విచక్ర వాహనదారులే ఉన్నారని, అదనంగా ప్రతి ఏడాది 400 నుంచి 450 మంది ద్విచక్ర వాహనదారులు తీవ్రంగా గాయపడుతున్నారని పేర్కొన్నారు. రోడ్డు ప్రమాదం ఒక వ్యక్తికి జరిగిన విషాదం మాత్రమే కాదని, దాని ప్రభావం మొత్తం కుటుంబంపై పడుతుందని కలెక్టర్ అన్నారు. కుటుంబాన్ని పోషించే వ్యక్తి ప్రమాదానికి గురైతే ఆ కుటుంబం ఆర్థికంగా, సామాజికంగా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొనే అవకాశం ఉందన్నారు. హెల్మెట్, సీట్ బెల్ట్ వంటి రక్షణ చర్యలను తప్పనిసరిగా పాటిస్తూ ట్రాఫిక్ నిబంధనలను గౌరవించాలని సూచించారు.

## కొర్లగుంటలో భక్తిశ్రద్ధలతో సామూహిక వరలక్ష్మీ వ్రతం



**తిరుపతి: ఆగస్ట్ 14, మనం న్యూస్:** మహిళల్లో ఆధ్యాత్మిక భావనను పెంపొందించడంతో పాటు సమాజంలో పరస్పర సహకారాన్ని చాటేలా స్థానిక కొర్లగుంటలోని ప్రసన్న భారతి పాఠశాల వేదికగా రాస్ మహిళా సంఘాల ఆధ్వర్యంలో శ్రావణమాస వేడుకలు అత్యంత వైభవంగా జరిగాయి. శ్రావణ శుక్రవారాన్ని పురస్కరించుకుని ఇక్కడ నిర్వహించిన సామూహిక వరలక్ష్మీ వ్రతం కార్యక్రమం సర్వత్రా ఆకట్టుకుంది. ఈ వేడుకకు చుట్టుపక్కల ప్రాంతాల నుంచి దాదాపు 300 మంది మహిళలు పెద్దఎత్తున తరలివచ్చి భక్తిశ్రద్ధలతో వరలక్ష్మీ దేవిని పూజించారు.

**ఆధ్యాత్మికతతో పాటు పొదుపు ముఖ్యం:డాక్టర్ ఎస్. వెంకటరత్నం**

ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన రాస్ ప్రధాన కార్యదర్శి డాక్టర్ ఎస్. వెంకటరత్నం జ్యోతి ప్రజ్వలన చేసి వేడుకలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మహిళల జీవితంలో క్రమశిక్షణతో పాటు ఆధ్యాత్మిక చింతన ఎంతో కీలకమైనదన్నారు. శ్రావణమాసం పవిత్రతను చాటుతూ ఇంత భారీ సంఖ్యలో మహిళలు ఒకచోట చేరి పూజలు నిర్వహించడం అభినందనీయమని కొనియాడారు.

# వీడిన దంపతుల మర్డర్ మిస్టరీ

- 24 గంటల్లో ఛేదించిన మోతే మండల హత్య కేసు
- సీసీటీవీ ఫుటేజిసాంకేతిక ఆధారాలతో గుర్తింపు
- ఇద్దరు నిందితుల అరెస్ట్ రిమాండ్
- చట్ట వ్యతిరేక చర్యలకు పాలు పడితే ఎంతటి వ్యక్తుల కైనా శిక్ష తప్పదు
- విలేకరుల సమావేశంలో జిల్లా ఎస్పీ కే నరసింహ



సూర్యాపేట ఆగస్టు 14 (మనం ప్రతినిధి) సూర్యాపేట్ జిల్లా పరిదిలోని, మోతే పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగిన భార్య భర్తల జంట హత్యల మిస్టరీ కేసును 24 గంటల్లోనే నేరానికి పాల్పడ్డ నిందితుల్ని గుర్తించి అరెస్టు చేయడం జరిగిందని జిల్లా ఎస్పీ కే నరసింహ తెలిపారు.శుక్రవారం జిల్లా పోలీసు కార్యాలయంలో కేసుకు సంబంధించి వివరాలను మీడియాకు వెల్లడించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ... స్థానికంగా అందుబాటులో ఉన్న సీసీటీవీ కెమెరాలు పరిశీలించగా రెండవ నిందితుడైన జిల్లేపల్లి సుందర్ మృతిచెందిన బూబా ను తీసుకెళుతూ అనామస్పదంగా కనిపించాడు. దీని ఆధారంగా దర్యాప్తు చేస్తున్న మునగాల సర్కిల్ ఇన్స్పెక్టర్ ఆధ్వర్యంలో పోలీసు ప్రత్యేక బృందం శుక్రవారం ఉదయం 8 గంటల సమయంలో సూర్యాపేట కొత్త బస్టాండ్ వద్ద మొదటి నిందితుడు షరీఫ్ ను, రెండవ నిందితుడు సుందర్ అను అదుపులోకి తీసుకుని విచారించగా నేరాన్ని అంగీకరించాలని ఎస్పీ పేర్కొన్నారు.

**హత్య సంఘటన వివరాలు**

మోతే గ్రామ శివారు, జాతీయ రహదారి 365 బిబి ప్లై ఓవర్ కు సుమారు 200 మీటర్ ల దూరంలో వ్యవసాయ భూమిలో కాళ్ళు కనిపించేలా పాక్షికంగా పాతిపెట్టిన మృతిదేహాలను గుర్తు అవి మోతే మండలం చిక్యతండా కు చెందిన హలవత్ నాగులు అతని భార్య హలవత్ బూబా, వయస్సు: 41 సం,,లు, గుర్తించాము. మృతులు ఇద్దరూ భార్య భర్తలు, వ్యవసాయం మీద ఆధారపడి జీవించే కుటుంభం. వారు వారి స్వగ్రామం బిక్య తండా, మోతే మండలం నుండి వలస వచ్చి ప్రస్తుతం మోతే గ్రామము లో వ్యవసాయ భూమి కౌలు తీసుకొని సాగు చేసుకుంటూ జీవనం గడుపుతున్నారు ఈ దంపతులకు ఇద్దరు ఆడ పిల్లలు సంతానం. వారికి వివాహమైంది మోతే గ్రామానికి చెందిన జిల్లేపల్లి సుందర్ అను వ్యక్తి కి స్టేషన్ కానిస్టేబుల్ అయిన ఎండి శరీఫ్ కు అతని తో పరిచయం ఏర్పడింది. బూబా - నాగులు లు మోతే లోనే నివాసం ఉండటం తో వాళ్ళ బిడ్డ, భార్య భర్త ల పంచాయితిలో పోలీస్ స్టేషన్ కు రావటంతో షరీఫ్ కు, బూబా నాగుల లకు పరిచయం ఏర్పడిందని ఎస్పీ తెలిపారు. అల్లుడు డబ్బుల కోసం ఇబ్బంది పెడుతున్నాడని డబ్బులు సమకూర్చాలని బూబా-నాగులు ల అబ్యర్ధన మేరకు షరీప్ సుమారు 3 లక్షల రూలు బూబా నాగులు లకు అప్పుగా ఇవ్వటం జరిగింది. తిరిగి ఇచ్చే క్రమములో బూబా నాగులు లు డబ్బులు ఇవ్వకుండా, తిరిగి షరీఫ్ ను బెదిరిస్తూ ఉండటం తో ఎలాగైనా వారి ఇద్దరినీ చంపేయాలని షరీఫ్ నిర్ణయించుకున్నాడు. వారికి గొర్రెల లోన్ గూర్చి చెప్పి లోన్ కొరకు వారికి కొన్ని గొర్రెలు ఉన్నట్లు నమ్మించాలని, చెకింగ్ కోసం వచ్చినపుడు గొర్రెలు చూపించాలని వాటి కోసం గొర్రెలు ఉన్న వారి ని బ్రతిలాడి, గొర్రెలు శడ్డులో కాకుండా గ్రామ శివారులో ఉండి వాటికి నీటి వసతి, గొర్రెల ఎరువు వేయటానికి ఒక గుంత ఉండాలని వారిని నమ్మించి తాను అనుకున్న ప్లాన్ ను మరో నిందితుడు సుందర్ కు చెప్పాడు. దీంతో తాను సరే అనటం తో ఇద్దరు కలిసి తేదీ: 11.08.2026 రోజు రాత్రి మోతే లో కలిసి ఒక పధకం ప్రకారం, ముందుగా షరీఫ్, సుందర్ లు తన మోటార్ సైకిల్ పై నాగులు ను బైక్ మీద ఎక్కించుకొని మోతే గ్రామ శివారు జాతీయ రహదారి 365 బి బి. పై ఓవర్ కు సుమారు 200 మీటర్ ల దూరంలో కమ్మ శ్రీనివాస్ కు చెందిన భూమి వద్ద కు తీసుకెళ్లి నాగులుతో గుంత తీయించే క్రమములో వెనక నుండి గుది బండ తో బలంగా తల పై మోదటం తో అదే గుంత లో నాగులు పడి మృతి చెందాడు. మృతిని నిర్ధారించుకొని షరీఫ్ సుందర్ లు శవాన్ని పూడ్చి అక్కడి నుండి, కొంత సేపటి తర్వాత బూబా ను అదే బైక్ పై అదే ప్రదేశానికి నమ్మించి తీసుకెళ్లి ఆమెను కూడా హతమర్చి గుంత తీసి, పాతి పెట్టి క్రమములో మహిళా ఒంటి పై ఉన్న ఆభరణ లు కూడా తీసుకెళ్లాలని ఎస్పి స్పష్టం చేశారు.

**హత్య కేసు చేదించిన తీరు**

సమాచారం అందుకున్న వెంటనే సూర్యాపేట్ జిల్లా ఎస్పీ, నరసింహ ఆదేశాల మేరకు, కోదాడ డీఎస్పీ, శ్రీనివాస్ రెడ్డి మునగాల సీఐ రామ కృష్ణ రెడ్డి ఆధ్వర్యంలో ప్రత్యేక బృందాలు దర్యాప్తు ప్రారంభించారు. నిందితుల గుర్తింపు అరెస్ట్: దర్యాప్తు లో భాగంగా సీసీటీవీ కెమెరాలు పరిశీలించగా, సాంకేతిక సీసీటీవీ ఫుటేజ్ టెక్నికల్ ఆధారంగా పోలీసులు నిందితులను పసిగట్టి సూర్యాపేట కొత్త బస్టాండ్ సమీపంలో హత్య చేసిన ఎందుకని పట్టుకొని అరెస్ట్ చేసి రిమాండ్ తరలించడం జరిగిందని ఎస్పీ అన్నారు.

**హత్య చేసిన నేరస్థుల వివరాలు**

దర్యాప్తు లో పారదర్శకత కోసం కేసు ను సూర్యాపేట్ డివిస్ పి, శ్రీ ప్రసన్న కుమార్ కి అప్పగించగా ఈ కేసులో ప్రధాన నిందితులుగా ఉన్న ఏ 01 .ఎండి షరీఫ్ (పోలీస్ కానిస్టేబుల్, మోతే పి.యస్ లో విధులు నిర్వహిస్తున్నాడు. ఏ 02 నిందితుడు జిల్లేపల్లి సుందర్ లను అరెస్ట్ చేసి నేరస్తు ల వద్ద నుండి హత్యకు ఉపయోగించిన గు ద బండ, నేరస్తుడు ఏ-1 యొక్క బైక్, రెండు సెల్ ఫోన్‌లు స్వాధీనం చేసుకున్నారు. నిందితులను విచా రించగా హత్య నేరాన్ని అంగీకరించడం అరెస్ట్ చేసి రిమాండ్‌కు పంపించడం జరిగిందని ఎస్పీ స్పష్టం చేశారు.

**సిబ్బందికి అభినందనలు రివార్డు అందజేత**

పోలీసులు ప్రతిష్టాత్మకంగా తీసుకొన ఈ హత్య కేసు చేదనలో బాగా పని చేసిన కోదాడ డివిస్పీ శ్రీనివాస్ రెడ్డి, అధికారి సూర్యాపేట డివిస్పీ ప్రసన్నకుమార్, మునగాల సర్కిల్ ఇన్స్పెక్టర్ రామకృష్ణారెడ్డి, సిసిఎస్ ఇన్స్పెక్టర్ శివకుమార్, స్థానిక ఎస్సు లచ్చిరెడ్డి, సిసిఎస్ ఎస్ఐలు సాయిరాం, హరికృష్ణ సిబ్బంది నీ అభినందనలు తెలియజేసి అందరికీ రివార్డు అందజేశారు.

# శ్రీశైలం డ్యాం నీళ్లు.. సాగర్ డ్యామ్ హక్కు



- పోతిరెడ్డిపాడుకి తరలిస్తున్న నీటిని అడ్డుకోలేని కాంగ్రెస్ ప్రభుత్వం

నేరేడుచర్ల, ఆగస్టు 14 మనం న్యూస్: నాగార్జునసాగర్ డ్యామ్ కు బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ గా విద్యుత్ ఉత్పత్తి కోసమే నాటి ప్రభుత్వం శ్రీశైలం డ్యాం నిర్మించారని కానీ నేటి పాలకులు పట్టించుకోకపోవడంతో ఆంధ్ర పాలకులు పోతిరెడ్డిపాడు ప్రాజెక్టు పేరున శ్రీశైలం నికరజలాలు తరలించకపోతున్న పట్టించుకోనే పరిస్థితి లేదని నేరేడుచర్ల మున్సిపల్ కౌన్సిలర్ బీఆర్ఎస్ నాయకులు దొండపాటి అప్పిరెడ్డి మండిపడ్డారు . శుక్రవారం బిఆర్ ఎస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరు సమావేశంలో ఆయన మాట్లాడుతూ పోతిరెడ్డిపాడు ద్వారా నేటి తరలింపు పై తెలంగాణ మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి స్పష్టమైన వైఖరిని ప్రకటించాలని, కృష్ణా జలాల విషయంలో తెలంగాణ హక్కులను కాపాడడంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందని విమర్శించారు. కేఆర్ ఎంబి నుంచి అనుమతులు లేకుండా ఆంధ్ర ప్రదేశ్ నీటిని వినియోగిస్తుందని అదే అంశాన్ని మాజీ మంత్రి జగదీశ్వర్ రెడ్డి ప్రభుత్వం దృష్టికి తీసుకు వచ్చారని కృష్ణా జలాల విషయంలో తెలంగాణకు జరుగుతున్న అన్యాయంపై ప్రభుత్వం వెంటనే స్పందించాలన్నారు. వెంటనే శ్రీశైలం నుండి నాగార్జునసాగర్ కు నీటిని విడుదల చేసి రైతులను కాపాడాలన్నారు. నాగార్జున సాగర్ నిండిన నీళ్లు ఇవ్వమని మంత్రి కోమటి రెడ్డి వెంకట్ రెడ్డి వ్యాఖ్యలను బిఆర్ఎస్ పార్టీ తరుపున ఖండిస్తున్నామన్నారు. పరిపాలన సక్రమంగా చేయకపోతే ప్రజలే తగిన బుద్ధి చెబుతున్నారని అన్నారు.మాజీ మండల పార్టీ అధ్యక్షుడు అరిబండి సురేష్ బాబు, మాజీ ఎంపీపీ చెన్న బోయిన సైదులు మాజీ మార్కెట్ చైర్మన్ నాగండ్ల శ్రీధర్, చిత్తలూరి సైదులు, యల్లబోయిన లింగయ్య, గుర్రం మార్కండేయ, ఇంజమూరి రాములు, బొడ్డుపల్లి సుందరయ్య, ఇనుపాల పిచ్చిరెడ్డి, హుస్సేన్, వస్కుల సుదర్శన్, ఇంజమూరి రాజేష్, పోల గాని భరత్ గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

# హర్ ఘర్ తిరంగ్ యాత్రలో పాల్గొని దేశభక్తిని చాటుదాం



- భాజపా ఆధ్వర్యంలో మండలంలోని గ్రామ గ్రామాన హర్ ఘర్ తిరంగ్ యాత్ర
- జిల్లా ఉపాధ్యక్షులు మల్లెబోయిన వెంకటేష్ బాబు

అనంతగిరి ఆగష్టు 14 (మనం న్యూస్ ): హర్ ఘర్ తిరంగ్ యాత్రలో పాల్గొని ప్రతి ఒక్కరు దేశభక్తిని చాటాలని బిజెపి సూర్యపేట జిల్లా ఉపాధ్యక్షులు మల్లెబోయిన వెంకటేష్ బాబు అన్నారు. శుక్రవారం స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో భాగంగా భారతీయ జనతా పార్టీ సూర్యాపేట జిల్లా ఉపాధ్యక్షులు తిరంగ్ యాత్ర మండల ఇంచార్జ్ మల్లెబోయిన వెంకటేష్ బాబు ఆధ్వర్యంలో మండల పరిధిలోని గొండ్రియాల గ్రామంలో హర్ ఘర్ తిరంగా యాత్రను ఘనంగా నిర్వహించారు.అనంతరం జిల్లా ఉపాధ్యక్షులు మల్లెబోయిన వెంకటేష్ బాబు మాట్లాడుతూ దేశ ప్రధాని నరేంద్ర మోదీ పిలుపు మేరకు జాతీయ స్థాయిలో గ్రామ గ్రామాన 'హర్ ఘర్ తిరంగా' అభియాన్ నిర్వహిస్తున్నామని తెలిపారు. ప్రతి ఇంటిపై త్రివర్ణ పతాకాన్ని ఎగురవేసి దేశభక్తిని చాటాలనేదే ఈ కార్యక్రమ ముఖ్య ఉద్దేశమని పేర్కొన్నారు.ఈ సంవత్సరం భారతదేశం 80వ స్వాతంత్ర్య దినోత్సవాన్ని జరుపుకుంటున్నామని, అదే సమయంలో వందేమాతరం గీతం 150వ వార్షికోత్సవాన్ని కూడా జరుపుకుంటున్నామని గుర్తు చేశారు.దేశ స్వాతంత్ర్యం కోసం ప్రాణాలు అర్పించిన వీర జవాన్లు, స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాలను గుర్తు చేసుకుంటూ ఈ అభియాన్ను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో భాజపా మండల నాయకులు, కార్యకర్తలు, గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని జాతీయ జెండాలను చేతబూని దేశభక్తి నినాదాలు చేశారు.ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు చింతకుంట్ల సతీష్ బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వెంకట నర్సయ్య, జిల్లా నాయకులు జిల్లా జనార్ధన్, మండల ప్రధాన కార్యదర్శి రామారావు, జిల్లా కార్యవర్గ సభ్యురాలు జల్లా అరుణ, బొలిశెట్టి కృష్ణయ్య వరయ్య మండల బీజేపీ నాయకులు, కార్యకర్తలు, బూత్ అధ్యక్షులు తదితరులు పాల్గొన్నారు.

# మోకాళ్ల నొప్పిని నిర్లక్ష్యం చేయొద్దు

- యశోద హాస్పిటల్ ఆర్థోపెడిక్ సర్జన్ డాక్టర్ సాయి దినేష్



నల్లగొండ, ఆగస్టు 14 (మనం ప్రతినిధి): వయసు పెరిగే కొద్దీ వచ్చే మోకాళ్ల నొప్పిని చాలా మంది సహజమని భావించి నిర్లక్ష్యం చేస్తున్నారు. కానీ ఇది కేవలం వయసు సమస్య కాదని, క్రమంగా వ్యక్తి స్వేచ్ఛను హరించే 'మోకాలి ఆస్టియో ఆర్థరైటిస్' అని యశోద హాస్పిటల్, సికింద్రాబాద్ కన్సల్టెంట్ ఆర్థోపెడిక్ సర్జన్ డా. సాయి దినేష్ తాటికొండ తెలిపారు. 40 ఏళ్లు దాటిన వారిలో ఈ సమస్య నేడు సర్వసాధారణంగా మారిందని ఆయన అన్నారు. దీన్ని కేవలం నొప్పిగా చూడకుండా జీవన నాణ్యతను దెబ్బతీసే వ్యాధిగా గుర్తించాలని సూచించారు. మొదట్లో మెట్లు ఎక్కడంలో ఇబ్బంది, కొద్ది దూరం నడవడమే కష్టంగా అనిపించడం, కుర్చీలోంచి లేవడానికి ఇబ్బంది వంటి చిన్న సంకేతాలతో ఈ వ్యాధి ప్రారంభమవుతుందని వివరించారు. తర్వాతి దశలో నేలపై కూర్చోవడం, గుడికి వెళ్లడం, షాపింగ్ చేయడం, ప్రయాణాలు చేయడం వంటి రోజువారీ పనులు కూడా భారంగా మారతాయని పేర్కొన్నారు. చివరికి ఇతరుల సహాయం లేకుండా కదలలేని పరిస్థితి వస్తుందని, అందుకే ప్రారంభ దశలోనే వైద్యుడిని సంప్రదించడం ఉత్తమమని సూచించారు. చాలా మంది నాకు వయసు పైబడుతోంది కాబట్టి నొప్పి రావడం సహజం అని అనుకుని వైద్య సహాయం కోసం ఆలస్యం చేస్తున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఆస్టియో ఆర్థరైటిస్ వచ్చిందని తెలిసిన వెంటనే భయపడాల్సిన అవసరం లేదని డా. దినేష్ భరోసా ఇచ్చారు. తొలి దశల్లో సరైన జాగ్రత్తలతో దీన్ని సమర్థంగా నియంత్రించవచ్చని చెప్పారు. బరువు నిర్వహణ, క్రమం తప్పకుండా వ్యాయామం, ఫిజియోథెరపీ, అవసరమైన మందులు జీవనశైలి మార్పుల ద్వారా నొప్పిని తగ్గించి మోకాలి పనితీరును కాపాడుకోవచ్చని వివరించారు. తీవ్రమైన నొప్పి ఉన్న ప్రతి రోగికి శస్త్రచికిత్స అవసరం లేదని ఆయన స్పష్టం చేశారు. అదే సమయంలో తీవ్ర ఆర్థరైటిస్ ఉన్నవారు చికిత్సను సంవత్సరాల తరబడి వాయిదా వేయడం కూడా ప్రమాదకరమన్నారు. చికిత్స ఎంపిక అనేది రోగి వయసు, జీవనశైలి ఆర్థరైటిస్ తీవ్రతపై ఆధారపడి ఉంటుందని తెలిపారు. కొంతమందికి సంప్రదాయ చికిత్సలు సరిపోతాయని, మరికొందరికి ఇంజెక్షన్లు అవసరమవుతాయని చెప్పారు. ఆర్థరైటిస్ తీవ్రంగా ఉండి, నొప్పి రోజువారీ జీవితాన్ని గణనీయంగా ప్రభావితం చేస్తుంటే మోకాలి మార్పిడి గురించి ఆలోచించాలని సూచించారు. ఆధునిక మోకాలి మార్పిడి శస్త్రచికిత్స లక్ష్యం కేవలం ఎక్స్-రేలో మోకాలిని బాగుచేయడం మాత్రమే కాదని, రోగికి తిరిగి నొప్పి లేని జీవితాన్ని ఇవ్వడమే అసలు ఉద్దేశ్యమని స్పష్టం చేశారు. నొప్పి లేకుండా నడవడం, మెట్లు ఎక్కగలగడం, కుటుంబంతో కలిసి ప్రయాణించడం, రోజువారీ పనుల కోసం ఇతరులపై ఆధారపడకుండా ఉండటం - ఇవే విజయవంతమైన శస్త్రచికిత్స నిజమైన ఫలితాలు అని డా. దినేష్ పేర్కొన్నారు. స్పోర్ట్స్ మెడిసిన్, ఆర్థ్రోస్కోపీ, జాయింట్ రీప్లేస్మెంట్ ట్రామా సర్జరీలో ప్రత్యేక నైపుణ్యం ఉన్న డా. దినేష్, ముందస్తు నిర్ధారణ చాలా కీలకమని నొక్కి చెప్పారు. ముగింపుగా ఆయన, మోకాలి ఆస్టియో ఆర్థరైటిస్ మీ స్వేచ్ఛను హరించాల్సిన అవసరం లేదు. సరైన నిర్ధారణ, సరైన చికిత్స సరైన సమయంతో మనం మళ్లీ స్వేచ్ఛగా కదలవచ్చు అని ప్రజలకు సందేశం ఇచ్చారు.

# ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పిలుపుతో హర్ ఘర్ తిరంగ



- జెండాను ఆవిష్కరించిన భారత్ సురక్ష సమితి రాష్ట్ర ఉపాధ్యక్షులు ఏసీఎస్ రాజు

జగిత్యాల, ఆగస్టు 14(మనం న్యూస్): ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పిలుపు మేరకు దేశవ్యాప్తంగా నిర్వహిస్తున్న 'హర్ ఘర్ తిరంగా' కార్యక్రమంలో భాగంగా భారత్ సురక్ష సమితి కార్యాలయంపై జాతీయ జెండాను ఎగురవేశారు. భారత్ సురక్ష సమితి రాష్ట్ర ఉపాధ్యక్షులు ఏసీఎస్ రాజు ఆధ్వర్యంలో త్రివర్ణ పతాకాన్ని ఏర్పాటు చేసి దేశభక్తిని చాటారు. ఈ సందర్భంగా చిట్ల గంగాధర్, ఏ సి ఎస్ రాజు మాట్లాడుతూ.. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఇచ్చిన 'హర్ ఘర్ తిరంగా' పిలుపు దేశ ప్రజల్లో జాతీయ భావన, ఐక్యతను మరింత బలోపేతం చేస్తోందన్నారు. ప్రతి భారతీయుడు జాతీయ జెండాను గౌరవిస్తూ దేశం పట్ల తన బాధ్యతను చాటాలని పిలుపునిచ్చారు. త్రివర్ణ పతాకం భారతదేశ స్వాతంత్ర్య పోరాటం, అమరవీరుల త్యాగాలు, దేశ ప్రజల ఐక్యతకు ప్రతీక అని అన్నారు. యువత స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాలను స్ఫూర్తిగా తీసుకుని దేశ నిర్మాణంలో భాగస్వాములు కావాలని కోరారు. ఈ కార్యక్రమంలో భారత్ సురక్ష సమితి నాయకులు, కౌన్సిలర్ అరవ లక్ష్మి, జిల్లా ప్రధాన కార్యదర్శి అక్కినపెల్లి కాశీనాదం, జిల్లా కార్యదర్శి సింగం గంగాధర్, వేముల పోచమల్లు, ఎడమల వెంకట్ రెడ్డి, నరెందుల శ్రీనివాస్, వేముల దేవరాజం, గొల్లపల్లి సత్యనారాయణ, కె.ఆర్. కృష్ణ, గాదాసు భూమన్న, చిలుక రాజన్న, బొందుకూరి శ్రీనివాస్, కొత్తకొండ బాలన్న, సిరిపురం గంగారాం, బాశెట్టి దుబ్బరాజం తదితరులు పాల్గొన్నారు.

# భరోసా కేంద్రాన్ని సందర్శించిన జిల్లా ఎస్పీ

- మహిళలు, బాలికల భద్రతకు భరోసా కేంద్రం కీలకం
- బాధితులకు సత్వర న్యాయం, అండగా నిలవాలి



నలగొండ, ఆగస్టు 14 (మనం ప్రతినిధి): మహిళలు, బాలికలు, చిన్నారులు లైంగిక హింసకు గురైన సందర్భాల్లో వారికి అండగా నిలుస్తూ, పోలీస్, వైద్య, న్యాయ సహాయం, కౌన్సెలింగ్ వంటి సమగ్ర సేవలను ఒకే వేదిక ద్వారా అందించడంలో భరోసా కేంద్రాలు కీలక పాత్ర పోషిస్తున్నాయని నల్గొండ జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్ పేర్కొన్నారు. జిల్లా ఎస్పీ నల్గొండలోని భరోసా కేంద్రాన్ని శుక్రవారం సందర్శించి, కేంద్రం ద్వారా బాధితులకు అందిస్తున్న వివిధ సేవలను పరిశీలించారు. భరోసా కేంద్రం సిబ్బందితో మాట్లాడి మహిళలు, బాలికలు మరియు చిన్నారులకు అందిస్తున్న పోలీస్ సహాయం, వైద్య సేవలు, న్యాయ సహాయం, కౌన్సెలింగ్ తదితర అంశాలపై వివరాలను అడిగి తెలుసుకున్నారు. భరోసా కేంద్రంలోని కౌన్సెలింగ్ గదులు, బాధితులకు అందిస్తున్న సహాయ సేవలు, కేసుల నిర్వహణ విధానం, రికార్డుల నిర్వహణ తదితర అంశాలను జిల్లా ఎస్పీ గారు పరిశీలించారు. బాధితులకు సత్వర సహాయం అందించడంతో పాటు, వారికి అవసరమైన అన్ని రకాల సహాయ సహకారాలు అందిస్తూ భరోసా కల్పించాలని సిబ్బందికి సూచించారు. బాధితులు తమ సమస్యలను ఎలాంటి భయం లేకుండా స్వేచ్ఛగా తెలియజేసే విధంగా సానుకూలమైన, నమ్మకమైన వాతావరణాన్ని కల్పించాలని తెలిపారు. బాధిత మహిళలు, బాలికలు మరియు చిన్నారుల పట్ల సానుభూతి, గోప్యత, గౌరవంతో వ్యవహరిస్తూ వారికి అవసరమైన పోలీస్, వైద్య, న్యాయ మరియు మానసిక సహాయాన్ని సత్వరమే అందించాలని సూచించారు. బాలలపై లైంగిక నేరాల కేసుల్లో బాధిత చిన్నారుల మానసిక స్థితిని దృష్టిలో ఉంచుకుని చైల్ ఫ్రెండ్లీ విధానంలో విచారణ, కౌన్సెలింగ్ మరియు ఇతర సహాయ సేవలను అందించాలని అధికారులను ఆదేశించారు. బాధితులకు సత్వర న్యాయం అందేలా సంబంధిత పోలీస్ అధికారులు, వైద్య, న్యాయ మరియు ఇతర శాఖలతో సమన్వయంతో పనిచేయాలని సూచించారు. భరోసా కేంద్రానికి వచ్చే ప్రతి కేసును సున్నితమైన అంశంగా పరిగణించి, ఫిర్యాదులపై వెంటనే స్పందించాలని, అవసరమైనప్పుడు చట్టపరమైన చర్యలు చేపట్టడంతో పాటు బాధితులకు నిరంతరం సహకారం అందించాలని ఎస్పీ గారు తెలిపారు. కేసుల పురోగతిని క్రమం తప్పకుండా పర్యవేక్షిస్తూ బాధితులకు న్యాయం జరిగే వరకు అవసరమైన సహాయాన్ని అందించాలని సూచించారు. భరోసా కేంద్రం బాధితులకు అండగా నిలిచే కేంద్రంగా పనిచేయాలని జిల్లా ఎస్పీ గారు పేర్కొన్నారు. మహిళలు, బాలికలు మరియు చిన్నారుల భద్రతకు జిల్లా పోలీస్ శాఖ అత్యంత ప్రాధాన్యత ఇస్తుందని, ఎలాంటి ఇబ్బంది ఎదురైనా పోలీసులను ఆశ్రయించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మహిళా పోలీస్ స్టేషన్ సీఐ మంజుల, భరోసా కేంద్రం ఇన్చార్జ్ ఎస్ఐ అమీన్, ఎస్ఐ గౌస్, ఏఎస్ఐ అబేదా, శ్రీనివాస్, భరోసా కేంద్రం కోర్డినేటర్ నళిని,సిబ్బంది, సంబంధిత పోలీస్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## ఎందరో మహానుభావుల త్యాగ ఫలితమే
# నేటి స్వాతంత్ర దినోత్సవం

- ఆకట్టుకున్న విద్యార్థుల భారీ తిరంగా ర్యాలీ



నేరేడుచర్ల ఆగస్టు 14 మనం న్యూస్: భారత స్వతంత్ర పోరాటంలో వీర మరణం పొందిన ఎందరో మహానుభావుల త్యాగ ఫలితమే నేడు మనం స్వేచ్ఛ వాయువులతో అనుభవిస్తున్న స్వాతంత్రం అని భారతీయ జనతా పార్టీ సూర్యాపేట జిల్లా అధ్యక్షురాలు చల్లా శ్రీలత రెడ్డి అన్నారు. భారత ప్రధానమంత్రి నరేంద్ర మోది ఇచ్చిన పిలుపుమేరకు భారతీయ జనతా పార్టీ ఆధ్వర్యంలో నేరేడుచర్ల పట్టణ కేంద్రంలో శుక్రవారం తిరంగా ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా చల్లా శ్రీలత రెడ్డి హాజరైన అనంతరం ఆమె మాట్లాడారు వ్యాపార పేరున నాడు భారతదేశానికి వచ్చిన బ్రిటిష్ సామ్రాజ్యవాదులు నాటి భారతీయులను అణిచివేసి సుమారు రెండు వందల సంవత్సరాలు నిరంకుశ పాలన చేసిన బ్రిటిష్ సామ్రాజ్యవాదులను తరిమి కొట్టి దేశానికి స్వాతంత్రం తెచ్చేందుకు నేతాజీ సుభాష్ చంద్రబోస్ భగత్ సింగ్ అల్లూరి సీతారామరాజు వీర సావర్కర్,రాజ్ గురు ఇలా ఎందరో మహానుభావులు త్రుణపాయంగా ప్రాణాలు అర్పించారని నాటి భారత వీర పుత్రుల ను స్ఫూర్తిగా తీసుకొని నేటి యువత దేశభక్తితో దేశం కోసమే పని చేయాలని ఆమె పిలుపునిచ్చారు. అంతకుముందు తిరంగా ర్యాలీలో పాల్గొన్న పుర ప్రజలకు పాఠశాల విద్యార్థులకు భారత జాతీయ పతాకాలను ఆమె అందించారు. త్రివర్ణ పతాకాలను అందరూ తమ ఇంటిపై గౌరవంగా ఆవిష్కరించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో నేరేడుచర్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, పినాకిల్ స్కూల్, శ్రీ వాణి స్కూల్, అంజలి స్కూల్, ప్రగతి స్కూల్, అభ్యాస్ స్కూల్, శ్రీ చైతన్య స్కూల్ విద్యార్థులు పాల్గొన్నారు విద్యార్థులు వెంటరాగా భారత్ మాతాకీ జై అంటూ అలా నాటి మహానుభావులను తలుచుకుంటూ త్రివర్ణ పతాకాలు చేతపట్టి ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కొనతం నాగిరెడ్డి చింతకుంట్ల రాజేష్ రెడ్డి హై స్కూల్ హెడ్మాస్టర్ బట్టు మధు పినాకిల్ స్కూల్ హెడ్మాస్టర్ మదార్ తాళ్ల నరేందర్ రెడ్డి, సంకల మద్ది సత్యనారాయణ రెడ్డి, మెట్టు శ్రీనివాస్ రెడ్డి, కడారి ఎల్లయ్య, నీల శ్రీనివాస్, తాటికొండ శ్రీనివాస్ రెడ్డి, నరి నాయక్, కొప్పు లక్ష్మీనారాయణ గౌడ్, నాగయ్య బైరెడ్డి శ్రీనివాస్ రెడ్డి దేవి రెడ్డి నాగిరెడ్డి పురిమల్ల రామ్మూర్తి, రాచకొండ శ్రీనివాస్, నారద మోహన్ రెడ్డి, శంకర్ రెడ్డి, శావయ్య జ్యాస్ అనిల్, బ్రహ్మాచారి తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు దుస్తులు పంపిణీ



తిరుమలగిరి, ఆగస్టు 14 (మనం న్యూస్): తిరుమలగిరి మండలం తొండ గ్రామం ఎస్.సి కాలనీలోని ప్రాథమిక పాఠశాలలో విద్యార్థినులకు దుస్తులను గ్రామ సర్పంచ్ స్వాతి, ఎంపీడీవో లేజర్ శుక్రవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న ప్రతి విద్యార్థికి నాణ్యమైన విద్యతో పాటు అవసరమైన సౌకర్యాలు, ఉచితంగా పుస్తకాలు, దుస్తులు, మధ్యాహ్న భోజనం అందిస్తూ నాణ్యమైన విద్యను కూడా బోధిసు ్తన్నారని చెప్పారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.ఈ కార్యక్రమంలో ఏపీఎం లక్ష్మి, పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# నిబంధనలు ఉల్లంఘించిన ఐకాన్ ఆసుపత్రికి షోకాజ్ నోటీసు



- మూడు రోజుల్లోగా సమగ్ర వివరణ ఇవ్వాలని ఆదేశం
- దాదాపు 41 లోపాలు గుర్తింపు
- పిసి పిఎన్.డి.టి. నిబంధనల ఉల్లంఘనపై ప్రత్యేక దృష్టి

నల్లగొండ, ఆగస్టు 14( మనం ప్రతినిధి ): నిబంధనలు, అనుమతులు, ఆసుపత్రి రిజిస్ట్రేషన్ సమయంలో సమర్పించిన వివరాలకు విరుద్ధంగా సేవలు నిర్వహిస్తున్నట్లు గుర్తించిన నేపథ్యంలో నల్లగొండ పట్టణంలోని ఐకాన్ సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి యాజమాన్యానికి జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ కే. రాహుల్ షోకాజ్ నోటీసు జారీ చేశారు. మూడు రోజులలోగా గుర్తించిన లోపాలు, నిబంధనల ఉల్లంఘనలపై సమగ్ర వివరణ సమర్పించాలని ఆదేశించారు.ఆగస్టు 11న ఆసుపత్రిలో చికిత్స పొందిన కొందరు రోగుల నుంచి అందిన ఫిర్యాదుల నేపథ్యంలో జిల్లా వైద్య మరియు ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ కే. రాహుల్ ఆధ్వర్యంలో సంబంధిత ఆరోగ్యశాఖ అధికారులు ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. అనుమతులు లేకుండా పలు వైద్య సేవలు నిర్వహిస్తున్నట్లు గుర్తింపు జిల్లా వైద్య మరియు ఆరోగ్యశాఖ కార్యాలయానికి ముందస్తు సమాచారం లేదా సంబంధిత అనుమతులు లేకుండా ఆరోగ్యశ్రీ సేవలు నిర్వహించడం, కార్డియాలజీకి సంబంధించిన సేవలు, క్యాథ్ల్యాబ్ నిర్వహణ, మూత్రపిండ వ్యాధులకు సంబంధించిన వైద్య సేవలు, జనరల్ సర్జరీ, గ్యాస్ట్రోఎంటరాలజీ, ఆర్థోపెడిక్, న్యూరో సర్జరీ, గుండె శస్త్రచికిత్సలు, కిడ్నీ సంబంధిత శస్త్రచికిత్స సేవలు నిర్వహిస్తున్నట్లు తనిఖీలో గుర్తించిన అంశాలను అధికారులు నోటీసులో పొందుపరిచారు. అదేవిధంగా ఆసుపత్రి భవనంలోని సెల్లార్లో సి టి స్కాన్, ఎక్స్రే పరికరాలు, మందుల నిల్వ గోదాము నిర్వహిస్తున్నట్లు కూడా తనిఖీలో గుర్తించినట్లు అధికారులు తెలిపారు. సంబంధిత సేవలు, పరికరాలు మరియు సౌకర్యాలకు అవసరమైన అనుమతులు, ప్రమాణాలు పాటించబ డుతున్నాయా అనే అంశంపై ఆసుపత్రి యాజమాన్యం వివరణ ఇవ్వాల్సి ఉంటుంది.

# వధూవరులను ఆశీర్వదించిన మాజీఎంపీ



హనుమకొండ, ఆగస్టు 14 (మనంన్యూస్): హనుమకొండ జిల్లా అలకనంద ఏసీ ఫంక్షన్ హాల్ లో దివ్య-కళ్యాణ్ మ్యారేజ్ రిసెప్షన్ లో మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి మాజీ ఎమ్మెల్యే తాటికొండ రాజయ్య మాజీ ఎంపీ అజ్మీర సీతారాం నాయక్ పాల్గొని నూతన వధూవరులను ఆశీర్వదించారు. అజ్మీర అరుణ-శ్రీను దంపతుల కుమార్తె దివ్య, లావుడియా వనిత-గోవర్ధన్ దంపతుల కుమారుడు కళ్యాణ్ హనుమకొండ అలకనంద ఏసీ ఫంక్షన్ హాల్లో మ్యారేజ్ రిసెప్షన్ లో మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకట రమణారెడ్డి మాజీ ఎమ్మెల్యే తాటికొండ రాజయ్య మాజీ ఎంపీ అజ్మీరా సీతారాం నాయక్ మరియు మాజీ జెడ్పిటిసి మాజీ కార్పొరేటర్ బానోత్ కల్పన సింగ్ లాల్, మాజీ కార్పొరేటర్ లావుడియా అనూష రవి నాయక్, మాజీ జెడ్పిటిసి వీరమ్మ గోపి సింగ్, బంజారా వెల్ఫేర్ అసోసియేషన్ ప్రెసిడెంట్ వీ ఎన్ నాయక్, అర్పిత లక్ష్మణ్ నాయక్, సుగుణ జుమ్ములాల్, ఉదయ్ శ్రీ, బంధుమిత్రులు, కుటుంబ సభ్యులు, సన్నిహితులు పెద్ద సంఖ్యలో హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించి శుభాకాంక్షలు తెలిపారు. లావుడియా తారాబాయి-నాను నాయక్, జ్యోతి-బాలు నాయక్, లావుడియా శారద-రాము నాయక్, చాందీ దాసు నాయక్, సరోజన-లక్ష్మణ్ నాయక్, విజయ-రఘురాం, లలిత-కరణ్, అరుణ-రాజన్న, లలిత-మోహన్, ఫుల్ బంద్-సీతారాం, అజ్మీర ఆనంద-దేవి-రవి నాయక్, రజిత-రాజన్న, వసంత-చీమన్ నాయక్, మమత-గణపతి, అంజలి-రాము, మౌనిక-రాజన్న, చిట్టి రాజు నాయక్, మాలోత్ సునీత-హనుమంతు, వేణు, కిరణ్, లావుడియా వనిత-గోవర్ధన్ నాయక్, లావుడియా విజయ-హేమా నాయక్, శ్రీ విద్యా-సుధాకర్, సుందర్ నాయక్, శ్రీకాంత్, లావుడియా పల్లవి-రాజు నాయక్, జీవన శ్రీ, సెహ్వాగ్, మాజీ కార్పొరేటర్ అనుషా-రవి నాయక్, అరుణ-నగేష్, సరిత-గణపతి, నందిని-అరవింద్, పృథ్వీ, సురేష్, సునీత-సునీల్, కల్పన-గోపాల్, కవిత-జైపాల్, కుమారి-రాజు నాయక్, సుజాత-ఉదయ్ సింగ్, సంధ్యా-సందీప్, మమత-సంతోష్, సరిత-జల్ సింగ్, విమల-జట్ మాల్, సుమ-ప్రసాద్, ప్రమోద్, నారాయణ సింగ్, భారతి-ధరమ్ సింగ్, లత-వెంకటేష్, రామకృష్ణ, సంజీవ్, పోరిక వనిత-రవి నాథ్, ధన్ రాజ్ నాథ్, మౌనిక-మురళి, విమల, రాధిక-బాలు, సునీత, స్వర్ణ-వినోద్, మనీ, రజిత-రవీందర్, సునీత-మోహన్, అరుణ, చుక్కిబాయి, కమల, బుజ్జి పఠాన్, పులి రాజు, బిక్షపతి, మంగ-భోజ నాయక్, ఆగి, సాల్కి, వాళ్లకి, లక్పతి, బాలాజీ, మాంగని శ్రీను, రజిత, వెంకన్న, జగన్, రాజమ్మ-వి.పి. సింగ్, యాకూబ్ అజ్మీర వెంకట్ భాస్కర్, తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నూతన వధూవరులు దివ్య-కళ్యాణ్ దాంపత్య జీవితం సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో కొనసాగాలని ఆకాంక్షిస్తూ కుటుంబ సభ్యులు, బంధుమిత్రులు, ముఖ్య నాయకులు హృదయపూర్వకంగా ఆశీర్వదించి శుభాకాంక్షలు తెలిపారు. మ్యారేజ్ రిసెప్షన్ వేడుక కుటుంబ సభ్యులు, బంధుమిత్రుల ఆనందోత్సాహాల మధ్య అంగరంగ వైభవంగా జరిగింది.



# కాళేశ్వరంలో శ్రావణ సందడి

- భక్తులతో కళకళలాడిన గోదావరి నది తీరం

మహాదేవపూర్ ఆగస్టు 14 మనం న్యూస్: కాళేశ్వర ముక్తేశ్వర స్వామివారి ఆలయ బాలాలయంలో శ్రావణమాసం మొదటి శుక్రవారం సందర్భంగా భక్తుల సందడి నెలకొంది. వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చిన భక్తులు ముందుగా గోదావరి తీరంలో పవిత్ర స్నానాలు ఆచరించి గోదావరి మాతకు ప్రత్యేక పూజలు నిర్వహించారు.అనంతరం ఆలయ బాలాలయంలో స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. పలువురు భక్తులు కాలసర్ప, శని దోష నివారణ పూజలు నిర్వహించుకుని స్వామివారి ప్రసాదాలు స్వీకరించారు.భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఆలయ ఈవో మహేష్,పాలకవర్గం ప్రత్యేక ఏర్పాట్లు చేసింది. ఆలయ సిబ్బంది భక్తులకు అవసరమైన సేవలను అందించారు.

# రజనీకాంత్ ప్రతిభ అదుర్స్

- చాక్ పీస్ పై త్రివర్ణ పతాక నిర్మాణం



కాటారం, ఆగష్టు 14మనం న్యూస్: మండల కేంద్రంలోని గిరిజన గురుకుల బాలుర కళాశాల చిత్రకళ ఉపాధ్యాయుడు ఆడెపు రజనీకాంత్ తన అరుదైన ప్రతిభతో అబ్బురపరుస్తున్నాడు. సందర్భానికి అనుగుణంగా చాక్ పీస్, బియ్యపు గింజలపై అతి సూక్ష్మ నిర్మాణాలు చేస్తూ అదుర్స్ అనిపించుకుంటున్నాడు. 80వ స్వాతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకొని చాక్ పీస్ ముక్కపై 2.6 సెంటీమీటర్ల ఎత్తు ఒక సెంటీమీటర్ వెడల్పు ఉన్నటువంటి జాతీయ జెండాను సుమారు మూడు గంటల పాటు శ్రమించి తయారు చేశారు. అదేవిధంగా 6 మిల్లీమీటర్ల ఎత్తు 4 మిల్లీమీటర్ల వెడల్పు ఉన్నటువంటి హ్యాపీ ఇండిపెండెన్స్ డే ఆంగ్ల అక్షరాలను సుమారు గంట పాటు కష్టపడి రూపొందించారు. అంతేకాకుండా 1.5 సెంటీమీటర్ల ఎత్తు ఉన్నటువంటి నాలుగు జాతీయ పతాకాలను, ఐ లవ్ ఇండియా అనే అక్షరాలను సుమారు గంటన్నర పాటు శ్రమించి గుండు పిన్ను సాయంతో స్కల్ప్చరింగ్ ఆర్ట్ ద్వారా తయారుచేసి ప్రజలకు 80 వ స్వాతంత్ర దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. రజనీకాంత్ ఇంతకుముందు ప్రపంచంలోనే అతి చిన్న జాతీయ పతాకాన్ని నాలుగు మిల్లీమీటర్ల ఎత్తుతో చెక్కి క్రెడెన్స్ బుక్ ఆఫ్ వరల్ రికార్డ్ లో చోటు సంపాదించాడు. బియ్యపు గింజలపై భారత జాతీయ గీతం జనగణమన, జాతీయ గేయం వందేమాతరం అక్షరాలను రాసి కూడా వివిధ ప్రపంచ రికార్డులను సొంతం చేసుకున్నారు. మైక్రో ఆర్ట్ లో ప్రతిభ కనబరుస్తున్న రజనీకాంత్ ను కళాశాల ప్రిన్సిపల్ సోమోజీ, వైస్ ప్రిన్సిపాల్ మాధవి, జూనియర్ వైస్ ప్రిన్సిపాల్ వెంకటయ్య అభినందించారు.

# బీజేపీ ఆధ్వర్యంలో ఘనంగా తిరంగా ర్యాలీ



- 60 మీటర్ల పొడవైన భారీ త్రివర్ణ పతాకం ప్రదర్శన

కాటారం, ఆగష్టు 14మనం న్యూస్: 80వ స్వాతంత్ర దినోత్సవ వేడుకలను పురస్కరించుకొని ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ పిలుపు మేరకు హర్ ఘర్ తిరంగా కార్యక్రమంలో భాగంగా కాటారం మండల కేంద్రంలో శుక్రవారం బిజెపి ఆధ్వర్యంలో భారీ ర్యాలీ నిర్వహించారు. బీజేపీ మండల అధ్యక్షులు పాగె రంజిత్ కుమార్ ఆధ్వర్యంలో సుమారు 60 మీటర్ల పొడవైన భారీ త్రివర్ణ పతాకాన్ని ప్రదర్శిస్తూ మండల కేంద్రంలోని ప్రధాన వీధుల గుండా ర్యాలీ నిర్వహించారు. దేశభక్తి నినాదాలతో మండల కేంద్రం మార్మోగింది. ఈ కార్యక్రమానికి అతిథులుగా బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు చంద్రుపట్ల సునీల్ రెడ్డి, చల్ల నారాయణ రెడ్డి లు హాజరై మాట్లాడారు. జాతీయ జెండా భారతదేశ సార్వభౌమత్వానికి, ఐక్యతకు, త్యాగాలకు ప్రతీక అని అన్నారు. ప్రతి ఒక్కరిలో దేశభక్తి భావాన్ని పెంపొందించడమే హర్ ఘర్ తిరంగా కార్యక్రమం ముఖ్య ఉద్దేశమని తెలిపారు. విద్యార్థులు దేశ భవిష్యత్తుకు మార్గదర్శకులని, దేశ ఐక్యత, సమగ్రతను కాపాడే బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని పేర్కొన్నారు. బీజేపీ మండల అధ్యక్షులు పాగె రంజిత్ కుమార్ మాట్లాడుతూ హర్ ఘర్ తిరంగా కార్యక్రమం ద్వారా ప్రతి ఇంటిపై జాతీయ జెండాను ఎగురవేసి దేశభక్తి స్ఫూర్తిని చాటాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షులు రాంషెటి మనోజ్, మేడిపల్లి పూర్ణచందర్, బండ శ్రీకాంత్, బీజేపీ మైనార్టీ మోర్చా అధ్యక్షులు రఫీ, కాటారం ఫర్టిలైజర్ అసోసియేషన్ అధ్యక్షుడు కవ్వాల చంద్రశేఖర్, జిల్లా కౌన్సిల్ సభ్యుడు బొమ్మన భాస్కర్ రెడ్డి, ఆకుల శ్రీధర్,బండం మల్లారెడ్డి, జిల్లా నాయకులు జిలేల శ్రీశైలం, ఐలయ్య, డోలి అర్జయ్య, గంట అంకయ్య, సభవత్ నాగరాజు మండల ప్రధాన కార్యదర్శి గోగుల రాజేష్, మంత్రి సునీల్, మండల నాయకులు ఇంజమూరి సాధనందం,ఫర్తి రెడ్డి హన్మయ్య, ముద్రకోళ్ల సుధాకర్, బొడ్డు ఆశయ్య, కేతిరి రాజయ్య ,కంకణాల మల్లారెడ్డి, రాకేష్, పసుల శివ, సాయి, వేముల లింగయ్య, పలు పాఠశాలల విద్యార్థిని విద్యార్థులు, పాల్గొన్నారు..

# సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి



కాటారం, ఆగష్టు 14 మనం న్యూస్: సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని మండల వైద్యాధికారి మౌనిక సూచించారు. కాటారం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని కాటారం గ్రామంలోని గంటగూడెం, దుబ్బగూడెం, ఏటీసీ సెంటర్, కొత్తపల్లి గ్రామంలో ఉచిత వైద్య ఆరోగ్య శిబిరాలు నిర్వహించారు. గ్రామస్తులకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. సీజనల్ వ్యాధుల తో పాటు ఎయిడ్స్ వ్యాధి నివారణ, సుఖ వ్యాధులు గనేరియా, సిఫలిస్ హెచ్ఐవి పై అవగాహన కల్పించారు. సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తప్పనిసరిగా ప్రతి శుక్రవారం, మంగళవారం డ్రై డే చేయాలని పేర్కొన్నారు. ప్రతి ఒక్కరూ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించి ఉచితంగా రక్త పరీక్షలు చేయించుకోవాలని ఆమె తెలిపారు. . ఈ వైద్య ఆరోగ్య శిబిరాలలో వైద్యులు తిరుపతి రెడ్డి, ప్రియాంక, సర్పంచులు పంతకాని సడవలి, కన్నీరు అరుణ స్వామి, ఉపసర్పంచ్ చిలుముల అశోక్, ఏఎన్ఎం లు శ్యామలత, సునీత, రజిత, ఆశలు రాజేశ్వరి, లత, స్వరూప రాణి, సుజాత, పార్వతి గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

# మున్సిపల్ కార్మికుల సమ్మెకు సంఘీభావం



భూపాలపల్లి ఆగస్టు 14 మనం న్యూస్: మున్సిపాలిటీలో పనిచేస్తున్న 152 మంది కార్మికుల వేతనాలను తగ్గించే చర్యలకు వ్యతిరేకంగా కార్మికులు చేస్తున్న సమ్మెకు మాజీ ఎమ్మెల్యే గండ్ర రమణ రెడ్డిసంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జీవో నెం.69 పేరుతో వేతనాల్లో కోత విధించవద్దని, నెలంతా పనిచేసిన తమకు పాత పద్ధతిలోనే పూర్తి వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. వేతనాల కోతతో ఒక్కో కార్మికుడికి సుమారు 1,000 నుంచి 4,900 వరకు నష్టం జరిగే పరిస్థితి ఉందని ఆవేదన వ్యక్తం చేశారు... జీతాలు ఇంక్రిమెంట్ ఉండేలా చూడాలి కానీ ఉన్న జీతాన్ని కోత విధించడమే కాకుండా ఆగష్టు 14 అయినా జీతాలు రాకపోవడం తో తెల్లారితే స్వాతంత్ర దినోత్సవం అని కానీ కార్మికులకు స్వాతంత్ర్యం లేకుండా అయిందన్నారు... తక్షణమే పాత జీవో ను రద్దు చేయాలని డిమాండ్ చేశారు... కార్మికుల వేతనాలను తగ్గించడం సరికాదని, మున్సిపల్ కౌన్సిల్ ఇప్పటికే 152 మంది కార్మికులకు ఎలాంటి కోతలు లేకుండా పాత పద్ధతిలోనే వేతనాలు చెల్లించాలని ఏకగ్రీవంగా తీర్మానించిన విషయాన్ని ఆయన ప్రస్తావించారు.. అదేవిధంగా ఏ ఐ టి యు సి నాయకులు, డి ఎస్ పి నాయకులు కూడా కార్మికులకు సంఘీభావం ప్రకటించి, వేతనాల కోతను వెంటనే నిలిపివేసి పాత పద్ధతిలో పూర్తి జీతాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. కార్మికుల సమస్యను పరిష్కరించకపోతే వారి ఆందోళనకు అండగా నిలుస్తామని తెలిపారు.

# రేషన్ కార్డులు పంపిణీకి ఏర్పాటు చేయాలి



- కలెక్టర్ రాహుల్ శర్మ

భూపాలపల్లి ఆగస్టు 14 మనం ప్రతినిధి: స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం జిల్లాలో 1,39,116 పివిసి స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీకి తగిన ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ పౌర సరఫరాల శాఖ అధికారులను ఆదేశించారు. శుక్రవారం ఐడిఓసి కార్యాలయంలో పివిసి స్మార్ట్ రేషన్ కార్డులు పంపిణీపై రెవెన్యూ, పౌర సరఫరాల శాఖ అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రేషక్ కార్డు కలిగిన ప్రతి కుటుంబానికి స్మార్ట్ రేషన్ కార్డులు అందేలా ప్రభుత్వం జారీ చేసిన ఆదేశాల మేరకు ప్రణాళికతో పంపిణీ చేపట్టాలని ఆదేశించారు. జిల్లా స్థాయిలో స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ ప్రక్రియ ప్రభుత్వ విప్ యెన్నం శ్రీనివాస రెడ్డి, శాసనసభ్యులు గండ్ర సత్యనారాయణరావు ప్రారంభించనున్నారని తెలిపారు. ప్రారంభం తదుపరి అన్ని మండలాలలో పంపిణీ ప్రక్రియ చేపట్టాలని, లబ్ధిదారులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా, ప్రక్రియను పూర్తి చేయాలని పౌర సరఫరాల శాఖ అధికారులను ఆదేశించారు.

15వ తేదీన ఐడిఓసి కార్యాలయంలో మధ్యాహ్నం 2 గంటలకు పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించనున్నారని ఆయన తెలిపారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్లు అశోక్ కుమార్, విజయలక్ష్మి, పౌర సరఫరాల అధికారి కిరణ్ కుమార్, శిక్షణా డిప్యూటీ కలెక్టర్ నవీన్ రెడ్డి పాల్గొన్నారు.

# పీడీఎస్ బియ్యం పట్టివేత




భూపాలపల్లి, ఆగష్టు 14 మనం ప్రతినిధి: ప్రజా పంపిణీ వ్యవస్థ ద్వారా పేద ప్రజలకు చెందా ల్సిన గద్దల పాలు అవుతోంది. పోలీసులు ఈ దందాకు అడ్డు కట్ట వేసే ప్రయత్నంలో ప్రతీ రోజు దాడులు జరుపుతున్నప్పటికి పూర్తి స్థాయిలో కట్టడి చేయలేక పోతున్నారు. జిల్లా లోని ఘనపురం పోలీస్ స్టేషన్ పరిధిలో అక్రమంగా నిల్వ ఉంచిన సుమారు 5 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని సిసి ఎస్ పోలీసులు శుక్రవారం నాడు స్వాధీనం చేసుకున్నారు. ఈ ఘటనకు సంబంధించి ఒక వ్యక్తిని అదుపులోకి తీసుకున్నారు. విశ్వసనీయ సమాచారం మేరకు తనిఖీలు చేపట్టగా, రవినగర్, గ్రామానికి చెందిన తుర్పాటి రాజశేఖర్ అక్రమంగా బియ్యాన్ని నిల్వ ఉంచినట్లు గుర్తించారు. దీంతో అతని వద్ద ఉన్న సుమారు 5 క్వింటాళ్ల బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. అనంతరం నిందితుడు తుర్పాటి రాజశేఖర్ను, స్వాధీనం చేసుకున్న బియ్యాన్ని తదుపరి చట్టపరమైన చర్యల నిమిత్తం ఘనపురం పోలీస్ స్టేషన్కు అప్పగించారు. బియ్యాన్ని అక్రమంగా నిల్వ చేయడం, రవాణా చేయడం, విక్రయించడం వంటి చర్యలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని పోలీసులు తెలిపారు.

# ఎండిన చెట్లను తొలగించే బాధ్యత ఎవరిదీ..?

## మనం న్యూస్ కథనానికి స్పందించిన ఫారెస్ట్ అధికారులు.. ప్రమాదకర చెట్టు తొలగింపు



ఏటూరునాగారం, ఆగస్టు 14, మనం ప్రతినిధి: పస్రా-తాడ్వాయి మధ్య జాతీయ రహదారి-163కు ఆనుకుని ప్రమాదకరంగా ఉన్న ఎండిన చెట్లపై 'మనం'లో ప్రచురితమైన కథనానికి ఫారెస్ట్ అధికారులు స్పందించారు. రహదారిపైకి వాలిపోయి వాహనదారులకు ప్రమాదకరంగా మారిన చెట్టును ఫారెస్ట్ సిబ్బంది తొలగించారు. రహదారి పక్కనే ఎండిపోయిన భారీ చెట్లు ఉండటంతో ఎప్పుడు కూలుతాయోనని వాహనదారులు, ప్రయాణికులు ఆందోళన చెందుతున్న విషయాన్ని కథనం ద్వారా అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. ముఖ్యంగా పస్రా-తాడ్వాయి మార్గంలో నిత్యం వాహనాల రాకపోకలు సాగుతుండటంతో ప్రమాదం జరిగే అవకాశం ఉందని పేర్కొన్నారు. కథనం వెలువడిన వెంటనే స్పందించిన ఫారెస్ట్ అధికారులు ప్రమాదకరంగా ఉన్న చెట్టును గుర్తించి తొలగించే చర్యలు చేపట్టారు. దీంతో వాహనదారులు, స్థానికులు హర్షం వ్యక్తం చేశారు. ఇదే విధంగా రహదారికి ఆనుకుని ప్రమాదకరంగా ఉన్న ఇతర ఎండిన చెట్లను కూడా గుర్తించి ముందస్తుగా తొలగించాలని వారు కోరుతున్నారు. కథనానికి స్పందించి వెంటనే చర్యలు చేపట్టిన ఫారెస్ట్ అధికారులకు స్థానికులు, వాహనదారులు కృతజ్ఞతలు తెలిపారు.

# కమలాపురం శివారులో యువకుడి హత్య




కమలాపురం, ఆగస్టు 14, మనం ప్రతినిధి: కమలాపురం గ్రామ శివారులోని పుల్లంకట్టి శ్యామ్కుమార్ వ్యవసాయ భూమిలో పనిచేసుకుంటున్న 32 ఏళ్ల యువకుడు తాటి శ్యాంకుమార్ హత్యకు గురయ్యాడు. ఈ ఘటనకు సంబంధించి భార్యాభర్తలను పోలీసులు అరెస్టు చేసి రిమాండ్కు తరలించారు. పోలీసుల వివరాల ప్రకారం.. పూర్వపల్లి గ్రామానికి చెందిన కొప్పుల నర్సింహారావు (40), అతని భార్య కొప్పుల లక్ష్మి (55), మరో వ్యక్తి తాటి శ్యామ్కుమార్ (32) కొంతకాలంగా వ్యవసాయ పనులు చేసుకుంటూ ఒకే చోట ఉంటున్నారు. ఈ క్రమంలో శ్యామ్కుమార్ నర్సింహారావు భార్య లక్ష్మితో అనుచితంగా ప్రవర్తిస్తున్నాడని నర్సింహారావు పలుమార్లు హెచ్చరించినట్లు పోలీసులు తెలిపారు. ఈ నేపథ్యంలో ఈ నెల 12న రాత్రి 10 గంటల సమయంలో శ్యామ్కుమార్, నర్సింహారావు మధ్య మరోసారి గొడవ జరిగింది. తన భార్యను తన వద్దకు పంపాలని శ్యామ్కుమార్ అసభ్యంగా మాట్లాడటంతో ఆగ్రహానికి గురైన నర్సింహారావు, అతని భార్య లక్ష్మి కలిసి శ్యామ్కుమ్పా దాడి చేసినట్లు పోలీసులు తెలిపారు. తీవ్రంగా గాయపడిన శ్యామ్కుమార్ మృతి చెందినట్లు పేర్కొన్నారు. ఘటన అనంతరం నిందితులు కమలాపురం గ్రామ శివారులోని అంజనేయస్వామి గుడి సమీపంలో ఉన్నట్లు పోలీసులకు సమాచారం అందింది. దీంతో సర్కిల్ ఇన్స్పెక్టర్ జి. సూర్యప్రకాశ్, మంగపేట ఎస్సై టీవీఆర్ సూరి సిబ్బందితో కలిసి అక్కడికి వెళ్లి నిందితులను అదుపులోకి తీసుకున్నారు. హత్యకు ఉపయోగించిన ఆయుధాన్ని స్వాధీనం చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు. అనంతరం నిందితులను అరెస్టు చేసి న్యాయస్థానంలో హాజరుపరిచారు. కోర్టు ఆదేశాల మేరకు వారిని జ్యుడీషియల్ కస్టడీకి తరలించినట్లు పోలీసులు వెల్లడించారు.

# గరీబోళ్లం.. కాస్త గడువు ఇవ్వండి

- మాజీ ఎంపీపీ యాదగిరి యాదవ్ నేతృత్వంలో వినతి పత్రం అందజేత



పటాన్ చెరు, ఆగస్టు 14 (మనం న్యూస్): తరతరాలుగా ఇక్కడే జీవిస్తున్నాం... రెక్కాడితే కానీ డొక్కాడని బతుకులు మావి. ఒక్కసారిగా ఇళ్లు ఖాళీ చేయమంటే మా కుటుంబాలు ఎక్కడికి వెళ్లాలి? మా బాధను అర్థం చేసుకుని కాస్త సమయం ఇవ్వండి... అంటూ బండలగూడ రైల్వే భూముల నిర్వాసితులు రైల్వే అధికారులను కన్నీటి పర్యంతంగా వేడుకున్నారు. బండలగూడ గ్రామంలో సుమారు 50 సంవత్సరాలుగా స్థిర నివాసం ఏర్పరచుకుని జీవిస్తున్న తమకు మానవీయ దృక్పథంతో తగిన సమయం ఇవ్వాలని కోరుతూ నిర్వాసితులు శుక్రవారం సికింద్రాబాద్లోని రైల్వే శాఖ డివిజనల్ మేనేజర్ కార్యాలయానికి వెళ్లి అడిషనల్ డివిజనల్ మేనేజర్ ముత్యాల నాయుడుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా నిర్వాసితులు తమ ఆవేదనను అధికారుల ముందు వ్యక్తం చేశారు. తమ ముత్తాతలు, తాతలు, తండ్రుల కాలం నుంచి బండలగూడలోనే నివాసం ఉంటూ జీవనోపాధి కొనసాగిస్తున్నామని తెలిపారు. ఏళ్ల తరబడి ఇక్కడే ఉంటున్నాం. ప్రభుత్వానికి ప్రతి సంవత్సరం పన్నులు చెల్లిస్తున్నాం. ప్రభుత్వం కూడా తమకు అవసరమైన మౌలిక వసతులు కల్పించింది. ఇలాంటి పరిస్థితుల్లో రైల్వే భూముల పేరుతో ఒక్కసారిగా ఇళ్లు ఖాళీ చేయాలంటూ నోటీసులు రావడం మమ్మల్ని తీవ్ర దిగ్భ్రాంతికి గురిచేసింది అని వారు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ నెల 7వ తేదీన ఇళ్లు వెంటనే ఖాళీ చేయాలంటూ రైల్వే అధికారులు నోటీసులు అందజేశారని తెలిపారు. ఒక్కసారిగా ఇళ్లు ఖాళీ చేయాల్సి వస్తే వృద్ధులు, మహిళలు, చిన్నారులతో ఉన్న కుటుంబాల పరిస్థితి ఏమిటని ప్రశ్నించారు. తమకు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసుకునేంత వరకు కనీసం కొంత సమయం ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. నిర్వాసితుల ఆవేదనను విన్న అడిషనల్ డివిజనల్ మేనేజర్ ముత్యాల నాయుడు సానుకూలంగా స్పందించారు. వారి పరిస్థితిని దృష్టిలో ఉంచుకుని నెల రోజుల గడువు ఇస్తామని హామీ ఇచ్చారు.

దీంతో నిర్వాసితులు కొంత ఊరట వ్యక్తం చేశారు. తమ కుటుంబాల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని అధికారులు, ప్రజాప్రతినిధులు కలిసి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో చంద్రశేఖర్, విక్రమ్, శ్రీరాములు, దశరథ్, బండలగూడ నిర్వాసితులు పాల్గొన్నారు.

# రైల్వే రోడ్డు ఏర్పాట్ల పరిశీలన



హిందూపురం, ఆగస్టు 14 (మనం న్యూస్): హిందూపురం ఎమ్మెల్యే పద్మభూషణ్ నందమూరి బాలకృష్ణ ఆదేశాల మేరకు హిందూపురం అభివృద్ధి పనుల్లో భాగంగా హిందూపురం నడిబొడ్డున ఉన్న రైల్వే రోడ్డు ప్రారంభోత్సవానికి సిద్ధంగా ఉండడంతో ఆగస్టు 15 న జాతీయ పండుగ సందర్భంగా నిర్వహించనున్న కార్యక్రమానికి సంబంధించిన ఏర్పాట్లను శుక్రవారం పరిశీలించడం జరిగింది.ఈ కార్యక్రమంలో బాలకృష్ణ వ్యక్తిగత కార్యదర్శులు డాక్టర్ సురేంద్ర, వీరయ్య, బాలాజీ , పట్టణ అధ్యక్షులు ప్రెస్ వెంకటేష్ , నాగరాజు , మాజీ మున్సిపల్ చైర్మన్ డి.ఈ. రమేష్ , మైనారిటీ ఆర్ఎంఎస్ షఫీ , డైమండ్ బాబా , అమర్నాథ్ , చంద్ర , రఘు, రాజు, అశోక్, ఐటీడీపీ నవీన్, తదితర నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# పచ్చని చెట్లు ప్రగతికి మెట్లు

- ఇంటింటా చెట్టు ఊరంతా వనం




హిందూపురం, ఆగస్టు 14 (మనం న్యూస్): పద్మభూషణం నందమూరి బాలకృష్ణ ఆదేశాల మేరకు హిందూపురం ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ వ్యక్తిగత కార్యదర్శి వీరయ్య,రాష్ట్ర వాల్మీకి కార్పొరేషన్ డైరెక్టర్ ఆనంద్, హిందూపురం రూరల్ మండలం బేవనహళ్లి పంచాయితీ నక్కలపల్లి గ్రామం నందు శుక్రవారం మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టారు.గ్రామంలో సత్తెమ్మ గుడి దగ్గర మై ఇండియా మై విజన్ మొక్కలు నాటే కార్యక్రమంలో భూమి పూజలో ఎంపీటీసీ నాగరాజు, నారాయణరెడ్డి ,ఫీల్ అసిస్టెంట్ సోమయ్య ,గ్రామ కమిటీ అధ్యక్షుడు మారుతీ, స్టోర్ డీలర్ అధ్యక్షులు గోపాల్ రెడ్డి, ఆయకట్టు చైర్మన్ బాబురెడ్డి, అంజిన రెడ్డి,ఆయకట్టు చైర్మన్ గోపాలప్ప,విద్య కమిటీ చైర్మన్ నరసింహామూర్తి,,గ్రామ కమిటీ వైస్ అధ్యక్షులు చిన్న రాజు ,కుమార్ ఐటీడీపి మంజు,తెలుగు యువత రూరల్ మండల అధ్యక్షులు రామకృష్ణ ,బాబు బీసీ సెల్ రూరల్ మండల్ అధ్యక్షులు, తెలుగుదేశం నాయకులు కార్య కర్తలు పాల్గొనడం జరిగింది.





















Printed and Published by VUPPARI RAMESH KUMAR on behalf of Navatharam Publications Private Limited, Printed at Sree Seshasai Enterprises Plot No:19, IDA Balanagar, Medchal-Malkajgiri Dist, Hyderabad-500037.Telangana state and Published From : Samrat Complex, Block A , Flat No : 8A, Saifabad, OPP : A G Office, Beside: Aranya Bhavan, Hyderabad, Pin : 500004, Telangana State, EDITOR: VUPPARI RAMESH KUMAR. RNI Reg No.TELTEL/2016/72952.